# కుంభయుగ చైతన్యము
# మాస్టర్ సి.వి.వి.



మాస్టర్ పార్వతీకుమార్



యుగ పురుషులు - మాస్టర్ సి.వి.వి.

# కుంభయుగ చైతన్యము - మాస్టర్ సి.వి.వి.

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2022 మే కాల్ డే

ప్రతులు : 1,000

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

వెల : **రూ. 100-00**

ప్రతులకు :
**ధనిష్ఠ ఫౌండేషన్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం – 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.

website : www.dhanistha.org
info@dhanistha.org

ముద్రణ :
**ఓం నమశ్శివాయ జెరాక్స్**
మహారాణిపేట, విశాఖపట్నం.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

సంకలనకర్త : **మాస్టర్ పార్వతీకుమార్**

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 30 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో "**డాక్టర్ ఆఫ్ లెటర్స్**" పట్టా నందించినది. 2O13వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత

అలరారినప్పడే దానికి సాఫల్యత, సార్ధకత ఉండునని, *"మానవ సేవయే మాధవసేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. మాస్టర్ పార్వతీకుమార్ గారు బాధ్యతగల గృహస్తులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తననుతాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాలరనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్ గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. *"పరహితము పరమధర్మ"* మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించు చున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

మాస్టర్‌సి.వి.వి.యుగపురుషులు.కుంభయుగచైతన్యమును భూమిపై ప్రసరింపజేసిన మహా సిద్ధులు. అగస్త్యాశ్రమ వాసులు. అమృతత్త్వము, బ్రహ్మత్వము భౌగోళికముగ సంతర్పణము చేయుటకై అవతరించినవారు. సాధకులలో గ్రహగతులను చక్కజేసి అమృతత్త్వమును, బ్రహ్మత్వమును అనుభూతిపరముగ స్థిరపరచు యోగము నిచ్చినవారు.

సత్యలోకము నుండి దిగివచ్చిన బ్రహ్మ సంకల్పము తానందుకొని, భూమికిని భూమి ప్రజలకును పరిణామగతిలో వేగమును పెంచినవారు. వాని వివరములు పుస్తకమున తెలుపబడినవి. విశ్వప్రణాళికలో భాగముగ వారు కుంభకోణమున జన్మించి, లోకోత్తరమగు కార్యమును నిర్మలముగ, నిశ్శబ్దముగ నిర్వర్తించినారు.

మాస్టరుగారి జీవితము, వారందుకొన్న బ్రహ్మ సంకల్పము, వారందించిన యోగము వారితో జతకట్టి హిమాలయ పరంపర యోగమును విస్తారము చేయుట – ఇత్యాది అంశములతో ముప్పది సంవత్సరముల క్రితము ఈ పుస్తకము ఆంగ్లమున వెలువడినది. భౌగోళికముగ ఇందలి విషయములు వివరింపబడినవి. రెట్టించిన ఉత్సాహముతో వారిచ్చిన మే కాల్, డిసెంబర్ కాల్ ఉత్సవములు


జరుపబడు చున్నవి. పాశ్చాత్య దేశములలోని జర్మనీ, ఫ్రెంచ్, స్పానిష్, రష్యన్, పోలిష్ భాషలలో ఇదివరకే అనువదింపబడినది. చిట్టచివరికి మాస్టరుగారి మాతృభాషయైన తెనుగులోనికి అనువదింపబడి, ప్రచురింపబడుట లీలార్థమే. ఈ కార్యక్రమమునకు పూనుకొనిన **శ్రీ అన్నలూరు రామ కోటేశ్వరరావుగారు**, వారి **శ్రీమతి లక్ష్మీ ప్రసన్న** మాస్టరుగారి వసుధైక కుటుంబములో ముఖ్యమైన సభ్యులు. ఈ అనువాదమునకు తోడ్పడిన జగద్గురుపీఠం తపోవన బృందము మరియు ధనిష్ఠ కార్యవర్గము ఇతోధికముగ మాస్టరు గారి అనుగ్రహమునకు పాత్రులైనారు.

ఈ పుస్తకమునకు 'మాస్టరు యోగ' నందు గల అన్ని వర్గములు ఆకర్షింపబడినవి. దీనిని భక్తిశ్రద్ధలతో పఠించినవారు తప్పక మాస్టర్ స్పర్శ పొందగలరు.

ఇది సత్యం.

మే కాల్ డే - **పార్వతీకుమార్**


29-5-2022



మాస్టర్ సి.వి.వి.

## The Natal Chart of Master CVV

*(04-08-1868, 10.20 a.m., Kumbakonam, Tamil Nadu)*




| | | | | | |
|---|---|---|---|---|---|
| AC | 17°27 | ♎ | ♃ ℞ | 14°14 | ♈ |
| MC | 16°04 | ♋ | ♄ | 29°04 | ♏ |
| ☉ | 12°02 | ♌ | ♅ | 14°53 | ♋ |
| ☽ | 19°46 | ♒ | ♆ ℞ | 17°16 | ♈ |
| ☿ | 22°52 | ♋ | ♇ | 17°01 | ♉ |
| ♀ ℞ | 16°47 | ♋ | ☊ | 26°38 | ♌ |
| ♂ | 23°15 | ♊ | | | |

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | వైభవోపేతమైన జీవనము | ...... | 13 |
| 2. | సమన్వయ శక్తి | ...... | 22 |
| 3. | విధానము | ...... | 28 |
| 4. | మాస్టర్ మెకానిక్ | ...... | 46 |
| 5. | స్వస్థత నిచ్చు శక్తి | ...... | 53 |
| 6. | మాస్టరుగారి యోగము | ...... | 57 |
| 7. | ధనిష్ఠ | ...... | 62 |
| 8. | ఆధ్యాత్మికతయే సహజ స్థితి | ...... | 73 |
| 9. | భార్య – భర్తలు | ...... | 83 |
| 10. | నేను | ...... | 90 |
| 11. | మాస్టరుగారి వాగ్దానములు | ...... | 109 |
| 12. | మాస్టరుగారు మరియు గ్రహములు | ...... | 120 |
| 13. | గురుపరంపర | ...... | 132 |
| 14. | కుంభయుగము | ...... | 141 |
| 15. | యోగావతరణము | ...... | 159 |
| 16. | జీవితము, ఒక సంతోషకరమైన ప్రయాణము | ......... | 171 |
| 17. | అవరోహణ | ......... | 177 |

# కుంభయుగ చైతన్యము -
# మాస్టర్ సి.వి.వి.

# 1. వైభవోపేతమైన జీవనము

*''వైభవోపేతమైన ఆధ్యాత్మిక జీవనము''*

ఎప్పుడైతే జ్ఞానమనే వెలుగును చీకటి కప్పివేయజూస్తుందో అప్పుడు దైవము మన మధ్యకు ఒక గురువుగా దిగివస్తాడు. ఆ గురువు జ్ఞానమనే వెలుగును బలపరచి తన ప్రేమామృతమును చుట్టూ ప్రసరింప చేస్తాడు. దీనికై ఎన్నుకొనబడిన వ్యక్తి గురువుగా దిగివస్తాడు. మానవాళికి సేవ చేసేందుకు ఆయన సంసిద్ధుడు కనుక ఆయన దైవము యొక్క వాహికగా ఎన్నుకొన బడతాడు. ఆయనకు దైవ వ్యూహము, అందులో తన పాత్ర తెలుస్తాయి. ఆయన ఎవరి మధ్యకు దిగిరావాలో తెలుస్తుంది. తన స్వంత ప్రణాళిక అనునది లేక, భగవత్ ప్రణాళికను ఆయన నిర్వర్తిస్తాడు.

అటువంటి గురువులు అప్పుడప్పుడు భూమిపైకి దిగివచ్చి మనతో కలసిమెలసి వుంటారు. వారు సాధారణ జీవితాన్ని గడుపుతూ మనలను మనమున్న స్థితినుండి మన నిజస్థితికి తీసుకొని వెడతారు. వారు ప్రతి ఒక్కరూ నామరూపాతీతమైన దైవాన్ని తెలుసుకొని దైవసేవకులుగా జీవిస్తారు. అలాంటి వారు భిన్న ప్రదేశములనుండి  వచ్చినను, విభిన్నమైన భాషలు మాట్లాడినను, భిన్నమైన మార్గములలో బోధ చేసినను, మూల తత్వముతో ఒకటిగా వుండి దైవాన్ని సేవిస్తారు.

వారి వేషభాష లన్నియు వారు అవతరించిన చోటుకు, వారితో కూడిన బృందములకు అనుగుణముగా వుంటాయి. ముఖ్యమైన విషయ మేమిటంటే వారి బోధనలు దేశ కాల పరిస్థితులనుబట్టి ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని ఏ గురువు జీవితాన్నైనా గమనించవలసి ఉంటుంది.

మాస్టర్ సి.వి.వి. గారు 1868 వ సంవత్సరం ఆగష్టు 4వ తేదీన దక్షిణ భారతదేశములోని పుణ్యక్షేత్రమైన కుంభకోణ పట్టణములో జన్మించారు. ఆయన నుండి వెలువడిన పరిపూర్ణ జ్ఞానము, పరిపూర్ణమైన ఆయన జీవితమువలె ప్రతి విషయములోనూ గోచరించుచుండేది.

కుంభకోణము అను పదమునకు అర్థము కుంభరాశికి చెందినది. కుంభ చైతన్యమును అందించిన మాస్టరుగారు ఆ పట్టణములో జన్మించినారనుటలో ఆశ్చర్యమేమియును లేదు. ఆ పట్టణము సనాతన ధర్మమునకు పట్టుకొమ్మ. మాస్టరుగారు కూడ సనాతన ధర్మమునకు చెందిన కుటుంబములో జన్మించారు. వారు సనాతన ధర్మములో నిష్ణాతులై, దానికి అతీతమైన ధర్మమును నవీనముగా అందించుట వారి ప్రజ్ఞా విశేషము.

ఏడవ సంవత్సరములో ఇవ్వబడు ఉపనయన దీక్షను వారు గౌతమబుద్ధుని వలె ఐదవ సంవత్సరములోనే స్వీకరించారు.18వ సంవత్సరము వచ్చు లోపలనే సంస్కృతములోనున్న మొత్తము జ్ఞానాన్ని ఔపోసన పట్టారు. వేద పఠనములోనూ, వేదమును జీవితమునకు అన్వయించుటలోనూ ఆయన సిద్ధహస్తుడు.

సంస్కృతము, తెలుగు, తమిళము, ఆంగ్ల భాషలలో వారు అనర్గళమైన పాండిత్యాన్ని గడించారు. ఆధ్యాత్మిక విద్యకు భవిష్యత్తులో రాబోవు శతాబ్దములలో సంస్కృతము యొక్క స్థానాన్ని ఆంగ్లము ఆక్రమించబోవు చున్నదని వారు గ్రహించారు. అందువలన వారు ఆంగ్లము పట్ల మక్కువ చూపుట మనము అర్థం చేసుకొనవచ్చును.

18 సంవత్సరముల వయస్సులో తత్త్వశాస్త్ర గ్రంథముల అధ్యయనము ప్రారంభించారు. వారు చివరి వరకు Theosophical Society సభ్యుడుగా వున్నారు. వారి వేద పరిజ్ఞానము తత్త్వశాస్త్ర వాఙ్మయమును పరిపూర్ణముగా అర్థము చేసుకొనుటకు తోడ్పడినది. గురుపరంపర అందించిన విజ్ఞానాన్ని మేడమ్ బ్లావెట్స్కీ సరియైన కోణములో గ్రహించి, అది పశ్చిమ దేశాలకుకూడా అందింపబడినదని గుర్తించారు. స్థూల భౌతిక పదార్థము వెనుక సూక్ష్మతరమైన శక్తులుగా కాంతి, రంగులు, శబ్దము ఉన్నాయన్న అవగాహన ఆ రచనల ద్వారా పశ్చిమ దేశాలకందినదని వారు గమనించారు. భారతీయులు మేడమ్ బ్లావెట్స్కీ (H. P. B.) ఇచ్చిన జ్ఞానాన్ని సరిగా అవగాహన లేకుండా ఆమె చెప్పినవన్నీ తమకు తెలుసు ననుకున్నారని, సనాతన ధర్మ మార్గములో ఉన్న భారతీయులుకూడ ఆమె ఇచ్చిన జ్ఞానాన్ని సరిగా గ్రహించ లేకపోయారని వారు అర్థము చేసుకున్నారు. ఆమె చాలా ఉన్నత స్థితికి చెందిన సిద్ధురాలని, అంతరిక్ష తరంగములలో భద్రపరుపబడిన కాల గమనానికి చెందిన సమాచారమును

గ్రహించి ఇచ్చారని గ్రహించారు. H. P. B. గారిచే తెలుపబడిన జ్ఞానమును కలుపుకొని, ఇంకను తెలుపబడని విషయములను జతచేసి, ఈ అంతటినీ గురుపరంపర వ్యూహము ప్రకారం భూమికి అందించబడడానికి సరియైన వ్యక్తిగా ఎన్నుకొనబడిన మాస్టర్ సి. వి. వి. గారు తనదైన శైలిలో కొత్త ప్రయోగములు చేయదలిచారు.

మాస్టరుగారు సామాన్యునివలె జీవించేవారు. 12వ సంవత్సరములో వారు శ్రీమతి రుక్మిణమ్మ గారిని వివాహమాడారు. ముగ్గురు కుమారులను, ముగ్గురు కుమార్తెలను పొందారు. 36వ సంవత్సరములో ఆమె స్వర్గస్తురాలుకాగా, 38 వ సంవత్సరములో శ్రీమతి వెంకమ్మగారిని వివాహమాడారు. వెంకమ్మగారికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కలిగారు. మాస్టరుగారి జీవితములో వెంకమ్మగారి ప్రవేశము వారి యోగ జీవితమునకు ఒక మైలురాయి అని చెప్పవచ్చును. విశాల విశ్వమునకు చెందిన జ్ఞానమును తెలుసుకొనుటకు, ఆధ్యాత్మిక శాస్త్ర పరిశోధనలు చేయుటకు, వెంకమ్మగారు వారికి ఒక వాహికగా సహకరించారు. ఆమె ఎంతో జ్ఞాని, సిద్ధురాలు కానిచో అట్లు పనిచేయుట సాధ్యమయ్యేది కాదు. H.P.B. గారి ప్రజ్ఞా శరీరము (Etheric body) ఆమెతో సహకరించినదని కొందరు భావిస్తే, H.P.B. గారే వెంకమ్మగారిగా జన్మ తీసుకున్నారని కొందరనుకుంటారు.

కుంభకోణ పట్టణములో వారు ప్రముఖ వ్యక్తిగా వుండి, ఆ పట్టణము మేయర్‌గా సేవ లందించారు. ఆ పట్టణములోని రాజవంశీకులు, జమీందారులు, ప్రముఖ వ్యక్తులు వారికి

తెలియకుండానే మాస్టరుగారిపట్ల ఆకర్షితులయ్యేవారు. వారి సహచర్యమును ఎప్పుడూ కోరుకునేవారు. వారు చాలా ఉన్నత స్థాయికి చెందిన గాత్ర విద్వాంసులు. కావేరీ నదిగట్టుపై కూర్చుని, వారు గానము చేస్తుంటే ఆయన చుట్టూ చేరిన అన్ని జీవులు ఆనంద పారవశ్యములో మునిగిపోయేవి.

ఆర్థికరంగంలో వారికి చాలా వ్యాపారాలలో పరిచయం ఉండేది. వారు చాలా ఆస్తిపాస్తులను సంపాదించారు. వాని నన్నిటిని ఒకదాని తరువాత ఒకటిగా తనను ప్రేమించి, తన వద్దకు ప్రతిదినము చేరినవారికి భోజనాదికములు కల్పించుటకై పూర్తిగా అమ్మివేశారు. ప్రొద్దుట ఉపాహారము మొదలుకొని 12-16 పదార్థములతో కూడిన మధ్యాహ్నా, రాత్రి భోజనములతో, ప్రతిదినము ఒక పండుగలా వచ్చినవారికి వడ్డింపబడేవి. ఒక ముఖ్యమైన విషయ మేమిటంటే వారు దేహము వదలునప్పటికి వారి కుటుంబమునకు ఒక ఇంటిని మాత్రము వదలి వెళ్ళారు.

అలా వారు తాము వచ్చిన పనికై నిశ్శబ్దముగా ప్రయోగములు చేయుచు, అన్ని విధములైన పరిపూర్ణమైన జీవితము నడపవలసిన అవసరము, అందలి సాధ్యాసాధ్యములు నిరూపించి చూపారు.

అలావారు Energies of Synthesis ను (శక్తుల – సమన్వయము) పూర్తిగా అందుకొనుటకు, దానిని ఈ భూగోళమునకు పంచి ఇచ్చుటకు ఒక వాహికగా తయారైనారు.

అది 1910 సంవత్సరము. అప్పటికి వారి వయస్సు 42 సంవత్సరములు. 31 మార్చి 1910 సంవత్సరము అర్ధరాత్రి

సమయములో ఆ శక్తి భూమికి తాకి మాస్టర్ CVV గారిలోనికి దిగి వచ్చినది. ఆ సంవత్సరము "హేలీ" అను తోకచుక్క మన సూర్య మండలమును ప్రవేశించినది. ఆ శక్తి పిడుగువంటి శబ్దముతో ఒక మెఱుపువలె మాస్టరుగారి ఇంటిని తాకినది. ఆ తాకిడికి చుట్టుప్రక్కల నున్న పరిసరములు కంపించినవి. అందరి గుండెలు వణకిపోయినవి. ఏదో ప్రమాదము జరిగిపోయినదన్న భయముతో ఆ చుట్టుప్రక్కలవారు వారి ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చారు. అప్పుడు మాస్టరుగారు ధ్యాన నిమగ్నులై, అపరిమితమైన కాంతి వారిచూట్టూ ప్రకాశించు చుండగా వారు కూర్చొని ఉండుట గమనించారు. ఆశ్చర్యకరమైన ఆ కాంతిని చూచి వారు వెనుదిరిగారు. తరువాతి ఉదయము వారు ధైర్యమునుకూడ గట్టుకొని వారిని సమీపించారు.

అప్పుడు వారు కనులు తెరచి భయపడవలసినదేమీ లేదని, తాను విశిష్టమైన శక్తిని పైనుండి అందుకొన్నానని, తాను దానిని భూమికి, భూమిజీవుల ప్రయోజనము కొరకు ఉపయోగించ గలనని తెలిపారు. అందులకై తాను దానిని అవగాహన చేసుకొని దానితో ప్రయోగములు చేసిన పిమ్మట వారికి తెలియచేస్తానని తెలిపారు.

వారి దృష్టిలో అందరూ ఒకటే. అటు తరువాత, ఆయనను ఆ వీధిలో చూచినప్పుడు జనులు గౌరవముతో లేచి నిలబడేవారు.

అందరి కళ్ళూ ఆయనపట్ల ఆకర్షింపబడేవి. వారు నడుస్తున్నపుడు, భూమిపై తేలుతున్నట్లనిపించేది. ఒక రోజు రాత్రి

పిండిమిల్లులో దంచునపుడు వచ్చు శబ్దములవంటి కొత్త శబ్దములు వారి ఇంటినుంచి రాగా చుట్టుప్రక్కల వారందరూ ఆ శబ్దములకు మేల్కొని వారి ఇంటికి పరిగెత్తుకొని వెళ్ళారు. వారు నిశ్చలమైన సమాధి స్థితిలో నున్నారు. వారి గుండెచప్పుడు పిండిమిల్లులో దంచునపుడువచ్చు శబ్దములవలె వచ్చుట చూచి అవాక్కయిరి. ఇంకొకరోజు ఏకధాటిగా 6 గంటలు శ్వాస లోనికి పీల్చి, 6 గంటలు శ్వాస వదలి, ఇంకొక 6 గంటలు శ్వాస తీసుకోకుండా ఉండుట చూచిరి. వారు వెంకమ్మగారి సూక్ష్మశరీరమును, వారి కుమారుడు చందు సూక్ష్మశరీరమును, వారి శిష్యుడు సుందరం సూక్ష్మశరీరములను, విశ్వములోని విషయములను సేకరించుటకు పైకి పంపిరి. మానవ దేహముల నిర్మాణమును, దానిని అమృతత్త్వ సిద్ధికి అనుగుణముగా మలచుటకు చాలా ప్రయోగములు చేసిరి. చాలాసార్లు చనిపోయిన వారికి, విశ్వములోని ముఖ్య ప్రాణమును ఈ భూమిపై ప్రాణముతో అనుసంధానముచేసి, చనిపోయిన వారిని పునరుజ్జీవింప చేయవచ్చునని నిరూపించిరి. వారు గ్రహప్రజ్ఞలతో అనుసంధానము జరిపి, మన భూమితో వానికి సంబంధము లేర్పరచిరి. అటువంటి సదుపాయములను వారు తనదైన శైలిలో contracts అని తెలిపెడివారు. వారు పవిత్రమైన శబ్దములతో మానవుని మనోలోకమును సరిదిద్దుటకు, శబ్దములతో కూడిన మంత్రముల నేర్పరచి ప్రయోగములు చేసిరి. వాస్తవమునకు వారు కుంభయుగమునకు చెందిన ఆధ్యాత్మిక శాస్త్రవేత్త. వారు ఆధ్యాత్మిక విద్యకు శాస్త్రపరమైన త్రోవ చూపినారు.

ముందు తెలిపినట్లే తన ప్రయోగములనుండి వెలుపలికి వచ్చి, ప్రజలలోనికి వచ్చినారు. "Yoga School Friends Society"ని స్థాపించి ప్రముఖ ఆంగ్లదినపత్రిక The Hinduలో ఒక ప్రకటన వేయించారు. అదేమిటంటే 'మరణించరాదని భావించువారు నన్ను కలవండి.' కొంతమంది ఆయనను పిచ్చివాడని, కొందరు అదేదో నిగూఢమైనదని భావించగ, ఆలోచనాపరులు మాత్రము ఆయనను చేరారు.

ఆయన చూపిన మార్గము, పద్ధతులు, నిర్వహించిన పనులు ముందు ప్రకరణములలో వివరముగా తెలుపబడతాయి. ఇక్కడ కొన్ని విషయములు తెలుసుకొందాము.

* వారు అన్నిరంగములలో పరిపూర్ణమైన జీవనమును జీవించి, పరిపూర్ణమైన జీవనమునే బోధించారు.
* ఇప్పటి కాలమునకు శబ్దోపాసనమే తరణోపాయమని ప్రతిపాదించి CVV అను శబ్దముద్వారా సమన్వయాత్మక శక్తిని అందించారు.
* వివిధ ఉపాసనలకు భిన్నమైన మంత్రము లున్నట్లు, వారు వేరు వేరు కారణములకు వేరు వేరు కోర్సులను అందించారు. ఈ మంత్రములన్నీ ఆంగ్లములో ఇవ్వబడి "Mystic Mantrams"గా ప్రసిద్ధి చెందాయి.
* తన వద్దకు తోకచుక్క ద్వారా వచ్చిన విశిష్ట శక్తికి

'Master' అని నామకరణము చేసిరి. 1000 మంది వాహికల ద్వారా ఆ శక్తిని పంచదలచి, తాను ఆ శక్తికి మొదటి వాహికగా నిలిచారు.

* వారియొక్క కార్యక్రమము భూమిజీవులకే పరిమితము గాక, ఇతర గ్రహమండలములకు కూడా వర్తించింది.
* మృత్యువును అధిగమించుట అని వారు తెలిపిన పదమునకు అర్థము, శరీరములోని దిగువ చక్రము లను దాటి, నశింపని సూక్ష్మ శరీరమును తయారు చేసుకొనుట.

సంగ్రహముగా చెప్పాలంటే వారు సనాతనమైన యోగ విజ్ఞానాన్ని, నవీన యుగమునకు సరిపోవునట్లుగా తయారుచేసి దానిని తాను పైనుండి యందుకొన్న విశిష్టశక్తితో జతపరచి అందించారు.

తాను శరీరమును ఎలా వదలుతానని ముందు తెలిపారో, అలాగే దేహము వదిలారు. వారి శరీరమును దహనముచేయుటకై కొనిపోగా, ఒక్కసారిగా ఉఱుములతో కుంభవృష్టి కురిసింది. అటువంటి వానలో ఎలా దహనము చేయాలని యోచించు చుండగా, ఆ నది (కావేరి) వరదతో పొంగిపొరలి, వారి శరీరాన్ని తెలియని అనంత లోకములోనికి కొనిపోయింది.

# ౨. సమన్వయ శక్తి

*"శూన్యమంతయు శక్తియే"*

మాస్టరుగారు "The Master" అని తెలిపినది అన్నింటికీ మూలమైన ఒకే 'శక్తియే'. కాబట్టి మనము ఏ మాస్టరుగారిని గురించి తెలిపినను, "The Master" అని తెలుపబడిన వారి వాహికను గురించియే తెలుపుచున్నాము.

"The Master" లేక సమన్వయశక్తి వివిధములైన పేర్లతో పిలువబడుచున్నది. నారాయణుడని, పరమశివుడని, పరబ్రహ్మమని తెలుపబడినది అదియే. వేర్వేరు దైవాంశల రూపమున ప్రకటింపబడు అన్నింటికీ మూలము అదియే అని మనము గుర్తుంచుకోవాలి. మొత్తము సృష్టికి కారణముగా నున్నది అదియే. అది శాశ్వతమైనది– దానినే మనము 'అది' ('THAT') అని తెలుపుతుంటాము.

మనిషి తన విశ్లేషణాత్మక భావమును విడచి తన ప్రజ్ఞ యొక్క ఔన్నత్యముతో అన్నింటిలోనూ ఉన్నదేదో గమనించవలసిన సమయము ఆసన్నమైనది.

మనము ఒకరితో ఒకరు ఎలా విభేదిస్తున్నా మనునది "విశ్లేషణ".

ఒకరితో ఒకరు ఎలా పోలియున్నామో తెలుపునది "సమన్వయము".

మనము సమాన గుణములు గమనించినపుడు మనము సమన్వయ శక్తికి దగ్గరౌతాము. మానవులందరూ ఒకటై అందరూ జీవులని అర్థమయ్యేటట్లు తెలపాలి. అందరిలోనున్నది ఒకే ఆత్మ, ఆ ఆత్మ పరిధి దాటిన తరువాత ఉండునదంతయూ ఒకే శక్తియే.

ఆత్మపరముగా అందరమూ సోదరులము, సోదరీ మణులము. ఆత్మస్థితి నుండి క్రిందికి వచ్చుసరికి తేడా వున్నది. ఈ తేడాను సృష్టియొక్క వైభవముగా అర్థము చేసుకోవాలి లేక సృష్టి సౌందర్యముగా అర్థము చేసుకోవాలి. దీనిని అపార్థము చేసుకొని విరుద్ధ కారణముగా భావించరాదు.

20 వ శతాబ్ద ప్రారంభములో భూమికి, భూమిజీవులకు ఉపదేశము నిచ్చుటకై ఒక అవతారమూర్తి దిగివస్తాడని ఎదురు చూచుట ఉండేది. భూమండల పురోగతికి, భూమిజీవుల ఉద్ధరణ ఒక ప్రణాళికాబద్ధముగా త్వరితగతిని ముందుకు తీసుకొనవలసిన సమయము ఆసన్నమైనది. ఆ రాబోవు అవతారమూర్తి ద్వారా అది జరుగవలసి ఉన్నది. శారమేయ మండలము ద్వారా ఆ ప్రజ్ఞ వచ్చు సంకల్పము హిమాలయము, నీలగిరి మరి ఐదు ఆశ్రమముల ద్వారా వచ్చినది. ఆ కార్యక్రమము అతి నేర్పుతో నిర్వహించవలసి వచ్చినది.

ఆ కార్యక్రమ నిర్వహణ చిన్నది కానందువలన ఒక ప్రత్యేక మూలము నుండి రావలసి వచ్చినది. పురాతన కాలము నుండి

అట్టి ప్రత్యేక కార్యక్రమములు నీలగిరులలోని అగస్త్య ఆశ్రమము నుండి వారి ప్రత్యేక ప్రతినిధుల ద్వారా నిర్వహింప బడుచున్నవని శాస్త్ర గ్రంథములు తెలుపుచున్నవి. వాల్మీకి రామాయణములోని ఆదిత్య హృదయములో *"అగస్త్యో భగవాన్ ఋషిః"* అని తెలుప బడినది. అగస్త్యుడు ఋషులలో ప్రభువు లేక భగవంతుడు అని అర్థము. జీవులకు ఇవ్వవలసిన అన్నివిధములైన జ్ఞానమును కాలానుగతముగ సృష్టించుటలో ఆయన బ్రహ్మవంటి వాడు.

పైలోకముల నుండి దిగివచ్చు శక్తిని అద్భుతముగా నడిపించు కార్యక్రమమును నీలగిరి ఆశ్రమము యొక్క ప్రత్యేక ప్రతినిధి ముందుగా స్వీకరించి, దానిని తరువాత గురుపరంపర ద్వారా పంచుట సంకల్పించబడినది. ఆధ్యాత్మిక వాఙ్మయములో అగస్త్యులవారి నీలగిరి ఆశ్రమమును మాస్టర్ జూపిటర్ ఆశ్రమముగా తెలుపుతారు.

విశ్లేషణ ద్వారా ముక్కలౌతున్న మానవజాతిని రక్షించుటకై సమన్వయశక్తి ఆ కాలమునకు అవసరమైనది. సృష్టి అంతయు సుందరము, దైవికమైనది. ప్రత్యేకత పేరుతో దానిని విశ్లేషించి చాలా విభాగములు చేశారు. దానితో ప్రజ్ఞయొక్క ప్రత్యేక భాగములుగా వారిని వారు విభజించుకున్నారు. తాము వేరు అన్న భావనతో విశ్వప్రజ్ఞకు దూరమై చనిపోవుచున్నారు. సత్యాన్వేషణకి ప్రయత్నించు ఆధ్యాత్మిక బృందములలో కూడ ఇటువంటి భిన్న ధోరణులు మనము గమనిస్తాము. మానవులు ఎంతమంది ఉన్నారో అన్ని రకములైన విశ్వాసములు ఉన్నాయి. వీరందరూ

మిగిలినవారిని తాము నమ్మినదే నమ్మమని, అదే రక్షిస్తుందని తెలుపుతుంటారు. వివిధ గురువులను అనుసరించువారు మిగిలిన గురువులు వేరని, వారి అనుయాయులు అప్రస్తుతమని భావిస్తారు. చాలా బృందములు, సంఘములు ఇందుకు మినహాయింపు కారు. మీరు వారి బృందములో సభ్యులు కానిచో మిమ్ములను తక్కువగా లెక్కిస్తారు. వారి భావాలు అలా వుంటాయి. కొన్ని సంఘములు రక్షకుడు తమ ద్వారానే వస్తాడని ప్రకటించువరకు వెళ్ళాయి. తమ మార్గమే సరియైనదన్న ఆలోచనతో ఎవరిని వారు మోసగించుకునేవారు.

జ్ఞానులైన గురువులకు అట్టి భేదములుండవని మరిచారు. వారు ప్రేమలో జీవించి ప్రేమనే పంచుతారు. వారి ప్రేమ భిన్న మైనది– అది ఒక వ్యక్తికో, ఒక సిద్ధాంతమునకో, ఒక సంస్థకో, ఒక వర్గమునకో, ఒక సమాజమునకో చెందినది కాదు. వారి విశ్వప్రేమ మార్గములో అడుగిడినవారు స్ఫూర్తిమంతులౌతారు.

మనము పట్టుకొన్నదే మనను బంధించునన్న విషయము సాధారణముగా మరచిపోతుంటారు. మన ముండుటకు ఇల్లు కట్టుకొని దానికి బందీలవుతుంటాము. మన శరీరముకూడ అటువంటిదే. మన భౌతిక శరీరముతోనే మనము జీవిస్తున్నామనే తప్పు అభిప్రాయము నేర్పరచుకుంటాము. ఇది సత్యముకాదు. ఈ భౌతిక శరీరము లేకున్నను మనము జీవించి పనిచేస్తాము. స్వప్నస్థితి అనునది దీనికి ఒక చక్కని ఉదాహరణ. మన నుండి ఈ భౌతికశరీరము వచ్చినది. మనము ఆధారముగా వచ్చినదే ఈ

శరీరము. నీవు శరీరమును ధరించి ఉన్నావే కాని నీవు శరీరము కాదు. మనము ధరించి ఉన్నది మనకొక సదుపాయము మాత్రమే. ఇది తెలియనిచో బంధింప బడతాము. మన గుణములను బట్టి మన శరీర మేర్పడగా మనము అందులో నివసించుటకు సిద్ధ పడినాము. మన గుర్తింపు మన శరీరములు, మన గుణములతో ఉన్నప్పుడు, మనలను మనము మరచి బంధింపబడతాము. జ్ఞానులు ఎన్నడు అలా బంధింపబడరు.

ప్రతి ఒక్కరికి ఒక కిటికీ (దృక్కోణము) ఉంటుంది. సూర్యుడు తమ కిటికీ నుండి మాత్రమే కనిపించునని ఎవరు నొక్కి చెప్పినను అజ్ఞానమే. అలానే ఆకాశము మా కిటికీ అంత పెద్దది మాత్రమేనని ఎవరు నమ్మినను, చెప్పినను అజ్ఞానమే. మానసిక కక్ష్యలలో పుట్టిన "isms" and "ologies" చక్కని, శాశ్వతమైన ఏకత్వమును గుప్తపరచుటకు, గజిబిజి చేయుటకే పనికివస్తాయి.

ప్రత్యేకత అను పేరిట జరుగు ప్రక్కమార్గములు, వేర్పాటు ధోరణుల ప్రమాద మిదియే.

సమన్వయము ఇటువంటి ప్రమాదములు నివారించుటకు, ఇతరులను సోదరులుగా చూచుటకు పనికివస్తుంది. సమన్వయ శక్తిని గ్రహించిన వ్యక్తి ఎటువంటి పరిస్థితులలోనూ చెదరిపోడు. అతడు అన్నింటికి మూలమైన తత్త్వము నందు ఉంటాడు. అతడు ఎటువంటి సిద్ధాంతములలోనూ చిక్కుకొనక వాని యొక్క మూలముగా ఉండిపోతాడు. వైష్ణవుడు అని చెప్పబడువారికంటే విష్ణుతత్త్వమును అతడు బాగా గ్రహిస్తాడు. అతడు విష్ణువును

సర్వమును వ్యాప్తిచెందిన ప్రేమ తత్త్వమని, సృష్టిలోని ఏకత్వ శక్తిగా గ్రహిస్తాడు. ఈ ఏకత్వశక్తిని వేర్వేరు చోట్ల, వేర్వేరు సమయములలో, వేర్వేరు పేర్లతో పిలువబడినదని అర్థము చేసుకుంటాడు. వేర్వేరు భావములలో బంధింపబడి, వేర్వేరు మార్గముల ననుసరించు వ్యక్తులు భగవంతుని ఒక రూపమునకు, ఒక పేరుకు, ఒక చోటుకు పరిమితము చేసుకుంటారు. జ్ఞానులు భగవంతుని అన్ని రూపములలోనూ, అన్ని నామములలోనూ, అన్నిచోట్లా, అన్ని సమయములలోనూ దర్శించ గలుగుతారు. లోన, బయట ఉన్నదంతయూ ఒకటేనను మార్గాతీత సత్యమును చూడగలుగుతారు. ఆ అన్నింటికీ మూలమైనదే మొత్తముగా ప్రకటింపబడి అదృశ్యమౌతున్నదని గ్రహించ గలుగుతారు. అదే ఏడు కక్ష్యల లోపల, దానిని దాటి ఉన్న ఎనిమిదవదిగా ఉన్నదని గమనిస్తారు. సృష్టిలోనున్న వైవిధ్యమంతయు దాని ప్రకట రూపమేకాని, అది ప్రకటింపబడుట లేదు. ఈ మూలము యొక్క ఎరుకలో జీవిస్తూ, అన్నింటియొక్క స్థానాన్ని, చెడ్డ అని తెలుపబడే దానితో సహా అన్నింటినీ తెలుసుకుంటాడు. నమ్మకము, పాపము, చీకటి వంటి భావములన్నీ అతడు అర్థము చేసుకొనుటలో పరిణతి చెందుతాడు. ఒకే మూలము నుండి పనిచేయుచున్న క్రమమైన సృష్టి ప్రక్రియ చక్కగా దర్శింపబడుతుంది. అన్నింటి యందు సమన్వయము సాధింపబడుతుంది. మాస్టరుగారి అవతరణ, ఈ ఉన్నదంత యథాతథముగా సమన్వయములో దర్శింపజేయుట కొరకే.

# ౩. విధానము

*"ఉన్న గురువు ఒక్కడే. అతడు విధానము ననుసరించువారి ద్వారా ప్రకటింపబడతాడు."*

మన ఉనికి సమన్వయ శక్తి వలననే. అది మనలోకూడ ఉన్నది. సృష్టింపబడిన ప్రతి వస్తువుయొక్క కేంద్రబిందువు సమన్వయ శక్తియే. ప్రతి అణువుయొక్క కేంద్రము అదియే. మనిషి ప్రజ్ఞయొక్క విభాగముగా అర్థము చేసుకోబడినాడు. శబ్దమను మాధ్యమము ద్వారా ఈ ప్రజ్ఞయొక్క విభాగము, విశ్వప్రజ్ఞతో లేక సమన్వయముతో జత చేయబడినది.

శబ్దము నిశ్శబ్దమునకు మూలము. ఈథర్ ద్వారా ఉదయించు శబ్దము సూక్ష్మశరీర పునర్నిర్మాణమునకు చక్కని మాధ్యమము. శబ్దము వ్యక్తిత్వమును చక్కబరచి, వ్యక్తితో అనుసంధానము కలిగిస్తుంది. శబ్దము వ్యక్తి వెలుపలనుండి లోపలికి ప్రయాణించుటకు, కేంద్రమునకు కట్టుబడి ఉండుటకు తోడ్పడుతుంది.

శబ్దము మంత్రమునకు ప్రాతిపదిక. మంత్రము క్రమ పద్ధతిలో అమర్చబడిన శబ్ద తరంగముల శక్తి. ఇది ప్రత్యేక ప్రయోజనమునకై ఉచ్చరింపబడుతుంది. మంత్రము చాలా

బలమైన శబ్దములతో కూడిన సమీకరణము. ఇవి వివిధములైన ప్రాముఖ్యతతో కూడి ఉంటాయి. అవి వర్షము కురిపించుట, సూర్యుని ప్రకాశము తెచ్చుట, వైభవమును వ్యాపింప చేయుట, అవరోధములను భగ్నము చేయుటవంటి వేరు వేరు ప్రయోజన ములకై ఉపయోగిస్తాయి. ఈ శబ్దము లన్నింటికి మాతృకగా అంతర్గతముగా నున్న ఒకే శబ్దము ''ఓం''.

మనము ఇంతకుముందు చెప్పినట్లు మాస్టరుగారు వేదవిద్యలో ప్రవీణులు. కాబట్టి వారికి శబ్దమును గూర్చిన పరిపూర్ణ శాస్త్ర జ్ఞానముపై చక్కని అవగాహన ఉండేది. అంతే గాక వారు తమ ప్రయోగములకై శబ్దమును మాధ్యమముగా వాడుటలో నైపుణ్యమును సాధించిరి. అంతేగాక, వారి అవతార ప్రయోజనమైన త్వరిత మానవ పరిణామమునకు సమన్వయశక్తిని వాడుటకై వారు ప్రధానముగా శబ్దమును మాధ్యమముగా ఎంచుకొనిరి.

దానికొరకై వారు C.V.V. అను మూడు అక్షరములను ధ్యాన శబ్దములుగా ఇచ్చిరి. శ్రీ కంచుపాటి వెంకటరావ్ వెంకాస్వామి రావ్ అను వారి పేరుకు మాత్రమే సంబంధించినవి మాత్రమే కాదు.

ఎవరైతే C.V.V. అను శబ్దమును ఉచ్చరిస్తారో, వారిలో నిద్రాణ స్థితిలో నున్న సమన్వయ శక్తి ఒక పద్ధతిలో అంతరిక్షమునకు, సౌరశక్తికి, భూమియొక్క శక్తికి అనుసంధానము

చెంది ప్రచోదన మౌతుంది. అలా ప్రచోదనము చెందినప్పుడు మనిషిలోని ఘనీభవించిన స్థితి కరగుట మొదలౌతుంది. అప్పుడు మనిషి భావములు విశాలమై ప్రతి పద్ధతిని, ప్రతి ఇతర భావమును, విశ్వాసములను, గురువులను ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించ గలుగుతాడు. యోగముతో అనుసంధానమగుట సహజమౌతుంది. ఆ స్థితిలో అతడు మంచి చెడ్డలు రెండింటిని సమభావంతో స్వీకరిస్తాడు. మంచి, చెడ్డలనునవి ఒక దృక్పథములని గుర్తించి, వానికి పై స్థితి అయిన ‘‘నేను’’ అను ప్రజ్ఞగా జీవించుట అను దృష్టి వస్తుంది.

★★★

మాస్టర్ C.V.V. గారికి శక్తిని అందించిన మాస్టరుగారు, సమన్వయ మార్గములోనికి రాదలచు వారందరికి ఆ శక్తిని అందించుటకు అనుమతించారు. ఆ రోజే 29 మే 1910. ఆ రోజు నుండి ఈ రోజు “మే కాల్ డే’’ అను ముఖ్యమైన రోజుగా పరిగణింపబడు చున్నది. సమన్వయ శక్తి మార్గములో చేరదలచిన వారిని మాస్టరుగారు 29 మే న పిలువవచ్చునని మాస్టర్ C.V. V. గారు తెలిపారు.

సమన్వయ మార్గములో చేరదలచిన వారికి పాటింపవలసిన నియమ నిబంధనలను ఏర్పరచారు.

**1. ప్రభాత స్నాన విధులు :**

సాధకుడు ఉదయముననే లేచి కాలకృత్యములు, దంత

ధావనము పూర్తిచేసుకొని, స్నాన మాచరించి ఉతికిన బట్టలు ధరించాలి. దీనివలన శరీరము శుభ్రపడి శుద్ధిగా తేలికగా ఉంటుంది.

**2. సమయపాలన :**

మాస్టరుగారు ప్రార్థన రోజుకు రెండుసార్లు 12 గంటల వ్యవధితో జరుగునట్లు నిర్దేశించారు. వారు ఒకసారి చేసిన ప్రార్థన, శక్తిని 12 గంటలు చాలనము చేస్తుందని వివరించారు. రెండు ప్రార్థనలు రోజంతటికీ సరిపోతాయని తెలిపారు.

దానికై రోజులో ఉదయము, సాయంత్రము ఒక సౌకర్య మైన సమయాన్ని ఎంచుకొని దానిని అనుసరించుట వలన క్రమము సాఫీగా నడుస్తుంది.

మాస్టరుగారు ఉదయము 6 గంటలు, సాయంకాలము 6 గంటలు అనుకూలమైనవిగా తెలిపారు.

అది సాధ్యముకాని వారికి క్రమము తప్పకుండా 12 గంటల వ్యవధిలో అనుకూలమైన సమయములో ఉదయము, సాయంత్రము ప్రార్థనలు చేసుకొనవచ్చును. ఇలా క్రమముగా ప్రారంభిస్తే తరువాత కొన్ని సంవత్సరములలో ఉదయము 6 గంటలకు, సాయంత్రము 6 గంటలకు ప్రార్థన చేయగలుగుటకు అవకాశము దొరుకుతుంది. ప్రారంభములో 4 గంటల నుండి 8 గంటల లోపల ఉదయము, సాయంత్రము ఒకే సమయాన్ని ఎంచుకొనవచ్చు. మాస్టర్ C.V.V. గారు ప్రాతఃకాల స్నానాది

విధులను ఆచరించుటలో వెసులుబాటు కల్పించారుగానీ సమయపాలన పట్ల తాము ఎంచుకున్న సమయాన్ని సాధకుడు నిక్కచ్చిగా అనుసరించాలని తెలిపారు. ఎందుకంటే సమయము సమయపాలన చేసేవారిని అంటి ఉంటుంది. ఇది ఒక తంత్రము.

**3. దిశ :**

కన్నులు లఘువుగా మూసుకొని, ఉత్తరమునకు గాని, తూర్పునకు గానీ అభిముఖముగా ఒక చాపమీదకాని, ఒక పీటమీదకానీ కూర్చోండి.

**4. భంగిమ :**

మాస్టరుగారు మీకు అనువైనట్లు కూర్చొనవచ్చని తెలిపారు. అందరూ పద్మాసనములో కూర్చొనలేక పోవచ్చును. కూర్చున్న ఆసనములో ఇబ్బందితో నొప్పి వచ్చినట్లయితే మనస్సు దానిని గురించే ఆలోచిస్తూ భౌతికమును దాటి వెళ్ళలేదు. నొప్పి అనుభవములోనికి వస్తున్నప్పుడు శక్తి చాలనము జరుగదు.

కాబట్టి సౌకర్యమైన ఆసనము చాలా ముఖ్యమైనది. కాబట్టి ఏదైనా సౌకర్యమైన ఆసనములో భూమికి వెన్ను లంబకోణములో ఉండునట్లు కూర్చోవాలి. సృష్టి భూమికి సమాంతరముగా ఉంటుంది. ఆధ్యాత్మిక సాధన నిన్ను ఊర్ధ్వగతికి తీసుకొని వెడుతుంది. దానికై వెన్ను నిటారుగా ఉండాలి.

మాస్టరుగారు సాధకులను కూర్చొను ఆసనముపై ఎక్కువగా

ఆలోచించ వద్దని, శరీరము సరియగు ఆసనములోనికి వచ్చుటకు అవసరమైన సర్దుబాట్లు చేస్తానని హామీ ఇచ్చారు.

మీ పరిధిలో అన్నీ సౌకర్యముగా ఉండునట్లు చూసుకోండి. మీ దేహభాగముల పట్టు సడలించండి.

**5. ఓంకార ఉచ్చారణ :**

మూడుసార్లు ఓంకారమును లోతుగా, నెమ్మదిగా, మృదువుగా, ఏకరీతిలో ఉచ్చరించుచూ, మీ ఉచ్చారణను వినండి. ఒక నిముషముపాటు నిశ్శబ్దమును పాటించండి.

సాధారణముగా మనుషులు ఓంకారమును యాంత్రికముగా ఉచ్చరించుచూ, ఎన్నిసార్లు ఉచ్చరించామో కూడా గుర్తు లేకుండా చేస్తుంటారు.

ఉచ్చరించునపుడు శబ్దము పుట్టు స్థానమును గమనించుడు. ఈ గమనిక వలననే మనము అంతర్ముఖము కావచ్చును. ఓం అను శబ్దమును ఉచ్చరించుచూ గమనించినచో, మనస్సు యొక్క సంకల్పము లేకయే మనము అంతర్ముఖ మౌతాము. ఇంకా వినినచో ఓం అనునది మనలో శాశ్వతముగా, నిరంతరముగా జరుగుచున్నదని, దాని నుండి మన ఉచ్చారణ వెలువడుచున్నదని మనము గమనిస్తాము. ధ్యానమను ప్రక్రియ అనునది లోపలికి ప్రయాణమని, మనలోనికి అంతర్ముఖ మవుతామని గమనిస్తాము. మనస్సు, ఇంద్రియములతో బయటికి ప్రయాణించుట అనునది ధ్యాన ప్రక్రియకు ప్రతికూల మార్గము. కాబట్టి ఓంకారమును

ఉచ్చరించుచూ, వినుచూ, దాని మూలమునకు ఉచ్చారణ ద్వారా వెళ్ళండి.

**6. మాస్టరుగారిని ఊహించుట :**

కాంతివంతమైన బంగారు రంగుగల పద్మమును మీ హృదయ కేంద్రములో ఊహించండి. ప్రతి ఒక్క ఓంకార ఉచ్చారణతో ఆ పద్మము వికసించు చున్నట్లు భావించండి. మూడు ఓంకారములు ఉచ్చరించునప్పటికి, పూర్తిగా వికసించిన హృదయ పద్మమును దర్శిస్తారు.

మాస్టరుగారు ఆ పద్మము మధ్యలో ఆశీనులై ఉన్నట్లు దర్శించండి. మాస్టరుగారు మందహాసముతో మీ కన్నులలోనికి చూస్తూ ఆశీర్వదిస్తున్న భంగిమను ఊహించండి.

**7. ఆవాహన :**

''మాస్టర్ C.V.V. నమస్కారమ్'' అని ఉచ్చరించుచూ మాస్టరుగారిని భావన చేయండి.

సమన్వయ శక్తికి వాహిక యగుటకు మాస్టరుగారిచ్చిన శబ్దమే "నమస్కారమ్స్ మాస్టర్ C.V.V". మంత్రమువలె దీనిని ఎక్కువసార్లు జపించవలసిన పనిలేదని మాస్టరుగారు తెలిపారు. ఈ C.V.V. అను శబ్దమును ఉదయము ఒకసారి, సాయంత్రము ఒకసారి ఉచ్చరించిన చాలు. ఒక శిష్యుడు దీనిని చాలాసార్లు ఉచ్చరించేవాడు. అతడు మాస్టరుగారిని కలిసినప్పుడు

మాస్టరుగారు అతనితో ఇలా అన్నారు ''ఆ శబ్దమును అన్నిసార్లు ఎందుకు ఉచ్చరిస్తారు? నేను చెవిటివాణ్ణి కాదు. రోజుకు రెండుసార్లకు మించి ఉచ్చరించ వద్దు. మీ శరీరము రెండుసార్లకు మించి గ్రహించలేదు.''

కాబట్టి ఉదయము ఒకసారి, సాయంత్రము ఒకసారి ఆ శక్తిని ఆవాహన చేయుట సరిపోతుంది.

అటు తరువాత 15 నిముషములు నిశ్శబ్దముగా ఉండండి. ఆ శక్తి దేహభాగము లన్నింటికి వ్యాపించుటకు కనీసము15 నిముషములు పడుతుంది. స్థిరముగానున్న శక్తి C.V.V. అను శబ్దముతో చాలన మౌతుంది. శరీరములో వెన్నెముక ద్వారా ఈ శక్తి ప్రసరిస్తుంది. శరీరములో సర్దుబాట్లు జరుగుతాయి. శక్తి ప్రవాహము తిన్నగా జరుగుటలో అడ్డంకులు, ఒడుదొడుకులు తొలగింపబడతాయి. సవరణలు జరుగుతాయి. ప్రాణ ప్రవాహము నకు శరీర వ్యవస్థ క్రియాత్మకముగ రూపొందించ బడుతుంది. మాస్టరుగారు దీనిని "రిపేర్ వర్క్" అని తెలిపారు. ఉదయము, సాయంత్రము ప్రార్థనలు "బండిని రిపేరుకు నిలబెట్టుట"గా అవగాహన చేసుకోవాలి. జీవితానుభవమును పూర్తిగా పొందుటకు ఇప్పుడు తయారగు మానవ శరీరములు సరిపోవని మాస్టరుగారు నొక్కి వక్కాణించారు. కాబట్టి వారు వీనిని అభివృద్ధిపరచి, సరిచేయుట ఆత్మానుభవము పొందుటకు అవసరమని ప్రతిపాదించారు.

## 8. లోన గమనించండి :

ఇచ్చిన శబ్దమును ఉచ్చరించిన తరువాత మీరు నిశ్శబ్దముగా ఉంటూ లోపల ఏమి జరుగుచున్నదో గమనించండి. ఏమవుతుంది? మన అనుభవములో చాలా విషయాలు జరుగుతాయి. సాధారణముగా జరిగేది మనము గమనించేది ఉచ్ఛ్వాస నిశ్వాసలు. మనము దీనితో పుట్టాము కాబట్టి ఇది ఉందని తీసేసుకుంటాము కానీ సాధారణముగా దీనిని గమనించము. మనము ఉచ్ఛ్వాస నిశ్వాస ప్రక్రియను గమనిస్తే మనస్సు నిదానముగా లోపల జరుగు దానిపట్ల ఉత్సుకతతో దానికి మూలస్థానమునకు వెడుతుంది. తరువాత హృదయకేంద్రము యొక్క వెలుగు, ప్రేమ కేంద్రము దర్శింపబడతాయి. హృదయకేంద్రము యొక్క అయస్కాంతీకరణ కేంద్రము అందులోనికి లయమౌతుంది. మన ప్రజ్ఞ ఉన్నత స్థితిని చేరి, మనను మన మనస్సుగా కాక, మనను మనముగా గమనిస్తాము. మనస్సు హృదయకేంద్రము లోనికి చేరుటతో మన భౌతిక, భావ, మానసిక కక్ష్యలలో చాలా మార్పులు ఆవిష్కరింపబడతాయి. ఆ ప్రక్రియలే ఆ కక్ష్యలో జరుగు మరమ్మత్తులు, సర్దుబాట్లు, పునర్నిర్మాణము. వ్యాప్తిచెంది ఉన్న ప్రజ్ఞ ఈ దేహములో అనుభూతమగుటయే వీని లక్ష్యము. మహర్లోక ప్రజ్ఞ మనస్సులోనికి దిగివచ్చి, ఇంకా భౌతికము వరకు దిగివచ్చి మనిషిని శాశ్వతునిగా, దివ్యునిగా, మాస్టర్‌గా మారుస్తుంది. మాస్టర్ C.V.V. గారు దీనిని "Physical immortality" లేక భౌతికమైన శాశ్వతత్వముగా తెలిపారు.

మనస్సు తన కేంద్రము వైపు లోపలికి మరలుటను మాస్టరుగారు "Dip Deep" అని పిలిచారు. మనము లోపలికి వెళ్ళినప్పుడు మనస్సు తన ప్రతిరూపమైన శ్వాసను కలుస్తుంది. అవి రెండూ దగ్గర అయినకొద్దీ స్పందనను చేరి మాయమైపోతాయి. స్పందనాత్మక ప్రజ్ఞ మాత్రమే మిగిలి మనస్సు, శ్వాస ఆగిపోతాయి. దీనిని సరియైన వాక్యములలో వివరించుట కష్టము. ఈ నిశ్చలమైన స్థితిలో గుండె స్పందన ఆగిపోతుంది కానీ మీరు చనిపోరు.

ఈ మొత్తము అంతటినీ సంక్షిప్తముగ మూడుగా తెలుప వచ్చును.

* ఉదయము, సాయంత్రము ఇచ్చిన సమయమును పాటించుట.
* ఇచ్చిన శబ్దమును ఉచ్చరించుట.
* లోన గమనించుట.

ఏ సిద్ధాంతము పట్ల నమ్మకము గలవారైనను, ఈ భూమండలముపై ఎక్కడ నివసించు వారైనను ఈ పద్ధతిని అనుసరించి, ప్రయోజనమును పొందవచ్చును, అనగా సమన్వయ శక్తి మార్గములోనికి ప్రవేశింప వచ్చును. ఈ సాధనను ఐదు సంవత్సరములు చేసినవారు అన్నింటినీ కలుపుకొని పోవుట, అంగీకరించుట, మొత్తమును ఒకటిగా చూచుట అను స్థితిని పొందగలుగుతారని మాస్టరుగారు తెలిపారు. అతని బాహ్య

జీవనము క్రమబద్ధమై, అంతర్ముఖ జీవనముతో యోగము చెంది సామరస్య స్థితి అతనిలో అనుభూతమౌతుంది.

ఈ మార్గమును పది సంవత్సరములు క్రమముగా సాధన చేసినవారు తన వాహిక లౌతారని మాస్టరుగారు తెలిపారు. తన వాహిక లగుటకు మరి రెండు నియమములను వారిచ్చారు.

## 1. ప్రతిరూపమును మాస్టరుగా దర్శించుట :

మాస్టర్ అన్న శబ్దమునకు అర్థము అన్నింటికీ మూలమైన ప్రజ్ఞ. కావున అన్ని రూపము లందును ఆయననే దర్శింప వలయును. దైవమే అన్నింటి యందున్నదనీ, అన్ని రూపములు ఆ దైవముయొక్క రూపములే అని తెలుసుకోవాలి. భగవంతుడను ఒకే మూలము నుండి మాస్టర్, చెట్టు, కుక్క, స్నేహితుడు, భవంతులు– అన్నీ క్రమముగా ఘనీభవించుట అను పద్ధతి ద్వారా ఏర్పడినవి. కాబట్టి మనము ఏదైనా రూపమును చూచినప్పుడు అది భగవంతుని ఒక రూపముగా గుర్తించాలి. ఈ సాధనతో మనము చూచే దృక్కోణములోని అసమానతలు తొలగిపోతాయి.

ఇష్టత, అయిష్టత అనుట తొలగింపబడి ఇష్టత అనునది క్రమముగా వస్తుంది. అయిష్టత అనునది మన పరిమితియే. మన పరిమితులు ఏవో గుర్తించి, వానిని అంగీకరించుట, వానితో పనిచేయుటతో మనము వానిని దాటవచ్చును. మనము ఎన్నో సార్లు విఫలమైనను, అది పట్టించుకో నక్కరలేదు. ప్రతి పతనం తరువాత లేవడం ఉంటుంది.

అయిష్టతలను ఒక పద్ధతి ప్రకారము అధిగమించాలి. మనము ఇష్ట పడునది, ఇష్ట పడనిది ఒకే మూలము నుండి వచ్చిన వని గుర్తుంచుకోవాలి. అవికూడా మనవలె జీవించి ఉంటాయి. మనము ఇంకొక వ్యక్తిపట్ల అయిష్టముగా ఎందుకుంటామంటే మన గుణములు అతనితో సరిపోవు. ఈ భూమిపై కోట్లాది జీవులున్నాయి. ప్రతి ఒక్కరికీ వారు పనిచేయు పద్ధతి ఒకటి ఉంటుంది. వారు పనిచేయు పద్ధతిని వారి వ్యక్తిత్వము నిర్ణయిస్తుంది. మనుషులలో వ్యక్తిత్వము వేరైనను వ్యక్తులందరు ఒకటిగానే ఉంటారు. ఒక వ్యక్తి పనిచేయు విధానము నచ్చనంత మాత్రమున, మనకు ఆ వ్యక్తిపట్ల అయిష్టత అక్కరలేదు. కాబట్టి మన తేడా వ్యక్తిత్వ కక్ష్యలో మాత్రమేనని అర్థము చేసుకుందాము. వ్యక్తి కక్ష్యలో మనము కలిస్తే, వ్యక్తిత్వముపట్ల మనము ఉదాసీనత వహిస్తాము. మన యొక్క సమస్య వ్యక్తిత్వ కక్ష్యలో మమేక మగుటకు చేయు ప్రయత్నమే. మనము సమస్థితిలో ఇద్దరికీ అంగీకారమైన స్థితిలో కలియుటయే. అప్పుడు అయిష్టత తొలగిపోతుంది. మాస్టరుగారు అందరికీ ఆమోదమే గనుక, మాస్టరుగారు అన్ని రూపములలో, అన్ని సమయములలో, అన్ని చోట్లలో, అన్ని పేర్లలో, అందర్లో ఉన్నారు గనుక, ఆయనను అంతటిలో చూడగలిగినప్పుడు, మనకు ఎవరిపట్ల రాగద్వేషములు లేని తటస్థస్థితి ఏర్పడుతుంది. అప్పుడు మనము ప్రతి రూపమున, వారి ప్రవర్తన మనతో విభేదించినను అర్థము చేసుకొన గలుగుతాము. అప్పుడు విభేదించుట ద్వేషము నకు దారితీయదు.

మాస్టరుగారు ఒక శిష్యునిలోని 'నచ్చకపోవుట' అను పరిమితిని ఎలా తొలగించారో తెలుసుకొను ఆసక్తికరమైన సంఘటన గమనిద్దాము. ఈ శిష్యునికి చాలామంది పట్ల అయిష్టత కలిగి ఎప్పుడూ ఫిర్యాదు చేస్తుండేవాడు. అతని మిత్రుడు ఒకడు మాస్టరుగారిని కలవమని, అతని జీవితమును మధురముగా చేస్తారని తెలిపాడు.

ఆ శిష్యుడు మాస్టర్ C.V.V. గారి వద్దకు వెళ్ళాడు. వెంటనే మాస్టరుగారు ఆ శిష్యుణ్ణి అర్థము చేసుకున్నారు. మాస్టరుగారు ఆ శిష్యుణ్ణి ఇలా ప్రశ్నించారు, "మీకు జీవితములో శత్రువు లున్నారా?" తన సమస్యను మాస్టరుగారు అర్థము చేసుకున్నందుకు ఆ శిష్యుడు చాలా సంతోషించి "అవును మాస్టర్, నాకు చాలామంది శత్రువులున్నారు. నా జీవితము బాధాకరముగా నున్నది."

మాస్టరుగారు "ఆ విషయము నేను చూసుకుంటాను. నీవు బాధపడవద్దు" అని అతనికి మంత్రము ఇచ్చారు. ''శత్రువా! నిన్ను నీవు తెలుసుకో" (Enemy! Be aware of yourself).

శత్రువులను వదలించుకొనుటకు మంచి మంత్రము దొరికినదని శిష్యుడు సంతోషించి దానిని సాధన చేశాడు. 40 రోజులయినా వారు అదృశ్యమవ్వలేదు. అతడు మరలా మాస్టరుగారి వద్దకు వెళ్ళి ఇలా చెప్పాడు. ''మాస్టర్ ! నా శత్రువులకు ఏమీ కాలేదు. మీ మంత్రము పనిచేయలేదు."

మాస్టరుగారు అప్పుడన్నారు "నీవు మంత్రము సరిగా చేయలేదు. నీకు సహాయము చేస్తాను. నీ శత్రువు లందరి చిత్రములను సేకరించి నావద్దకు తీసుకొని రావలసినది."

ఆ శిష్యుడు తన శత్రువు లందరి చిత్రములను సేకరించుటకు కష్టపడవలసి వచ్చింది. కానీ గురువుగారు కొంచమైనను తన మాట సడలించలేదు. తన శత్రువులతో స్నేహము చేసి వారి చిత్రములను సేకరించాడు. అతడు త్వరితముగా ఆ చిత్రములతో మాస్టరుగారి వద్దకు వచ్చాడు. వానికి ఫ్రేమ్ కట్టించమన్నారు మాస్టరుగారు. తన స్వంత ఖర్చుతో వాటికి ఫ్రేమ్ కట్టించి మాస్టరుగారి వద్దకు తీసుకొని వచ్చాడు. "మాస్టర్! వీనిని మీకొరకు ఎక్కడ ఉంచాలి" అని అడిగాడు ఆ శిష్యుడు. మాస్టరుగారు తన శత్రువులపై 'చేతబడి' చేయుటకు ఆ చిత్రములు అవసరమనుకొన్నాడు. మాస్టరుగారు ఇలా జవాబిచ్చారు "అవి కనిపించునట్లు పెట్టుకొనవలసినది నీవే కానీ నేను కాదు. నీ పూజాగదిలో నా చిత్రములను తీసివేసి ఈ చిత్రములు ఉంచి, నన్ను ఎలా ప్రార్థిస్తావో అలా వీనిని ప్రార్థించవలసినది". ఆ శిష్యుని నెత్తిపై పిడుగు పడినట్లయినది. అతడు విస్మయము నుండి తేరుకొనులోపల "మాస్టర్‌ను అన్ని రూపములలో చూడుము" అని ఇంకొక పిడుగు వేశారు. ఆ శిష్యుడు ఇంటికి తిరిగివచ్చి మాస్టరుగారి ఆదేశము ప్రకారము సాధన చేశాడు. దానితో 'నచ్చకపోవుట' అను వ్యాధి అన్ని చిత్రములలో ఒకనినే చూచుటతో క్రమముగా అదృశ్యమైపోయింది. కొంతకాలములో వారందరితో స్నేహము చేసుకొన్నాడు.

మాస్టరుగారు మనలోనున్న అటువంటి పరిమితులను దాటుటకు, సృష్టి అంతయు మూడు మడతలుగల వస్త్రముగా గుర్తుంచుకోవా లన్నారు. అవియే సత్వ, రజస్, తమో గుణములను మూడు గుణములుగా వివరించారు. ఈ త్రిగుణములు వేర్వేరు వ్యక్తులలో వేర్వేరు పాళ్ళలో ఉంటాయని, ఆ కలయికను బట్టి వారు చేయు పద్ధతి ఉంటుందని తెలిపారు. ఆ కలయికయే వ్యక్తిత్వము. మూడు గుణముల వ్యక్తిత్వమునకు ఆవల ఉన్న వ్యక్తిగా జీవులను గుర్తించాలని సలహా ఇచ్చారు.

*ఒక కథతో ఈ విషయాన్ని చక్కగా వివరిస్తాము.*

ఇద్దరు పాదచారులు చెరొక గొలుసుతో బంధింపబడిన కుక్కలతో వాహ్యాళిలో కలుస్తారు. వారు ఒకరొకరిని పలుకరించు కొనే లోపలనే కుక్కలు తగవులాట ప్రారంభిస్తాయి. అవి గట్టిగా మొరుగుతూ కొట్లాట ప్రారంభిస్తే ఆ స్నేహితులు ఆ కుక్కలను వేరు చేయుటలో మునిగిపోతారు. ఇక్కడ కుక్కలనేవి వ్యక్తిత్వములను సూచిస్తే, వాటి యజమానులు వ్యక్తులను సూచిస్తారు. వ్యక్తులు కలసినప్పుడు ఒక్కటే ఉంటుంది. వ్యక్తిత్వముల మధ్య సామరస్యము అనునది, ప్రేమకు ప్రాతిపదిక కాజాలదు కానీ ఒకే రకమైన దృక్పథము ఉన్నప్పుడు సాధ్యమౌతుంది. వ్యక్తుల మధ్య అంగీకారము ప్రేమను కల్పించి భిన్న దృక్పథముల ఆమోదము సాధ్యమౌనట్లు చేస్తుంది.

## 2. స్వలాభమునకై నీవు పనిచేయరాదు :

వాస్తవమునకు ఎవ్వరూకూడ వారి లాభమునకై పనిచేయుట

లేదు. మన స్వలాభమునకై మనము పనిచేస్తున్నామన్న భావన మనము కలిగి ఉంటాము. కానీ వాస్తవమునకు మనము ఇతరుల కోసమే పనిచేయు చున్నాము.

మనము ఏదైనా కొన్నప్పుడు, అది మనకోసమే కొంటున్నామని భావిస్తాము. కానీ మనము దానిని ఉత్పత్తి చేసిన వారికి మూల్యమును చెల్లించు చున్నాము. ఈ సూత్రమును ఈ విధముగా అంతులేనట్లుగా విశదీకరించ వచ్చును.

దీని సారాంశ మేమనగా ప్రతి ఒక్కరూ ఇతరులకై పని చేయుచున్నారు. మనము చేయు పనిలో, ఇతరులకోసము ఉద్దేశింపబడిన పనిపట్ల ఎక్కువ ఉన్ముఖత్వము చూపాలని కోరతారు. అలా ఉన్ముఖత్వ మున్నప్పుడు, మనము చేయుపని ఇతరులు ఇష్టపడునట్లుగా చేయగలుగుతాము.

అలా మనము పనులు చేయునప్పుడు మనము ఇతరులను సంతోషపెట్టుటయే గాక, మనము చేసిన పనుల ఫలమును పొంద గలుగుతాము. కావున, మనకు ఇవ్వబడిన పనిని, ఇతరులకు ప్రేమతో సేవ చేయుటకు ఇవ్వబడిన అవకాశముగా భావిస్తే, దానితో మనకు పరిపూర్ణత సిద్ధిస్తుంది. ఆ పనిలో మనకు రావలసిన దానిపట్ల ఉన్ముఖత ఉంటే, యితరుల మంచికై ఆ పనిని చేయము. దానితో ఆ పని మంచిగా జరుగదు. అప్పుడు ఇతరులు తృప్తి చెందుటగాని, నీకు రావలసిన ఫలము లభించుటగానీ జరుగదు. దానితో మననే మనము పాడు చేసుకుంటాము.

ఇతరులకొరకై ఉద్దేశింపబడిన పనివైపు నీ దృష్టి ఉన్నప్పుడు, దానిలో నీవు కూడా రక్షింపబడుతావు. కాబట్టి నీ క్షేమమునకై నీవు ఆలోచింపవలసిన అవసర ముండదు. నీవు సమాజమునకు సేవ చేస్తున్నప్పుడు, సమాజముకూడ నీకు సేవ చేస్తుంది. ఇతరుల కోసము పనిచేసేవాడు ఎప్పుడూ సంపన్నుడే. తనకోసము తాను పని చేసుకొనువాడు, ఎంత ధనమును పోగేసుకొన్నను, ఎప్పుడూ బీదవాడే. మాస్టరుగారు "నా వాహికగా ఉండవలె ననుకొనువాడు, ఇతరులకొరకై పనిచేస్తాడు, తనకై తాను ఏదీ యాచించడు". తన కడుపు మాత్రమే నింపుకొనువాడు దొంగ అనుట క్రతువిద్య తెలుపు సత్యము. యాచకు డెప్పుడునూ బీదవాడే, కానీ ఇచ్చువాడు ఎప్పటికీ సంపన్నుడే. కనుక స్వలాభముకొరకు పని చేయకూడదనుట ఒక ఆదేశము. నీవు చేయు ప్రతి పనిద్వారా ఇతరులకు కలుగు లాభము పట్ల ఉన్ముఖత్వమును చూపుము. ఆ వైఖరితో నీ ప్రయోజనములు సమకూరుతాయి. తెలివైన సేవకునిగా ఉండి సేవచేస్తూ ఉండుము. భగవంతుడుకూడ జీవుల సేవ చేస్తాడు. నీవు దానికి అతీతుడవు కావు. గురువు రూపములో నున్న భగవంతుడు విద్య నేర్చుకొను వారిని సేవిస్తాడు. తల్లితండ్రుల రూపములోనున్న భగవంతుడు పిల్లలకు సేవ చేస్తాడు. పాలకుని రూపములోనున్న భగవంతుడు ప్రజలను సేవిస్తాడు. చెట్లు, జంతువులు, ఖనిజముల రూపములో కూడా సేవయే జరుగుచున్నది. సేవామార్గము ననుసరించి భగవంతునివలే జీవించండి. సేవించుటయే భగవంతుని మార్గము. అదియే భగవంతుని చేరు మార్గము. సేవను స్వీకరించుట అనునది

ఆయన నుండి దూరముగా వెళ్ళుటయే. పని అనునది ఎటువైపున కైనను వెళ్ళు అవకాశాన్నిస్తుంది. కాబట్టి నిర్ణయించుకొని కదలండి.

ఇలా మాస్టరుగారు తానిచ్చిన సాధనను క్రమముగా చాలా సంవత్సరాలు సేవాభావంతో ఆచరించుచూ తమ వాహిక లగుటకు పై రెండు అదనపు నియమములను ఇచ్చారు.

# 4. మాస్టర్ మెకానిక్

*"ఆధ్యాత్మికత అంటే సామాన్యముగా ఉండుటయే"*

మనస్సు ఎప్పుడూ ఏదో ఒక ఆలోచనలో నిమగ్నమై ఉంటుంది. అది బయటి ప్రపంచముతో పంచేంద్రియముల ద్వారా నిరంతర సంబంధము పెట్టుకొంటుంది. ఈ ఇంద్రియములు వార్తావహులై బయటి సమాచారమును మనస్సునకు చేరుస్తూ ఉంటాయి. ఇంద్రియములు వార్తలను తెలియజేస్తే మనస్సు ప్రతి స్పందిస్తుంటుంది. మనము చర్యల లోనికి లాగబడు చుంటాము. మనము నిద్ర లేచినది మొదలు, తిరిగి నిద్రపోవు నంతవరకు యాంత్రికముగా మనలో ఆలోచనలు పుడుతుంటాయి. ఎన్నో జన్మలనుండి వచ్చిన అలవాట్ల వలన మనస్సు, ఇంద్రియములు సృష్టించిన ఆలోచనా సరళినుండి మనము బయట పడలేము.

నియమములను పేరుతో తమ మనస్సు, ఇంద్రియములను నియంత్రించుటకు చాలామంది అణచివేత మార్గాన్ని ఎంచు కుంటారు. ఆధ్యాత్మికత అనునది చాలామందికి తమకు తాము హాని చేసుకొను సాధనమైనది. ఆ పద్ధతులు అనుసరించు వారికి అవి ఆత్మ వినాశనానికి దారితీస్తాయి. శరీరము, మనస్సు, ఇంద్రియములు వ్యక్తిత్వమునకు సంబంధించినవి

కావని, దివ్యములని, అవి మనను అనుసరించి పనిచేస్తాయని మరచిపోతారు.

భావోద్వేగము అధిక్యముగా నున్న సాధకులు, తాము అసత్యము పలికినామని నాలుక కోసుకొనుట వంటివి గమనిస్తాము. అలా చేసిన అవివేకి సత్యమును పలుకు అవకాశమును శాశ్వతముగా కోల్పోతాడు. అటువంటి వివేకహీన స్థితి, విషయమును తప్పుగా అర్థము చేసుకొనుట వలన వస్తుంది. అబద్ధమాడినది నాలుక కాదు. తన స్వభావమునకులోనై తానే అబద్ధమాడుతాడు. నాలుక వ్యక్తిత్వము లేనిది. మనను అనుసరించే అది పనిచేస్తుంది. మనస్సు, ఇంద్రియములు కూడా అలాంటివే. ఆధ్యాత్మికత పేరుతో చాలామంది ఇంగితజ్ఞానాన్ని కోల్పోతారు.

ఆధ్యాత్మికత లోనికి రావాలంటే చక్కని అవగాహన కావాలి. తెలివైన ఆచరణ కావాలి. మనిషి పనిచేయునప్పుడు, శరీరము, ఇంద్రియముల ద్వారా ఆ కార్యము జరుగుతుంది. దాని ద్వారా ఉత్పన్నమైన బొగ్గుకు సంబంధించిన పదార్థములు సక్రమంగా తీసివేయబడాలి. పద్ధతిగా, క్రమముగా శుభ్రము చేయు కార్యక్రమము జరిగినపుడు మనిషియొక్క తెలివి చక్కగా ప్రకాశిస్తుంది. అలా లేనప్పుడు పోగైన బొగ్గుకు సంబంధించిన పదార్థములు తెలివియొక్క ప్రకాశాన్ని తగ్గించి మనిషి విచిత్రముగా, సాధారణముగా లేక సామాన్య వ్యక్తివలె ఉండకుండుట జరుగుతుంది. గదిని శుభ్రపరచుట వంటిదే ఇది కూడ. కావున క్రమముగా స్నానము చేయాలి. వ్యర్థ పదార్థముల బహిష్కరణ

మార్గములు తెరచి ఉంచాలి. అలాగే శుద్ధి చేయుట, సరిదిద్దుట, పనిలోనికి దిగేముందు ఆలోచన చేసుకోవాలి.

"నేను నీ లోపలినుండి సరిదిద్దుతాను" అన్నారు మాస్టరు గారు. మనలోని ఆలోచనలను మనము వదిలించుకోలేమని మాస్టరుగారికి చక్కగా తెలియును. అందుకని వారు తమ శిష్యులను కళ్ళు మూసుకొని తామిచ్చిన శక్తిని ఆవాహన చేసుకొంటే భౌతిక, భావ, మానసిక శరీరములకు కావలసిన పునర్నిర్మాణము, సరిదిద్దుట తాము జరుపుతామని తెలిపారు.

ఆలోచనను దాని మూలము నందే పరిష్కరించాలన్న మాస్టరుగారి సలహాను గుర్తు చేసుకుందాము. ఈ పద్ధతి యొక్క సామర్థ్యానికి ఒక ఉదాహరణ. కొన్నిబొట్ల సిరాను నీటిలో వేయండి. దానిని ఘనీభవింప చేయండి. అప్పుడు మీరెంత ప్రయత్నించినను ఆ ఘనీభవించిన క్యూబ్ నుండి రంగును తీసివేయలేరు. ఆ నీటితో కలసిన సిరాను తీసివేయాలంటే దానిని మరిగించి, బాష్పీకరణము చేసి, వడకట్టాలి. దాని అర్థము ఏమిటంటే మనము ఒక పనిలోనికి, దాని ప్రేరణకు కారణాన్ని ఆలోచించకుండా దిగామంటే దానిని సరిచేయలేము. దాని ప్రేరణకు కారణము కనిపిస్తుంటుంది. దానిని సరిదిద్దుటకు, వెనుకకు వెళ్ళి చూస్తేగాని ముందుకు వెళ్ళ లేము. నీలి రంగుగల మంచుగడ్డను కరిగించి, నీరుగా చేసి, బాష్పీకరణము చేసిగానీ రంగును తొలగించలేము.

మనలో వచ్చిన ఆలోచన మాటగా, పనిగా మారక ముందే అది ఎంతవరకు పరిశుద్ధమైనదో, వ్యక్తిగతము కానిదో

చూచుకోవాలని మాస్టరుగారు సలహా ఇచ్చారు. మన ధోరణి, ఒక పని వ్యక్తిగతమో, వ్యక్తిగతము కాదో తెలుపుతుంది. దీనిని అర్ధము చేసుకొంటే మనము అన్ని రకములైన బాహ్య ప్రపంచ వ్యవహారములలో మన ఉనికిని, జీవితాన్ని అనుభూతి చెందవచ్చును.

మూర్ఖమైన పద్ధతులు నాలుక కోసుకొనుటకే పరిమితము కావు. మూర్ఖత్వమునకు చాలా ప్రదేశము లున్నాయి. ఉదాహరణకు వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఆధ్యాత్మికత లేనివారని కొంతమంది అనుకుంటారు. దోవన వెళ్ళే కొంతమందికి మనము నీళ్ళు ఇచ్చి, చాలా సేవ చేశామని గర్విస్తుంటాము. మనము అటువంటి భావాలతో బాధితులము. ప్రతిరోజూ మనము ఎవరినుండి సేవలు పొందుతామో, వారిని మరుస్తాము. మనము అనుదినము సుఖపడే లక్షల పనులు, చొక్కాలు కుట్టుట, భోజనము నుండి ఇళ్ళు కట్టుకునేవరకు వారు లేకుండా జరుగదు. వాళ్ళు చేసేది సహజమేనని అనుకుంటాము. వారిని పట్టించుకోము.

ఒక తల్లి తన బిడ్డను ప్రసవమునకు ముందు, తరువాత తన రక్తముతో పోషిస్తుంది. ఇది ఎప్పుడూ గుర్తింపబడదు. మనము ఒక బొట్టు రక్తాన్ని దానము చేస్తే దానికి ప్రచారము కావాలి. తల్లి ప్రేమవలన అలా చేస్తుంది. దాని కేఋణము లేదు. “నేను ఈ మూడు లోకములలో ఎవరికీ, దేనికీ ఋణపడలేదు. నేను చేయవలసినది ఏమీ లేదు. మార్గమును చూపుటకే నేను చేయుచున్నాను” అని కృష్ణ భగవానుడు తెలిపారు. ఏ మాస్టర్ గూడా ఎవ్వరికీ ఎన్నడూ

ఋణ పడలేదు. వారు ప్రతిఫలాన్ని ఆశించరు. కాబట్టి వారికి ఋణము లేదు.

వ్యాపారస్తుడు లాభాన్ని ఆర్జిస్తాడు. అయితే అంతేనా? మనకై మనము కావలసినవన్నీ తయారు చేసుకోగలమా? వ్యాపారస్తుని లాభములో అతని లాభముకంటే సింహభాగము జీతభత్యములు, లైసెన్సులు, వస్తుసమీకరణ, రవాణా, కమ్యూని కేషన్ల వంటి పద్దులకు వెళ్ళుట తెలిసిన సత్యమే.

జీవితములోని కఠోర సత్యమేమిటంటే, మనము పుచ్చు కొన్న దానికంటే ఎక్కువ ఇచ్చుకోవలసి ఉంటుంది. మనము పుచ్చుకొను సంఘటనల కంటే ఇచ్చుకొను సంఘటనలు అధికముగా ఉంటాయి. ధనాన్ని మనము తీసుకునేముందు చాలా మార్గములలో ఎక్కువసార్లు ఎక్కువమందికి ధనమును ఇచ్చుట మనకు సంతోషాన్ని కలిగిస్తుంది.

లాభము అనునది కేవలము ధనమునకు సంబంధించినదే కాదు. ఇతరుల గుర్తింపు పొందుట, పేరు ప్రఖ్యాతులకై చూచుట మొదలగునవి అన్నీ లాభాపేక్ష లోనికే వస్తాయి. కాబట్టి వ్యాపారిని లాభాపేక్షతో పనిచేయు చున్నాడని నిందించుట తప్పు.

"ఆశతో, ఎదురు చూపులతో ఎన్నడూ పనిచేయవద్దు" అని మాస్టరుగారు హెచ్చరించారు. ఎదురుచూచినది లభిస్తే మనిషికి గర్వము, అహంకారము వస్తాయి. లేనిచో నిరాశ కలిగి ద్వేషానికి దారితీస్తుంది. వారు ఇంకా ఇలా చెప్పారు, ''దేనికీ ఎదురుచూడక

ఇవ్వండి– అప్పుడు మీరు స్వతంత్రులు. మీరు అడగకుండా ఎదుటి వారు ఇస్తే స్వీకరించండి.”

కాబట్టి ఏదో ఆశించి పనిచేయుట బంధానికి దారితీస్తుంది. ఉదాహరణకు మనము ఒక ఇల్లు కట్టుకుంటే మనము దానితో బంధింపబడతాము, అలాగే ఎవరైనా వ్యక్తులను ఇష్టపడితే, ఆ యిష్టముతో బంధింపబడతాము, మనమొక బృందాన్ని సమీకరిస్తే దానితో బంధింపబడతాము, ఒక పెంపుడు కుక్కను కొంటే దానితో బంధింపబడతాము. ఇల్లు మనతో రాదు, వ్యక్తులు అన్నిసార్లూ ఇష్టపడరు, కుక్క మన ఆదేశములను లక్ష్య పెట్టదు, బృందము మన రాగమునకు తాళము వేయదు. అలా మనము బంధింప బడతాము. మనను బంధించునది మన వ్యక్తిగతమే.

అలాకాక ఒక కుక్క మనతో వస్తుంటే మనము దానిని తరిమివేయ నక్కరలేదు. ఒక బృందము మన వెంట ఉంటే దానిని అలా ఉండనివ్వ వచ్చును. మన కుటుంబము, ఆస్తిపాస్తులు, వృత్తి, మనతో ఉన్నను, మనము వానితో బంధింపబడవలసిన అవసరము లేదు. బంధింపబడుట అనునది, ఒక వ్యక్తి అర్థము చేసుకొను దానిని బట్టి ఉంటుంది. దానికి చుట్టూ ఉన్న వానితో సంబంధము లేదు. వ్యక్తిత్వ భావన లేనివాడు, చుట్టూ అన్నీ ఉన్నను బంధింపబడడు. వ్యక్తిత్వ భావన ఉన్నవాడు ఎడారిలో ఉన్నను బంధించుకుంటాడు.

బంధము లేనప్పుడు జీవనము వ్యక్తిత్వముతో సంబంధము లేకుండా వుంటుంది. వ్యక్తిత్వముతో సంబంధము లేకుండా

ఉన్నప్పుడు మనము స్వతంత్రముగా ఉండగలుగుతాము. రెక్కలున్న పక్షివలె మాస్టరుగారికి వాహిక లవుతాము. వారు మన ద్వారా పనిచేయడం ప్రారంభిస్తారు.

అలా తరచూ బంధింపబడుట అను స్థితిని మనము గెలువ గలుగుతాము. మనస్సు దేనికోసమో ఎదురుచూచుట అను స్థితి లేనప్పుడు భవిష్యత్తును గూర్చిన ఆందోళన ఉండదు. మనను గురించి చెప్పుకోవాలను ప్రేరణ, మాట్లాడ వలెనను ఉత్సుకత, మనను నిరూపించుకోవాలను తొందర, ఇతరులను విమర్శించుటపై మక్కువ, అన్నీ మాయమైపోతాయి. వీలైనంత మందికి సహాయపడుట అనునదే మన గుర్తింపుగా మొదలై గంట గంటకు పెరుగుతూ ఒక పవిత్రమైన వరదగా అవుతుంది.

వ్యక్తిగతముగా కాక సాధారణముగా ఉండుటయే ఆధ్యాత్మికతలో ఉండుట. మాస్టరుగారు వ్యక్తిగతముకాని జీవనము నడుపుటకు వలసిన శక్తిని ఇస్తానని వాగ్దానము చేశారు.

వ్యక్తిగత భావమునకు దూరముగా నుండుటయే I AM అను ప్రజ్ఞకు దగ్గరగుట.

# 5. స్వస్థత నిచ్చు శక్తి

*''యోగమును బోధించుట, ప్రాణమును సరిదిద్దుట''*

మాస్టరుగారి ప్రత్యేకత, తమ శిష్యుల సూక్ష్మశరీరమును పునర్నిర్మించుటయే. శబ్దశక్తిని ఆవాహన చేసినప్పుడు భౌతిక, మానసిక, భావ శరీరముల పునర్నిర్మాణము వెంటనే మొదలౌతుంది. భూమియొక్క భౌతిక కక్ష్యకు వారు విశిష్టమైన శక్తిని ఎలా పంచి ఇచ్చారో ఇక్కడ గుర్తుంచుకోవాలి.

మాస్టరుగారు స్వతహాగా స్వస్థత కలిగించేవారు. స్వస్థత వారిలో సహజముగా ఉండేది. వారిని ఎవరైనా సందర్శించి నప్పుడు, వారి సతీమణిని ధ్యానస్థితి లోనికి పంపి, వారికి సంబంధించిన విషయాన్ని అంతా తెలుసుకొనేవారు. ఆమె ద్వారా వచ్చిన వారి కాంతిదేహ వర్ణములు తెలుసుకొని, వారు ఏ చక్రమునందు చిక్కుబడినారో గుర్తించేవారు. దానిని బట్టి స్వస్థతకు సంబంధించిన పద్ధతిని, స్వస్థతా ప్రార్థనను వచ్చిన వారికి ఇచ్చే వారు.

వివరించుటకు సాధ్యముకాని, పై కక్ష్యకు చెందిన మాస్టరుగారికి, చనిపోయిన వారికి పునర్జన్మ నిచ్చుట ఒక గొప్ప విషయము కాదు. అటువంటి ఆరేడు సంఘటనలు వారి జీవితమునందు గ్రంథస్తము చేయబడినవి. వారికి 'చందు'

అను పేరుగల కుమారుడు ఉండేవాడు. మాస్టరుగారి పనిలో సహకారము నందించుటకై దిగివచ్చిన గొప్ప ఆత్మ అతడు. విషయము తెలియనివారికి చూచుటకు అతడు అసాధారణమైన, ఆశ్చర్యకరమైన బాలుడు. చిన్న బిడ్డగా నుండగానే అతడు మాట్లాడే వాడు. తన తండ్రితోపాటే పాత్రను లాగుకొని కొన్ని లీటర్ల మజ్జిగ త్రాగేసేవాడు, వారి ఇంటికి వచ్చిన వారి గుణగణ విశ్లేషణ, వారి ఉద్దేశ్యములు తెలుపుట, నిగూఢమైన వేదాంత విషయములు వింతయైన సందర్శకులతో అనర్గళముగా చర్చించుట, వారి ఇంటికి వచ్చిన మహాత్ములతో సంభాషించుట చేసేవాడు.

కానీ పిల్లవానిలాగే ఉండేవాడు, కనిపించేవాడు. తాను భూమిమీదికి వచ్చిన ప్రయోజనము పూర్తి అయిన పిదప శరీరాన్ని వదలివేశాడు. అతని తల్లి బలవంతముపై మాస్టరుగారు మూడుసార్లు అతనిని పునరుజ్జీవింప చేశారు. మూడవసారి అతడు నేను ఈ భౌతిక శరీరములోనికి రావలసిన అవసరము ఎంతమాత్రమూ లేదని తెలిపాడు. అది తెలిసిన మాస్టరుగారు, తన భార్యకు నచ్చజెప్పి, ఆ ఆత్మను తనదారిన తాను వెళ్ళనిచ్చారు.

మాస్టరుగారి తల్లిగారు చనిపోయారు. కుటుంబ సభ్యులు ఆవిడను పునరుజ్జీవింప చేయమని కోరారు. మాస్టరుగారు ఒప్పుకున్నారు. చనిపోయిన తల్లిగారి శరీరము 18 రోజులు అలా ఉంచబడిన తరువాత మిగిలినవారి కోరికపై ఆమెను పునరుజ్జీవింప చేశారు.

ఒక రబ్బరు బంతిని మింగు ప్రయత్నములో చనిపోయిన

ఒక పిల్లవాణ్ణికూడా బ్రతికించారు. అప్పుడు వారు ఆ పిల్లవాని వద్ద లేరు. ఆ పిల్లవాడిచే ఆ రబ్బరు బంతిని ముక్కలుగా కక్కించారు.

వారు చనిపోయిన వారిని బ్రతికించిన సంఘటనలు ఇంకా కొన్ని ఉన్నాయి. ఉత్సహించిన శిష్యులకు వారు కేవలము ఇలా చెప్పారు ''ఇక మీదట ఇవన్నీ ఇంకా చాలా సాధ్యమౌతాయి.''

చనిపోకుండుట వారి వాగ్దానమయితే మంచి ఆరోగ్యము అనునది వారిచ్చిన భరోసా. "మీకు దృఢమైన శరీరము లేనిదే, నా శక్తిని మీరు తట్టుకొనలేరు" అని అనేవారు. వారి సమక్షములో ఎంతోమంది దీర్ఘరోగులకు 15 నిముషములలోనే స్వస్థత చేకూరినది. ఉపదేశమిచ్చుటకు ముందే శరీరము పునర్నిర్మాణము జరగాలని వారు దృఢముగా అభిప్రాయపడేవారు. అందుకని వారు శిష్యుల యొక్క ప్రాణమును మొదట సరిచేసి తరువాత యోగాన్ని బోధించేవారు.

ఒక అయస్కాంతము తనచుట్టూ ఉన్న ఇనుప ముక్కలను అయస్కాంతీకరిస్తుంది. ఒక అయస్కాంతము యొక్క సమక్షములో అయస్కాంతీకరణ సులభమౌతుంది. మాస్టరుగారు సాక్షాత్తు రూపుకట్టుకొన్న దైవప్రజ్ఞయే. వారు స్వస్థత చేకూర్చగల ఒక అయస్కాంతము యొక్క రూపమే. వారియొక్క స్పర్శతో రోగులకు స్వస్థత కలిగించుటయేకాక, వారిని స్వస్థత చేకూర్చగలిగిన వారినిగా తయారుచేశారు. ఒక పెద్ద దీపము చాలా దీపములను వెలిగించినట్లు, ఈ మాస్టరుగారు ఒక గొలుసుకట్టుగా మానవ సేవకు చాలామంది స్వస్థత చేకూర్చువారిని కల్పించారు.

వారిలో మాస్టర్ V.P.S. (వేటూరు ప్రభాకర శాస్త్రిగారు) ముఖ్యులు. మాస్టరుగారు V.P.S. గారికి చాలా రోజుల నుండి నయముగాని కుడిభుజము కీలుకు వెంటనే స్వస్థత చేకూర్చారు. 15 నిముషములలోనే వారి భుజము క్రొత్త భుజమువలె తయారైనది. V.P.S. ఒక మాస్టర్‌గా, స్వస్థత నొసగువారిగా ప్రఖ్యాతి చెందారు. మాస్టరుగారి శిష్యులైన మాస్టర్ M.N. గారు ఒంగోలు నగరములో వారి స్వస్థత నొసగు సామర్థ్యముతో అపర భగవంతునిగా భావింపబడ్డారు.

మాస్టర్ E.K. గారు వారి ద్వారా వ్యాపించిన స్వస్థతా స్పర్శకు హోమియోపతి అను ముసుగు నేర్పరచిరి. వారందరూ స్వస్థతను కలిగించు శక్తిని ప్రసారము చేయుటయే గాక, వారి స్వస్థత కలిగించు సామర్థ్యమును పెంపొందించిరి.

మాస్టరుగారు ఇచ్చిన స్వస్థత ప్రార్థన ఇలా ఉంది :

*"మాస్టర్! మీ అపరిమితమైన ప్రాణ ప్రవాహమును మా లోనికి తీసుకొనబడి– దానితో మేము వ్యాధిని, క్షీణతను, మృత్యువును అధిగమించి, శాశ్వత సత్యమును, పరిశుద్ధమైన ప్రేమను, జీవితానందమును పొంది, మానవాళికి మీ ప్రణాళిక ప్రకారము సేవించునట్లు అనుగ్రహించండి. మాస్టర్ C.V.V. నమస్కారమ్."*

ఈ ప్రార్థనను ఎవరైనను నిద్రకు ఉపక్రమించుటకు ముందు ఒక దీపము వెలిగించి చేసుకొన వచ్చును.

దీని ఫలితము ప్రార్థనలో తెలిపినట్లు సుస్పష్టమౌతుంది.

# ౬. మాస్టరుగారి యోగము

*"జీవన సమన్వయమే యోగము"*

**యోగము యొక్క ఉద్దేశ్యములు :**

1. జీవన పరిపూర్ణత్వమునకై రూపమును క్రమపరచుట.
2. మానవ సూక్ష్మశరీర నిర్మాణమును, క్రొత్త పిట్యూటరీ ద్వారా జీవిత ప్రజ్ఞయొక్క కొనసాగింపును, అనుభవములోనికి తెచ్చుట.
3. మృత్యువును అధిగమించి ప్రజ్ఞలో నిలబడుట.
4. ప్రేమ ప్రసారమునకు వాహికలను తయారుచేయుట.
5. రూపములలో ప్రజ్ఞను అనుభవించుట అనగా పదార్థము, ప్రజ్ఞ ఆత్మలో సమన్వయము చెందుట.

**యోగసాధనలో ప్రతిపాదనలు :**

1. ఉదయ సాయం సంధ్యలలో తప్పక మాస్టరుగారిని ఆవాహన చేసి, లోపల జరుగుచున్నది గమనించు చుండుట.
2. అరుణ వర్ణము కలిగిన ఒక దినచర్య పుస్తకము

నుంచుకొని నిజాయతీగా ప్రార్థనలో వచ్చు అనుభవము లను, ఆలోచనలను అందులో వ్రాసుకొనుట.

3. అన్ని రూపముల మూలము ప్రజ్ఞలో నున్నదని అర్థము చేసుకొనుట. భిన్న రూపములలో నున్న ఒకే ప్రజ్ఞను గమనించుటను సాధన చేయుట. దైనందిన జీవితములో జరుగు సంఘటనలలో ఒకే ప్రజ్ఞను గమనించుటలో నీ వైఫల్యములను గుర్తించుట.

4. మానసికముగా నీవు చేయు పనులు ఇతరులకు ఉపయోగకరముగా, సహాయకరముగా నుండునట్లు చూచుకొనుట.

5. శబ్దము విద్యుత్ తరంగములకు సంబంధించిన ప్రజ్ఞ. శబ్దమును చైతన్య ఉద్దీపనకు వినియోగించవలెను.

**యోగసాధనకు అర్హతలు :**

1. నీకు, నీ మతమునకు సంబంధించిన సరియైన అవగాహన కలిగి, దానికి విరుద్ధమైన పనులు చేయకుండుట.

2. నీవు ఆర్థికముగా స్వతంత్రుడవుగా, సంఘపరముగా బాధ్యతలు తెలిసినవాడిగా ఉండుట.

3. నీకు సుఖవ్యాధి సంబంధమైన బాధలు లేకుండుట.

4. నీవు ధర్మబద్ధమైన జీవనోపాధి కలిగి ఉండుట.

5. నీకు ఆరోగ్యమును భంగపరచునట్టి అలవాట్లు అనగా మద్యపానము, మాదక ద్రవ్యములు మొదలైనటు వంటివి స్వీకరించు అలవాట్లు లేకుండుట.

6. నీవు ఈ యోగమును కనీసము 10 సంవత్సరములు నిర్విఘ్నముగా చేయగల మానసిక స్థిరత్వము కలిగి ఉండుట.

7. నీవు శ్వాసకు సంబంధించిన వ్యాయామములు నిర్దేశము లేకుండా చేయకుండుట.

**యోగసాధనా నియమములు :**

1. కాలమును వృథా చేయకుము.

2. నీకు తెలిసిన పరిమిత జ్ఞానముతో ఏది సరియైనదో, ఏది కాదో నిర్ణయింపకుము.

3. అందరికీ నీకుండు భావమే ఉండవలెనని భ్రాంతి చెందకుము.

4. మొండిగా ఉండక ఇతరుల అనుకూలతలు కూడా గమనింపుము.

5. పనులన్నియు నెరవేరుట మొత్తము మన చేతిలో లేదని గుర్తింపుము.

6. వెంటనే పరిష్కారము లభింపని, కాలానుగతముగా

పరిష్కారము కాగల విషయముల పట్ల నీవు కలత చెందుట, ఇతరులను కలవర పరచుట చేయకుము.

7. చిన్న విషయములపట్ల అలజడి పెట్టక, ఇతరుల బలహీనతలపట్ల సానుభూతి వహింపుము.

8. నీవు చేయగల సహాయమును నిరాకరించుట/ అశ్రద్ధ చేయకుము.

9. నీకు సాధ్యముకానిది ఇతరులకు కూడ సాధ్యముకాదని భావింపకుము.

10. మూఢ నమ్మకములు లేక, ప్రతి దానిని నీ చిన్న నమ్మకమను కొలబద్దతో చూడకుము.

11. మంచి అనిపించు ప్రతి దాని వెంట పడకుము. నీవు చేయుచున్న సాధన కొనసాగింపుము.

12. పరిపూర్ణతకై దృష్టి పెట్టుము. సిద్ధిని నిర్ధారించుకొనవలదు.

**నా వాహికలు (అంగీకరింపబడిన శిష్యులు) ఎవరనగా :**

1. ఉదయ సాయంసంధ్యలలో 6 గంటలకు క్రమము తప్పక ప్రార్థన చేయువారు.

2. అన్ని సమయములందు, ప్రతి రూపములోనూ, ప్రతి పేరులోనూ, ప్రతి చోటునందు నన్నే చూచువారు.

3. తమ స్వంత పనులకై ఇతరులను యాచింపక, తమ వ్యక్తిత్వమును దాటి నివసించువారు.

4. మృత్యువు ఒక మార్పు మాత్రమే అని అర్థము చేసుకోండి– రూపము యొక్క మార్పే కానీ జీవుడు అంతము అయిపోవడము కాదు.

5. ఆధ్యాత్మిక దినచర్య పుస్తకమునుంచుకొని నాయొక్క సూచనలను వ్రాసుకొని అనుసరించేవారు.

**- మాస్టర్ C.V.V.**

# 7. ధనిష్ఠ*

*"గాలి వీచుగాక! సంపద ప్రవహించుగాక!"*

రాశి చక్రములో 27 నక్షత్రము లున్నవి. వానిని చంద్రుని యొక్క 27 భవనములుగా తెలుపబడినవి. ఈ భవనములను సూచిస్తూ జీసస్ " నా తండ్రికి చాలా భవనములు ఉన్నవి" అని తెలిపినారు.

చంద్రుడు యీ భవనములలో ప్రతి నిత్యము సంచరించును. చంద్రుడు ప్రతిరోజూ సుమారు 13 డిగ్రీలు కదలుతుంటాడు. కొన్నిసార్లు త్వరగా, కొన్నిసార్లు నిదానముగా– కానీ ఈ 27 నక్షత్రములు కలిసి 360 డిగ్రీలు అవుతాయి. ప్రతి భవనము 13 డిగ్రీల 20 నిముషములు. మేషరాశి నుండి సింహరాశి వరకు 120 డిగ్రీలు లేక 9 భవనములు. సింహరాశి నుండి ధనూరాశి వరకు చంద్రుడు ఇంకొక 9 భవనములు కదలుతాడు. ధనూరాశి నుండి మేషరాశి వరకు ఇంకొక 9 భవనములు కదలుతాడు. ఇలా 27 భవనములు 360 డిగ్రీలుగా సంచరించును.

చాంద్రమానములో ఒక మాసములో చంద్రుడు 12 రాశులు, 27 నక్షత్రములు చుట్టివస్తాడు. గ్రహముల గతిని

*తేది 8–1–1992న మాస్టర్ పార్వతీకుమార్‌గారు చేసిన ప్రవచనము.

సూచించు "ఎఫిమెరిస్" ప్రకారము సూర్యుని ఆధారముగా తీసుకొని గుణింపబడు "సాయన" పద్ధతిలో ధనిష్ఠ నక్షత్రము కుంభరాశిలో 16 డిగ్రీల 40 నిముషముల నుండి 30 డిగ్రీల వరకు ఉంటుంది.

చాంద్రమానము ప్రకారము గుణింపబడు ''నిరయన" పద్ధతిలో ధనిష్ఠ మకరము 23 డిగ్రీల 20 నిముషముల నుండి కుంభరాశి 6 డిగ్రీల 40 నిముషముల వరకు ఉంటుంది.

ఈ రెండు పద్ధతుల వ్యత్యాసము 23 డిగ్రీల 20 నిముషములు.

ధనిష్ఠ నక్షత్రము ద్వారా కుంభ చైతన్యము లేదా సమన్వయ శక్తి భూమిని సందర్శించింది. మాస్టర్ C.V.V. జన్మమునందు చంద్రుడు ధనిష్ఠ నక్షత్రము యందున్నాడు. ఇది యాదృచ్ఛికము కాదు. కుంభరాశికి చెందిన మాస్టరుగారు, కుంభ చైతన్యమును భూమికి, భూమి జీవులకు ప్రసరింపజేయుటకై కుంభరాశిని ఎన్నుకొన్నారు.

ఇప్పుడు ఈ విషయాన్ని ఇంకొక కోణము నుండి పరిశీలిద్దాము. విషువము (రాశిచక్రము యొక్క అక్షము) మార్గాన్ని ఇప్పుడు గమనిస్తాము. రాశిచక్రము యొక్క అక్షము మీనరాశి నుండి కుంభరాశి లోనికి ప్రవేశించిన సంవత్సరము 1837 లో విక్టోరియా రాణికి పట్టాభిషేకము జరిగినది. (1877 వ సంవత్సరములో ఆమె భారతదేశపు రాణిగా ప్రకటింపబడినది).

ఆ సంవత్సరము రాశిచక్రము యొక్క అక్షము కుంభరాశిలోని 30వ డిగ్రీలో ప్రవేశించినది. 1837కు 72 సంవత్సరములు కలిపితే 1909. ఆ సంవత్సరములో రాశిచక్రము యొక్క అక్షము కుంభరాశి 29వ డిగ్రీలో ప్రవేశించింది. దానికి 72 సంవత్సరములు కలిపితే 1981వ సంవత్సరములో రాశిచక్రము యొక్క అక్షము కుంభరాశి 28 వ డిగ్రీలో ప్రవేశించింది. అలా రాశిచక్రము యొక్క అక్షము ధనిష్ఠ నక్షత్రములో కదలుచున్నది. అది ఇంకొక 13 డిగ్రీల 20 నిముషములు ధనిష్ఠ నక్షత్రములో కదలుతుంది. విషువము ఒక డిగ్రీ కదలికకు72 సంవత్సరములు పడుతుంది. 13 డిగ్రీల 20 నిముషములు కదలుటకు 960 సంవత్సరములు పడుతుంది. (72 సంవత్సరములు x 13 డిగ్రీలు = 936 సంవత్సరములు. 20 నిముషములు డిగ్రీలో మూడవ భాగము. కాబట్టి 72 సంవత్సరములు/3=24 సంవత్సరములు. మొత్తము 936 + 24 = 960 సంవత్సరములు.) అలా ధనిష్ఠ నక్షత్రము యొక్క ప్రభావము విక్టోరియా రాణి పట్టాభిషేకము జరిగిన 1837వ సంవత్సరము నుండి 960 సంవత్సరములు అనగా 2797వ సంవత్సరము వరకు మన భూమిపై ఉంటుంది.

రాశిచక్రము యొక్క అక్షము మీనరాశి నుండి కుంభ రాశిలోనికి మారినప్పటి నుండి సమన్వయ శక్తి మన భూమికి అందుచున్నది. కుంభరాశిలోనికి ప్రవేశింపగానే వచ్చు నక్షత్రము ధనిష్ఠ. కావున కుంభరాశి శక్తిని లేక చైతన్యమును అందుకొన దలచిన వారికి ధనిష్ఠ నక్షత్రము చాలా ముఖ్యమైనది.

మనకు శక్తి ప్రసారము గావించు ఉపగ్రహములలో చంద్రుడు ముఖ్యమైనందు వలన, చంద్రుడు ఈ నక్షత్రములో నున్నప్పుడు, మనము దానికి ఉన్ముఖమైతే కుంభరాశి చైతన్యమును అందుకొను అవకాశముంటుంది. ఉదాహరణకు ఈ రోజు మనము చంద్రుని చూస్తే, అతడు ధనిష్ఠ నక్షత్రములో ఉన్నాడు. చంద్రుడు ఈ నక్షత్రములోనికి నిన్న రాత్రి 10 గంటలకు ప్రవేశించాడు. ఈ ధనిష్ఠ నక్షత్రములో రాత్రి 12 గంటల వరకు ఉంటాడు. ఈ సమయములో మనము చక్కగా ఉన్ముఖత్వము కనపరిస్తే మనము చక్కగా కుంభచైతన్యమును అందుకొనవచ్చును.

"నా నక్షత్రముపై ధ్యానము చేయుము" అని మాస్టర్ C.V.V. గారు ఈ కారణము వల్ల తెలిపారు. కానీ వారు వివరములు ఇవ్వలేదు. ఎవరైనను గర్వముతో "నేను వారి నక్షత్రమున్నరోజే ఎందుకు ధ్యానము చేయాలి?" అని ప్రశ్నిస్తే వారు దానినుండి బయటకు వచ్చినట్లే. పెద్దలు వివరణలు ఇవ్వరు, సూచన లిస్తారు. మనకు తెలుసుకొనవలెనన్న కుతూహలము వుంటే, కనుగొనుట మన పని. మనకు కుతూహలము లేకున్నను, వారిచ్చినది పాటిస్తే అదే శక్తి మనకు వస్తుంది. అన్నిటికంటే ముఖ్యమైన దేమిటంటే వారిచ్చిన సమయమునకు ఉన్ముఖముగా ఉండుట.

ధనిష్ఠ అను పదమునకు అర్థము "సంపన్నమైన గాలి". కుంభరాశి వాయుతత్వ రాశి. సంపన్నమైన గాలిని ధనిష్ఠ ఇస్తుంది. ఇది ఈ నక్షత్రము యొక్క లక్షణము. సంపద అనునది

ఆస్తిపాస్తులకు, బాంకు ఖాతాలోని ధనమునకు సంబంధించినది కాదు. సంపద అను పదమునకు అర్థము వైభవము, పరిపూర్ణత.

ధనవంతులు అని పిలువబడు వారందరూ సంపన్నులు కారు. అలాగే బీదవా రనబడువా రందరూ సంపద లేనివారూ కాదు. సంపన్ను లందరూ ధనము, బాంకు ఖాతాలోని ధనమును ఎక్కువగా పట్టించుకోరు. ఆ స్థితి ఎలాంటిదంటే అతనికి అన్ని విషయముల ప్రయోజకత్వము సరిగా తెలుస్తుంది కానీ దేనిని గూర్చి ప్రాకులాడుట వుండదు. దేనినిగూర్చి ప్రాకులాడుటలేని వ్యక్తి ఉంటే మిగిలినవారు అతని కొరకై చూస్తారు. కాబట్టే మాస్టరుగారు " ట్రిక్ ది ట్రిక్" అని తెలిపినారు. మనము ఏదైనా విషయము వెంట పడితే, అవి మనను వాటి వెంట పరుగెత్తేటట్లు చేస్తాయి. మనము వాటి వెంట పడడము మానివేస్తే అవి మన వెంట పరుగెత్తుతాయి. సంపన్నునికి ధన్యవంతునికీ మధ్య తేడా ఇదియే. జీవితములోని విషయముల పట్ల వెంటపడని వారిచుట్టూ సంపన్నమైన గాలి ఉంటుంది. ధనిష్ఠ నక్షత్రము అటువంటి మార్పు నిస్తుంది. ఇటువంటి గాలి ఈ నక్షత్రము ద్వారా భూమికి అందుతుంది. కాబట్టి ఈ నక్షత్రమునకు ఉన్ముఖమైతే శక్తిని అందుకొనుట వీలౌతుంది. సుమారు వేయి సంవత్సరములు ఈ రాశి మన జీవితమును సర్దుబాటు చేసుకొనుటకు తోడ్పడుతుంది. కాబట్టి ధనిష్ఠలో జరుగు శక్తి ప్రసారము మనము ఆ సమయమునకు ఒక ప్రణాళిక వేసుకొనుటతో అందుకొనుట సాధ్యమౌతుంది. దానితో మనిషి వైభవమును పొందగలుగుట, భూమి ప్రణాళికను

పూర్తిచేయుట సాధ్యమౌతాయి. పదార్థము పట్ల మానవునికి గల ఉన్ముఖత్వమును 180 డిగ్రీలు మార్పుచేసి అతనిని ఆకాశము వైపునకు త్రిప్పి, అతనిని అంతరిక్ష మానవునిగా చేయవలసిన అవసరమున్నది.

చంద్రుడు ప్రతినెలా ధనిష్ఠా నక్షత్ర గమనము చేస్తే సూర్యుడు సంవత్సరమున కొకసారి చేస్తాడు. ఆ సమయము సూర్యుడు కుంభరాశి 16 డిగ్రీల 40 నిముషముల నుండి 30 డిగ్రీల వరకు ప్రయాణిస్తాడు. అది సుమారు ఫిబ్రవరి7వ తారీఖు నుండి 20వ తారీఖు వరకు ఉంటుంది. సూర్య చంద్రులు ధనిష్ఠ నక్షత్రములో ప్రయాణించు సమయములో ధనిష్ఠ చైతన్యమునకు ఉన్ముఖమగుటకు, అందుకొనుటకు ఈ రోజులు ముఖ్యమైనవి. నెలలో ఒకసారి చంద్రుని నుండి, సంవత్సరమున కొకసారి రెండు వారములు సూర్యుని నుండి ఈ చైతన్యమును అందుకుంటాము. మిగిలిన గ్రహములు ధనిష్ఠ ద్వారా ప్రయాణించునప్పుడు కొంత వరకు తమ లక్షణములతోబాటు, ధనిష్ఠ చైతన్యమును కూడా కొంతవరకు అందిస్తాయి. ఎందుకంటే అన్ని గ్రహములపై నక్షత్రముల ప్రభావము ఉంటుంది. మనపై చంద్రుడు, సూర్యుడు, లగ్నము ఎక్కువ ప్రభావము చూపిస్తాయి కాబట్టి, చంద్రుడు ఆ నక్షత్రములోనికి వచ్చినప్పుడు, ఆరోజు ధ్యానము చేయుటవలన ధనిష్ఠ చైతన్యమును అందుకొన వచ్చును. సూర్యుడు ఒక పక్షము (రెండు వారములు) ఆ నక్షత్రములో ప్రయాణించునప్పుడు మనము ఉన్ముఖమై ధ్యానము చేసిన ఆ చైతన్యమును అందుకొన గలుగుతాము.

మన పురోగమించిన (Progressed) లగ్నము, చంద్రుడు, సూర్యుడు ఈ రాశిలోనికి ప్రవేశించినప్పుడు, ఈ క్రొత్త యుగములోని ధనిష్ఠా ప్రభావము వలన, మనము తప్పకుండా ఈ చైతన్యములోనికి ప్రవేశిస్తాము. మనకు జ్యోతిషశాస్త్రము యొక్క అవగాహన ఉన్నప్పుడు ఇవి చక్కగా అర్థము చేసుకొనగలము.

మనము ఈ ధ్యానములను మొదట మార్చి 1990లో ప్రవేశపెట్టాము. ఒక రోజు మేము ధ్యానము చేసినప్పుడు, రోజూకంటే లోతైన అనుభవము కలిగినది. అప్పుడు ఆ రోజు గ్రహ స్థితి చూడాలనిపించింది. ఆ రోజు చంద్రుడు ధనిష్ఠ నక్షత్రములో నున్నట్టు గుర్తించాను. తరువాత సారి ధనిష్ఠ నక్షత్రమున్నప్పుడు, ఒక బృందముతో కలిసి ధ్యానము చేస్తే అదే లోతైన అనుభవము కలిగినది. అప్పటినుండి ధనిష్ఠ చైతన్యమును అందుకొనుటకు ఆ రోజును ఉపయోగించుకొనవలయు నను ఆలోచన వచ్చినది.

చంద్రుడు రాత్రి 9 గంటలకు ధనిష్ఠ నక్షత్రములో నున్నప్పుడు ఈ ధ్యానమును జరుపుకొను పద్ధతి మొదలుపెట్టాను. నిన్న రాత్రి 10 గంటల వరకు చంద్రుడు ధనిష్ఠ నక్షత్ర ప్రవేశము చేయలేదు. ఈ రోజు అర్ధరాత్రి వరకు చంద్రుడు ధనిష్ఠలో నున్నాడు. ఏ రోజు రాత్రి 9 గంటలకు చంద్రుడు ధనిష్ఠ నక్షత్రములో ఉంటే ఆ రోజు ధనిష్ఠా ధ్యానము చేయాలని ప్రతిపాదించాము. మనకు చంద్రుడు ఏ సమయములో ధనిష్ఠలో ప్రవేశిస్తున్నాడు, ఏ సమయానికి నిష్క్రమిస్తున్నాడో సరిగా తెలుసుకుంటే, ఆ 22 నుండి 26 గంటలలో మనము ఆ చైతన్యమునకు ఉన్ముఖము కావచ్చును. కొన్నిసార్లు

చంద్రుడు ఎక్కువసేపు ఉంటే కొన్నిసార్లు త్వరగా కదలవచ్చును. మనము చంద్రుడు ధనిష్ఠలో నుండు మొత్తము సమయము తెలిస్తే, ఆ సమయము మొత్తము అందుకు ఉన్ముఖము కావచ్చును. సమష్టి ధ్యానమునకై 9 గంటల సమయము నిర్దేశింపబడినది. ఆ సమయమునకు రోజు పనులన్నీ పూర్తి చేసుకొన గలుగుతారు. ఆ సమయమునకు తేలికగా ఆహారము తీసుకొని, ధ్యానము చేసుకొని ఆ ఎరుకతో నిద్రలోనికి పోవచ్చును. ఈ ధ్యానము కుంభ చైతన్య ప్రవేశమునకు అనుగుణమైనది. ఇది విషువము యొక్క కదలికకు కూడా అనుగుణమైనది. మాస్టర్ C.V.V. గారిచ్చిన ప్రణాళికకు కూడా అనుగుణమైనది. అందుకనే మాస్టరుగారు "నా జన్మ చంద్రుడున్న నక్షత్రముపై ధ్యానము చేయుడు" అని తెలిపినారు. ధనిష్ఠా ధ్యానము ఇలా ప్రారంభమైనది.

## మాస్టరుగారి పునః ప్రవేశము :

### సత్య స్థితులు


మాస్టరుగారిచే ప్రారంభింపబడిన యోగపాఠశాలలో క్రింద తెలుపబడిన చిత్రములు ప్రదర్శింపబడినవి.

1. మాస్టరుగారి పునః ప్రవేశము

2. సత్య స్థితులు

నూతన యుగమునకు సంబంధించిన ఈ పరిభాష మన ఉనికిని తెలియజేయు సందర్భములో మాస్టరుగారిచే వాడబడినది. కాలానుగతమైన ఈ పేర్లు గతమునకు, వర్తమానమునకు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కల్పింపబడినవి. కానీ అట్టి స్థితులకు ఏ పేర్లూ లేవు.

## మాస్టరుగారి తిరుగు ప్రయాణ వివరములు :




## సత్య స్థితులు:

47. ది హై ప్యూర్
46. నేషన్ ఆఫ్ ఫారిటికల్ ప్యూర్
45. ప్యూర్

44. ప్యూర్ హీలింగ్ (ఆల్ సైడ్స్ హీలింగ్, ఫీలింగ్లెస్)
43. ప్యూర్ సైన్స్
42. గ్రేటెస్ట్
41. గ్రేటెస్ట్ హీలింగ్
40. లాంగ్రాట్ లిఫెరి సైన్స్
39. హెర్క్రరీ
38. హేంబ్రో టైర్
37. హేంబ్రో సైన్స్
36. పుస్సిఫిగ్రిటీ వర్కింగ్ నియోజినల్  థియరీ
35. పుస్సిఫిగ్రిటీ
34. పుస్సిఫిగ్రిటీ హీలింగ్ (హై హీలింగ్ )
33. హౌలింగ్ (విత్ ఫీలింగ్ )
32. హోలింగ్ (విత్ ఫీలింగ్ )
31. హాలింగ్(విత్ ఫీలింగ్ )
30. హీలింగ్ (విత్ ఫీలింగ్ )
29. నాన్ వైలెంట్ (హౌలింగ్ ట్రైడ్ ఫార్మ్)
28. వైలెంట్ క్యూబ్ ( హోలింగ్ ట్రైడ్ ఫార్మ్)
27. వైలెంట్ కడ్డర్ క్యూబ్   (హాలింగ్ ట్రైడ్ ఫార్మ్)
26. వార్జ్ లెంట్ క్యూబ్ (హీలింగ్ ట్రైడ్ ఫార్మ్)
25. న్యూ మాడల్ పిట్యూటరీ
24. ప్రైమస్ లిమిట్
23. హైలోబ్స్ వన్

22. అటెంప్ట్ వన్
21. ఎనర్జీ వన్
20 .సెకండ్స్ వన్
19. స్టాగ్నంట్ వన్ ( ఎబ్బింగ్ వన్)
18. ప్రాణా సైడ్
17. మైక్రోలెవల్
16. ట్రిపుల్ ట్రిక్
15. ప్లానెటరీ ఫీల్డ్
14. ఎర్త్ మెమోరాండం
13. మాన్ మెమోరాండం
12. మహాపర నిర్వాణము
11. పర నిర్వాణము
10. నిర్వాణము
9. బుద్ధి
8. మానసిక అరూపము
7. మానసిక రూపము
6. ఆస్ట్రల్
5. సూక్ష్మము
4. భౌతికము
1. భృక్తము
2. రహితము
3. తారకము.

# ౮. ఆధ్యాత్మికతయే సహజ స్థితి

*"సాధారణ స్వభావము" , " స్థితుల నందుకొనుట"*

ఆధ్యాత్మికత అనునది లోతైన సత్యము. దానివెంట మనము పిచ్చిగా తిరుగలేము. దానికై అటునిటు పరుగెత్తక, మనము ఉన్న చోటు నుండి ఉన్నస్థితితో ప్రారంభించాలి. ఒక సాధకుడు తాను వసించు పరిస్థితులను, తన జీవిత స్థితిని గుర్తించాలి. అప్పుడు మాత్రమే అతడు మాస్టరుగారు ఇచ్చిన జ్ఞానము యొక్క లోతులలోనికి పోగలుగుతాడు. దీనికై మాస్టరుగారు ఇచ్చిన గుప్తమంత్రమే "Normal Temperament" లేక సాధారణ స్వభావము. దీనిని ప్రసిద్ధి చెందిన ఒక కథ ద్వారా తెలుసు కుందాము.

ఒక సాధకుడు తాను పూర్తిగా ఆధ్యాత్మిక సాధన లోనికి వెళ్ళాలనుకొనేవాడు. దానిని పొందుటకై తాను చేయు పను లన్నిటిని పూర్తిగా వదలిపెట్టి సాధన చేయాలనుకొంటాడు.అందుకని అతడు ఒక చెట్టుకింద కూర్చొని కొన్ని సంవత్సరములు సాధన చేశాడు. ఒక రోజు అతడు కూర్చొన్న చెట్టుపై నున్న ఒక పిట్ట వేసిన రెట్ట (మలము) అతని ముఖ్యముపై పడింది. దానితో చెదరిన అతడు కళ్ళుతెరచి ఆ పిట్టను చూడగానే అది భస్మమైపోయింది.

ఈ సంఘటనతో అతడు తనకు చాలా శక్తి వచ్చిందని,

దానితో దేనినైనా భస్మము చేయగలనని తలచాడు. దానితో ఇతరులు తన ముఖ వర్చస్సును గమనిస్తారని, తనను అనుసరిస్తారని అనుకున్నాడు. ఈ ఆలోచనతో అతడు పట్టణము లోనికి వెళ్ళాడు. కానీ ఎవ్వరూ అతనిని గమనించలేదు. అతనిని పట్టించుకొనలేదు. ఈలోగా అతనిని ఆకలి తీవ్రముగా బాధించ సాగింది. అప్పుడు అతడు ఒక ఇంటిముందు నిలచి భిక్ష అడిగాడు.

ఆ ఇంటి యజమానురాలు తన భర్త అవసరములను చూచుకొనుటలో నిమగ్నమై ఉన్నది. తన ఇంటిముందు నిలచిన వ్యక్తియొక్క గొంతు విని, నేను నా భర్తను సేవిస్తున్నాను, కొంచము సేపు వేచి ఉండు అని తెలిపినది. తన భర్త భోజనము చేసి, విశ్రాంతి తీసుకొన్న పిమ్మట వచ్చిన అతిథికి ఆహారాన్ని ఇవ్వడానికి బయటకు వచ్చింది.

ఒక సాధారణ గృహిణి తనను భిక్షకై ఇంతసేపు నిలబెట్టినదని అతనికి తీవ్రమైన కోపము వచ్చి ఎర్రబడిన కన్నులతో ఆమె వైపు చూశాడు. అప్పుడామె మర్యాదగా ఇలా అన్నది "ఏమండీ! నేను ఆ పిట్టను కాను."

దానితో అతడు ఉలిక్కిపడి చాలా గాభరాపడ్డ స్వరముతో "మీకు ఆ పిట్టను గురించి ఎలా తెలుసు?" అని అడిగాడు.

దానికి ఆ గృహిణి "బాధ్యతాయుతముగా జీవితములో కర్తవ్యమును ఆచరించువానికి అది తెలియుట సులభమే" అని జవాబిచ్చింది.

అప్పుడతడు "మీరు ధ్యానము చేస్తారా?" అని అడిగాడు.

దానికి గృహిణి "లేదు. నేను ఎన్నడూ ధ్యానము చేయను" అని జవాబిచ్చింది.

దానికి అతడు "మీకు దూరదృష్టి ఎలా వచ్చింది?" అని ప్రశ్నించాడు.

దానికి గృహిణి "మీ ప్రశ్నకు సమాధానము ముందే చెప్పాను. కానీ మీరు వినలేకపోయారు. తమ కర్తవ్యమును దీక్షతో ఆచరించే వారికి దూరదృష్టి సహజముగానే వస్తుంది."

అత్యాశ్చర్యముతో అతడు "నన్ను మీ శిష్యునిగా స్వీకరిస్తారా?" అని అడిగాడు.

"నేను తీసుకోలేను" అని సమాధాన మిచ్చింది ఆ గృహిణి. "కానీ మా గురువు వద్దకు వెడితే మీకు కావలసినది వారు బోధిస్తారు." అటు పిమ్మట ఆ గృహిణి తన గురువుగారి వివరాలు, వారుండు చోటు తెలిపింది.

అప్పుడు ఆ సాధకుడు గ్రామములో ఆ గురువుగారిని వెతుకుతూ వెడతాడు. ఆ గ్రామములో ఆధ్యాత్మికులు, ఉన్నత వర్గము వారు, వైశ్యులు, వృత్తి పనులు చేసుకొనువారుండు అన్ని చోట్లా వెతుకుతాడు. అయిననూ అక్కడెక్కడా ఆమె తెలిపిన గురువు కనపడలేదు. అతనికి ఆ గృహిణి తనను ఆట పట్టించుటకై అలా చెప్పినదేమోనను ఆలోచన వచ్చింది. తరువాత ఆ గ్రామములో

పూరిగుడిసెలలో ఎవరైనా ఉన్నారేమోనని చివరిసారిగా వెతకుట ప్రారంభిస్తాడు.

అక్కడ ఉండే ఒక వ్యక్తి ఆ గురువు ఉన్నారని, అక్కడికి పోవు మార్గము సూచించి తీసుకొని వెడతాడు. అతనిని ఇంకా తీవ్రమైన ఆశ్చర్యానికి గురిచేస్తూ ఆ గురువు పంది మాంసమును ఖండించి ముక్కలు చేస్తూ కనిపిస్తాడు. చాలాసేపు వెళ్ళాలా వద్దా అని సందేహించి, ఆ గురువు వద్దకు వెళ్ళి ఆయన పేరు తెలుసుకుంటాడు. ఆ గురువు మందహాసముతో అతడు అడిగినది తానే అని తెలిపి, ఇంకా మాంసమును ఖండిస్తూ ఉంటాడు. తాను వేచి ఉండదలచి, ఆ గురువు తన వృత్తిని చక్కగా మందహాసముతో ఎలా చేస్తున్నాడో గమనిస్తాడు. అతడు దుకాణము మూసివేసి ఒక గంట తరువాత బయటకు వస్తాడు.

అప్పుడు సాధకుడు “మీరు ఇంటిలోనికి వెళ్ళి ధ్యానము చేస్తున్నారా?” అని అడుగుతాడు.

దానికి ఆ గురువు “లేదు. వృద్ధులైన నా తల్లితండ్రులకు సేవ చేస్తున్నాను. వారికి స్నానము చేయించి, భోజనమిచ్చి, వారి విశ్రాంతికి కావలసిన ఏర్పాట్లు చేస్తున్నాను.”

ఆశ్చర్యచకితుడైన ఆ సాధకుని చూపులో ధ్యానమంటే ఏమిటనే ప్రశ్న ఉదయిస్తుంది.

ఆ గురువుగారు చిరు మందహాసముతో, మృదువైన

పదములతో "జీవితములోని అన్ని పరిస్థితులలో ఎక్కువ తక్కువలు అను భావములేక ఉండుము. అదే ధ్యానము" అని తెలిపారు.

అలా ఆ వ్యక్తి సాధనా మార్గములో చేరి ఒక గురువుగా మారు మార్గములోనికి అడుగు పెట్టాడు. సాధారణముగా ఉండుట, బాధ్యతాయుతముగా ఉండుట, నిరాడంబరముగా ఉండుటయే ఆధ్యాత్మికత. అది సహజమైనది. సాధారణముగా లేకుండుట కృత్రిమముగా ఉండుటయే. కృత్రిమముగా ఉండుట సత్యదూరమైనది. మనము భార్యా బిడ్డలపట్ల స్వల్పమైన బాధ్యతలను అర్థము చేసుకొనలేకపోతే, ఆధ్యాత్మికతతో వచ్చు గురుతర బాధ్యతలను నిర్వర్తింపలేము. అందువలననే మాస్టరుగారు మనలను అన్ని సన్నివేశములలో "సాధారణముగా ఉండుడు" అని తెలిపినారు.

సాధారణముగా ఉండుట అంటే ఏమి? మొదట మనము గృహస్తులుగా ఉండవచ్చును. మనను పొగడినపుడు గర్వపడుట, విమర్శించినపుడు క్రుంగిపోవుట అక్కరలేదు. మన చుట్టూ సౌఖ్యములు ఉన్నపుడు సోమరులగుట లేక చిందరవందరగా నున్నప్పుడు గాబరా పడుట అక్కరలేదు. మనము క్రమశిక్షణతో నున్నప్పుడు, మనచుట్టూ చెల్లాచెదరుగా నున్న పరిసరములను ఒక క్రమములోనికి తీసుకొనిరావచ్చును. మనమే క్రమముగా లేనప్పుడు, చుట్టూ పరిసరములు క్రమముగా నున్నను, మనమే వానిని చెల్లాచెదరు చేస్తాము. మనము అన్ని పరిస్థితులలోనూ సహజముగా నున్నట్లయితే, ఇతరులను కూడా సహజస్థితికి

తీసుకొని రాగలుగుతాము. చాలా కుతూహలముగల సాధకుడు ఒక గురువును కలుస్తాడు. అతని యొక్క కుతూహలము సహజత్వముతో, నిరాడంబరముగా జవాబివ్వబడుతుంది. అతడు ఇంటికి సహజముగా, నిరాడంబరముగా తిరిగి వస్తాడు. అలాకాక అత్యాసక్తి కలిగిన ఒక వ్యక్తి ఇంకొక అత్యాసక్తి కలిగిన వ్యక్తిని కలిస్తే, వారిద్దరూ ఆసక్తి అను భ్రాంతిలోనికి వెళ్ళి, సహజత్వము కోల్పోయి భావావేశము అను వ్యాధికి లోనౌతారు. ఒక గురువు గారిని కలియుట ఏ ఉద్వేగము లేకుండా జరుగుతుంది. ఉద్వేగమునకు లోనైనప్పుడు, వారిని కలిసే అవకాశము తనకు తానే నిరాకరించుకుంటాడు.

మనము కృత్రిమముగా నున్నప్పుడు వారి శక్తి ప్రవాహము జరుగదని మాస్టరుగారు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇతరులపట్ల నిలకడయైన స్థితిని ప్రదర్శించాలి. ఒక చిక్కుపడిన మనసు, ఒక గందరగోళమునకు గురియైన మనసు, ఒక అలసిన మనసు, ఒక ఆత్రుతతోనున్న మనసు, ఒక దుర్బుద్ధి కలిగిన మనసు మనను కలిసినపుడు, అది మననుండి నిలకడను, ప్రశాంతతను పొందగలగాలి. వారికొక విశ్రాంతి, ఊరట కలగాలి. చాలా సంవత్సరముల తరువాత మొదటిసారిగా మనము నిశ్శబ్దత పొందగలగాలి.

మనము ఊహించుకొనునట్లుగా, మనము ఒకసారి ఒక మాస్టరుగారిని కలిసినప్పుడు విద్యుత్ ఘాతము వంటి దేమీ జరుగదు. కొన్ని సంవత్సరముల వరకు మనకు కనీసము

అర్థము కానటువంటి రీతిలో కొన్ని మార్పులు సాధారణముగా మొదలవుతాయి. మనకు సహజ స్థితి ఉంటే నిశ్శబ్దముగా చాలా మార్పులు తీసుకొని వచ్చుట సాధ్యమౌతుంది.

దాని అర్థము ఆచరణాత్మకముగా ఉండుట. అంటే భూమిని వదలి గాలిలో ఎగురుట వంటి ఊహాజనిత ఆధ్యాత్మికత కాదు. ఇతరులు మనను ఆధ్యాత్మికులుగా గుర్తించవలయునని ఆరాట పడరాదు. ఇతరులు మనను ఆధ్యాత్మికులుగా గుర్తించునట్టి ఎట్టి ప్రయత్నము చేయరాదు. మనము ఇతరులతో మెలగునప్పుడు, సాధారణ మానవులవలె కనిపించు చుండునట్లు చూసుకోవాలి. మన ఆధ్యాత్మికతకు సంబంధించిన అవగాహన తెర వెనుక నుండునట్లు చూచుకోవాలి. ఇతరుల మెప్పుకై ఆధ్యాత్మికతకు సంబంధించిన పదములు వాడుట మానుకోవాలి. ఎదుటివారు చిత్తశుద్ధితో మరల మరల అడుగునంతవరకు పవిత్ర వాక్యములు తెలుపుటకు నోరు తెరువరాదు.

నిజమైన ఆధ్యాత్మిక విద్యార్థి ఎదుటి వ్యక్తిని అర్థము చేసుకొనుటకు ప్రయత్నించి అతడు మాట్లాడిన భాషలోనే అతనికి సమాధాన మివ్వాలి. అతడు వాడని పదములు తాను వాడకుండు నట్లు చూచుకోవాలి. ఇలా చేస్తే గందరగోళములేని భావ వ్యక్తీకరణ సాధ్యమౌతుంది.

ఎదుటి వ్యక్తి యొక్క మాటలు బాహ్యమునకు సంబంధించి నప్పుడు, మన సమాధానము అంతరంగమునకు సంబంధించినది కానక్కరలేదు. మన జ్ఞానము మనలోనే ఉంచుకొని, ఎదుటి

వారికిచ్చు సమాధానము అతనికి అర్థమయ్యే విధముగా అతనికి సరిపోవు స్థితిలోనే ఇవ్వాలి. "మీకు తెలిసిన జ్ఞానమంతయూ ఎదుటివారిపై ప్రదర్శింపరాదు". మాస్టరుగారు తెలిపిన "Meet Levels" అను పదమునకు అర్థము ఇదియే.

ఎదుటి వారిని అర్థము చేసుకొనుటకు, లోనున్న ఉన్నత జ్ఞానముతో వారి స్థాయిలోనే పనిచేయుటకు ప్రతి ఒక్కరికీ కొంత ఓర్పు అవసరమౌతుంది. సాధారణముగా ఎదుటి వ్యక్తి మనకంటే తెలివైనవాడు కావచ్చు. మనము సహజముగా లేనప్పుడు అన్ని సమస్యలు తలెత్తుతాయి. మనము ఊహించుకొనుటలో సహజత్వము మాయమౌతుంది. ఊహాగానముతో చేయు పనులు, ప్రతిసారి సరియైన మార్గములో వెళ్ళక పోవచ్చును. ఒక వ్యక్తిని గురించి నీ వద్దనున్న వివరములు ఒక సమాచారముగా నీతో ఉంచుకొన వచ్చును. అతనితో ప్రవర్తించునప్పుడు ఈ సమాచారము వలన మీరు పక్షపాతమునకు లేదా దురభిమానమునకు లోను కాకుండా చూచుకోండి. అతడు చెప్పదలచుకొన్నది పూర్తిగా చెప్పనివ్వండి. మీరు పూర్తిగా వినండి. దీనిని మీకు తెలిసిన సమాచారముతో కలుపుకొని జవాబివ్వండి. ముందు తెలిసిన విషయములతో మనము ఏకపక్ష నిర్ణయమునకు రానప్పుడు ఇది సాధ్యమౌతుంది. "Normal Temperament" ఇలా అయితే సాధ్యమౌతుంది. "మీకు మునుపు తెలిసిన భావములు మీ చేతలపై నుండరాదు" అని యోగశాస్త్ర పరమగురువైన పతంజలి తెలిపారు.

"నా శిష్యులు ఈ భూమిపై నుండు పెద్ద పట్టణములలో,

సాధారణ వ్యక్తులవలె పనిచేస్తారు. వారు సమాజములో ఎంతగా కలిసిపోతారంటే వారిని విడిగా ఆధ్యాత్మికవేత్తలుగా గుర్తించుట అసాధ్యము" అని మాస్టర్ D.K. (జ్వాల్‌కూల్) తెలిపారు. ఇలా నిష్ణాతులైన ఆధ్యాత్మిక వేత్తలు ప్రపంచములోని వివిధ భాగములలో పనిచేస్తారు. ఆధ్యాత్మికులు/యోగసాధకులు అన్న బిరుదులు లేకుండా పనిచేయుట గొప్ప సౌకర్యము. మనము సహజముగా "meet levels" అన్న స్థితిలో నున్నప్పుడు ఇది సాధ్యమౌతుంది.

ఒక కుమారునిగా తల్లితండ్రుల పట్ల గౌరవము కలిగి ఉండాలి. ఒక భర్తగా భార్య పట్ల నమ్మకము కలిగి ఉండాలి. ఒక దాతగా అతిథుల పట్ల మర్యాద చూపాలి. ఒక విద్యార్థిగా గురువు వద్ద వినయముగా ఉండాలి. ఒక తండ్రిగా పిల్లలకు మార్గదర్శిగా ఉండాలి. ఇలా మామూలుగా, సహజముగా, క్రీడాప్రాయముగా జీవితములోని వివిధ పాత్రలను పోషించాలి. అప్పుడది యోగ జీవితమౌతుంది.

ఇతరులు మనను గమనించునప్పుడు, బాహ్య ప్రతిష్ఠకై మనము చేయు పనులలో జాగ్రత్త చూపుతాము. మనను ఎవ్వరూ గమనించుటలేదు అనునప్పుడు మన నిజ స్వరూపము బయట పడుతుంది. మనము ఎప్పుడూ గమనింపబడు చున్నాము అను భావనతో ప్రవర్తిస్తే, అది సత్యముగా ఉంటుంది. ఈనాటి మానవుడు విరుద్ధ భావముల కలబోత వంటివాడు. అతని లోపలి భావము, బాహ్య ప్రవర్తన అనునవి రెండు వేరు వేరు విషయములు. అతడు వైరుధ్య భావముల కలయికగా జీవిస్తాడు. బయటకు

ఏదోలా కనిపించు అతడు లోపల అదికాదు. బయటకు చక్కగా కనిపించుటకు ప్రయత్నిస్తూ, లోపల మాలిన్యంతో ఉంటాడు. పై కక్ష్యలలో, లోపల చక్కగా ఉండుట గమనింప బడుతుంది. అప్పుడప్పుడు బయటపడు మలిన ప్రవర్తన సమాజములో అణచి వేసుకుంటారు. గురువులు బాహ్యము కంటే లోపల ఎలా ఉన్నాడన్నది గమనిస్తారు. లోని మాలిన్యములను పోగొట్టు కొనుటకు శ్రద్ధ, నిరంతర జాగరూకత అవసరము.

మనిషి ప్రకృతి న్యాయ సూత్రములను, నియమములను అనుసరించుకొలది, మెల్లగా లోపలి మాలిన్యములనుండి బయట పడతాడు. చేయు పనుల ఫలితములు ఎట్లున్నను, పద్ధతులను పాటించుట సహాయపడుతుంది.

"మిమ్ములను, మీ జీవనములోని అన్ని విషయములను గమనిస్తాను. నా యొక్క కార్యక్రమములోనికి మిమ్ములను తీసుకొనుటకు, పనులు చేయుటలోగల మీభావము నిర్ణయిస్తుంది. మీలో రెండు నాలుకల ధోరణి ఉంటే, మీరు నాకు అక్కరలేదు. ఎందుకంటే మీతో పనిచేయుట అపాయకరము. మిమ్ములను, మీతోటి సమాజమును అపాయమునకు గురిచేయలేము" అని మాస్టరుగారు తెలిపారు.

కావున సహజముగా ఉండుట, సత్యముగా నుండుట అనునవి మనకు, మన తోటివారికి సంతోషాన్ని కలిగిస్తాయి.

# ౯. భార్య - భర్తలు

*"కలసి జీవించండి, విడిపోకండి"*

మాస్టరుగారు మనుష్యులు గృహస్థ ధర్మాన్ని పాటించాలనే నియమాన్ని పెట్టారు. తాను దానికొక ఉదాహరణగా ఉండుట చాలా ముఖ్యమైన విషయము. గృహస్థ జీవనము పరిపూర్ణమైన జీవితాన్ని ఇస్తుంది. మనిషి తన భార్యతో కలసి జీవించుట స్త్రీ శక్తి యొక్క సహచర్యములో జీవించుటగా అర్థము చేసుకోవాలి. గృహస్థ జీవనము భావావేశపూర్ణమైన కలయికగా తెలుపబడలేదు. కామపూరితమైన కలయికకు, స్త్రీ సహచర్యములో జీవించుటకు మధ్యగల ముఖ్యమైన తేడాను మాస్టరుగారు తెలియజేశారు. కలయిక అనునది జంతుపరమైన అవగాహన కాగా, సహచర్యము అనునది ఒక లక్ష్యమునకై జీవించేది. ఈ మొత్తము సృష్టి అంతా స్త్రీ పురుష శక్తుల సమాగమముపై ఆధారపడి ఉన్నది. కాబట్టి స్త్రీ, పురుషులు భార్యాభర్తలుగా కలసి జంటగా జీవించుట అవసరము. వారిద్దరూ కలసినప్పుడే మొత్తము పూర్ణమౌతుంది.

కలసి జీవించుట ముఖ్యమైనది. భర్త, అతని భార్య మధ్య శక్తి క్రమముగా ఒకరినుండి మరియొకరికి ప్రసరించుట వలన అనుభూతి పూర్తి అవుతుంది. ఈ అనుభూతి పరిపూర్ణమైనది. కాబట్టి మాస్టరుగారు ప్రతి ఒక్కరూ తప్పకుండా వివాహము

చేసుకోవాలని సూచించారు. ప్రతి పురుషుని జీవనములో ఒక స్త్రీ ఉండాలని తెలిపారు.

ఆధ్యాత్మికతలో ఉండుట అంటే సాధారణమైన సరికాని అవగాహన ఏమిటంటే, నీ జీవితములో ఏ స్త్రీ ఉండకూడదు. దాని అర్థము స్త్రీ సంయోగము లేనివాడే ఆధ్యాత్మికుడౌతాడు. మాస్టరుగారు ఇది అంగీకరించలేదు.

ధన ఋణ శక్తుల కలయికయే చక్కని ఆత్మానుభవాన్ని ఇస్తుంది. యోగ సాధనలో స్త్రీ శక్తి లేనిచో సాధనలో చాలా అడ్డంకులు ఉంటాయి. అలాగే పురుష శక్తి కలియనిచో స్త్రీ కూడా నిజమైన యోగానుభూతిని పొందలేదు. ఎందుకంటే, ఆత్మ, స్త్రీ యో పురుషుడో కాదు కానీ ఇంద్రియములు స్త్రీ పురుషులను వేరుగా గుర్తిస్తాయి. కాబట్టి, యోగానుభూతి పొందుటకు ఒక చక్కని శక్తుల సమ్మేళనము అవసరము.

క్రమశిక్షణ పేరిట భావావేశములను అణగత్రొక్కుట మాస్టరుగారు అనుమతించలేదు. అలాగే ఎక్కువ కామమునందు ఉండుట సరికాదు. స్త్రీ పురుష సంయోగము మానుట సరికాదు. నియమబద్ధమైన కామము ఆధ్యాత్మిక జీవనమునకు సరియైన మార్గము.

బ్రహ్మచర్య మనునది సహజమైన గుణము. బ్రహ్మచర్యము అను గుణము స్వీయ నిగ్రహము ద్వారా అలవాటు చేసుకొన వచ్చును. అది సహజముగా వచ్చుట ఆరోగ్యకరము. అది అలవాటు చేయునప్పుడు, అది సిద్ధించువరకు బాధాకరముగా ఉంటుంది.

భౌతికముగా మానుట అనునదికాక, బ్రహ్మచర్యము బాగా మానసిక భావముగా ఉండాలి. మానసికముగా స్త్రీ సుఖమునకై బలమైన కోరిక కలిగి, భౌతికముగా మానుట లోన కల్లోలమునకు దారితీస్తుంది. దీనితో సాధకుడు ఈ కల్లోలముతో బాధపడిన భౌతికముగా అతనికి దీర్ఘవ్యాధిగా స్థిరపడుతుంది.

ఒక వ్యక్తి ఉన్నతమైన జీవితాశయము కలిగి, దానిని సాధించుటలో పూర్తిగా నిమగ్నమైనప్పుడు, బ్రహ్మచర్యమను గుణము శాంతియుతముగా పొందగలుగుతాడు. ఉన్నతమైన ఆశయము కలిగి, దానిని సాధించుకొనునప్పుడు, వ్యక్తి యొక్క లక్ష్యము దానిపై ఉన్నప్పుడు, ప్రక్క విషయములైన ఇంద్రియ పరితృప్తికై ప్రాకులాడుటకు సమయము ఉండదు.

సన్యాసు లందరు, ఆ పదము యొక్క నిజమైన అర్థములో, సహజ బ్రహ్మచారులు. వారు సత్యములో సమస్థితిలో ఉంటారు. వారిని ఏ విషయము కలవరపెట్టదు. వారికి ఏమియూ అక్కరలేదు. వారు తమలో తాము ఉంటారు. స్త్రీ పురుష వివక్ష వారిని కలవర పెట్టదు.

భగవంతుని పట్లగల ప్రేమ, యోగసాధకుల యొక్క చైతన్యమును ఉన్నత స్థితికి తీసుకొనిపోయినప్పుడు, క్రమముగా బ్రహ్మచర్య స్థితిని సాధిస్తారు. ఆ ప్రేమ వారిని ఇంద్రియములు, వాని వెంటపడు మనస్సును దాటిస్తుంది. వారి యొక్క లక్ష్యముపై దృష్టి నిలిపినప్పుడు చైతన్యము భౌతికమైన విషయముల పైనుండి ఊర్ధ్వగతి పొంది భగవత్ సామ్రాజ్యము వైపు వెడుతుంది. ఇక్కడ లక్ష్యముపై నిలిచిన దృష్టియే ముఖ్యముకానీ, బలవంతముగా

విధింపబడిన బ్రహ్మచర్యము కాదు. భగవంతుని ప్రేమ, వెలుగు, శక్తి– వీని ధ్యానముపై దృష్టి పెట్టిన సాధకుడు బ్రహ్మచర్య స్థితిలో ఉంటాడు. దీని విపర్యయము సత్యము కాదు. అనగా స్త్రీ సుఖమునకు దూరముగా నున్నంత మాత్రమున, అతడు భగవంతునిపై దృష్టి పెట్టలేడు.

"మనము వెలుగు వైపునకు తిరిగితే చీకటి లేదు" అన్నది గుప్తవిద్య తెలుపు సత్యము.

ఎవరైనను భగవంతునిపట్ల లోతుగా దృష్టి పెట్టితే, సాధకుని చైతన్యము విశ్వ చైతన్యము, తొలుత కలసి, తరువాత దానిలో (విశ్వ చైతన్యములో) ఐక్య మయిపోతుంది. అప్పుడు అంతులేని, హద్దులులేని, తీయనైన 'ఉండుట' అను స్థితి అనుభవములోనికి వస్తుంది. ఆ స్థితిలో శారీరిక వాంఛలు సాధకుని చైతన్యములోనికి కరిగిపోయి, సాధకుని చైతన్యము విశ్వ చైతన్యములోనికి కరిగి పోతుంది. అప్పుడు భౌతికమైన కోరికలు ఏవీ వుండవు. ఆ స్థితిలో నిరాహారముగా వుండుట సహజ మౌతుంది. దురదృష్టవశాత్తు ఈ నాడు ఉపవాసము అను ఆలోచనతో ఆహారము తీసుకొనకుండుట ఉపవాసమని భావిస్తారు. బ్రహ్మచర్యము కూడ అలాంటిదే.

ఉన్నతమైన సామాజిక కార్యక్రమములకై పనిచేయువారు కూడా క్రమముగా బ్రహ్మచారు లౌతారు. వారి శక్తి అంతయు చుట్టూ ఉన్న ప్రాణికోటి సేవకు భగవత్ ప్రీతిగా కేంద్రీకరిస్తారు.

మనము చాలామంది సన్యాసులను, యోగసాధకులను, ఉన్నతాశయములకై సేవచేయు వారిని ఉదాహరణగా చూస్తాము.

మొదటివారు జన్మతః బ్రహ్మచారులైతే, మిగిలినవారు యోగ సాధనకు చెందినవారు కానీ, ఉన్నతమైన ఆశయములకై పని చేయువారు ఉంటారు.

మిగిలినవారు గృహస్థ ఆశ్రమములో ఉండి ఆరోగ్యకరమైన సమాజమును జీవన అవసరములను నడుపుట అవసరమౌతుంది. సక్రమమైన వివాహబంధములో, స్త్రీ సంయోగమును పాపముగా చూడరాదు. ఆరోగ్యకరమైన వివాహబంధము జీవపరమైన పరితృప్తి నిచ్చి, మనిషి స్త్రీ సంయోగమునకు బానిస అగుటను దాటిస్తుంది. స్త్రీ పురుష సహచర్యము స్త్రీ పురుష సంయోగము లేనట్టి, సహజమైన సహచర్యమునకు దారితీస్తుంది. వివాహము, గృహస్థాశ్రమ మనునవి శక్తియొక్క సమతూకమును ఇచ్చు క్షేమమైన సాధనముగా గుర్తింపబడినది. దీనిని ఒక బంధన కారణముగా కాక బాధ్యతలు సక్రమముగా నిర్వర్తించుటకు, సరియైన మానవ సంబంధములను నెలకొల్పుటకు ఒక వేదికగా గుర్తించాలి.

సన్యాసి, సాధకుడు, సమాజ సేవకుడు, గృహస్థు అను నాలుగు విభాగముల లోనికి ఇమడని వ్యక్తి, పరస్పర విరుద్ధ భావములో నుండి, సంఘర్షణకు లోనై, బ్రహ్మచర్య సాధన పేరుతో రోగగ్రస్తుడౌతాడు. తనను తాను ముక్కలు చేసుకొని దానితో బాధ పడతాడు.

బ్రహ్మచర్య మనునది, ఏదో మూఢ నమ్మకముతో బలవంతముగా రుద్దబడుట కాక, వ్యక్తిగత స్వాతంత్ర్యముతో ఎంచుకొనునదిగా ఉండాలి.

నిజమైన ప్రతి మతము, పైన తెలిపిన నాలుగు స్థితులలో బ్రహ్మచర్యము యొక్క సౌందర్యమును తెలుపుతుంది. మూర్ఖులు గందరగోళముతో బ్రహ్మచర్యమును బలవంతముగా రుద్దుతారు.

వైవాహిక జీవితమును అనుసరించు చాలామంది గురువులు, సిద్ధులైన యోగులు జీవితము యొక్క పరిపూర్ణతను ప్రదర్శించారు. స్త్రీ సంయోగమును ఒక పాపముగా చూడ నక్కరలేదు. సమాజముచే ఆమోదింపబడిన ఆరోగ్యకరమైన నియంత్రణను అనుసరిస్తే, సాధారణ జీవన ప్రవాహమునకు, పురోభివృద్ధికి అది అడ్డుపడదు. కాబట్టి మాస్టర్ C.V.V. గృహస్థ జీవితమును స్వీకరించి, తన అనుయాయులను కూడా ఆచరించ మన్నారు.

"గృహస్థ జీవనములో ఇమడని జీవితము సమాజమునకు ఉపయోగ పడదు" అన్నారు మాస్టరుగారు. శిష్యత్వము అనునది అనుసరించ దలచు వారికి పరిపూర్ణమైన జీవితముగా ఉండాలి. ఒంటరి జీవిగా నివసించు శిష్యుడు, మనుష్యులను ఒంటరితనము లోనికే తీసుకొని వెడతాడు. తన భార్యకు విడాకులు ఇచ్చిన శిష్యుడు తనకు తెలియకుండానే తన శిష్యులకు అదే మార్గమును ఎంచుకొనుటకు ప్రోత్సాహిస్తాడు. కాబట్టి తనను ఇతరులు అనుసరించుటకై గృహస్థ ధర్మములో నుండుట ముఖ్యము.

కాబట్టి మాస్టరుగారు కుటుంబము, వృత్తి, సేవ సమ భాగములుగా ఉండాలని సూచించారు. "ప్రాథమికమైనది మానసికమైన నిధి" అని మాస్టరుగారు తెలిపారు. ప్రాథమిక సూత్రములకు కట్టుబడని ఏ పద్ధతిలోనైనా మనకున్న మానసిక

సంపద వ్యర్థమౌతుందని తెలిపారు. కుటుంబమునకు సంబంధించి నంత వరకు మనము గుర్తించుకొనవలసిన ప్రాథమిక సూత్రము, సృష్టిలో స్త్రీ యొక్క స్థానమును మనము అంగీకరించినప్పుడు జీవనములో చాలా సామరస్యము ఉంటుంది.

Woman అన్న పదములో Man చేరి ఉన్నది. She అన్న పదములో He, Madam అన్న పదములో Adam చేరి ఉన్నాయి. ప్రకృతి నియమముల పట్ల మనము విధేయులుగా ఉంటే యోగము సాధ్యమౌతుంది.

ఎవరైనా పురుషుడు స్త్రీని అవమానించుట, తీవ్రముగా బాధించుట చేస్తే, యోగమార్గములోనికి వచ్చుటకు అతడు కొన్ని జన్మలు వేచి ఉండవలసి వస్తుంది. ఒక మనిషి మూర్ఖత వలన స్త్రీ కన్నీరు కారిస్తే, అతడు జీవితములో చాలా ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది. ఓ పురుషుడా! జాగ్రత్త. నీ తల్లి, భార్య, కూతురు, చెల్లెలు, మిగిలిన అందరు స్త్రీల పట్ల చాలా జాగ్రత్తగా ఉండండి. మన చుట్టూ వున్న స్త్రీలు మన ప్రవర్తనతో సంతోషిస్తే కుండలినీ శక్తి పనిచేస్తుందని మాస్టరుగారు తెలిపారు.

మాస్టరుగారు తెలిపిన "All Round Development" సర్వతోముఖ అభివృద్ధికి ఇది చాలా ముఖ్యమైనది.

# 10. నేను

*"కేంద్రము ప్రతిచోట, పరిధి ఎక్కడా లేదు"*

ఒక తండ్రి కొడుకులు ఒక మేళాకు వెళ్ళారు. ఆ మేళాలోని గుంపులో, అరుపులలో కొడుకు తండ్రి చేయి నుండి విడివడి గుంపులో తప్పిపోతాడు.

అప్పుడు, కొడుకు తండ్రిని వెదుకుకోవాలా లేక తండ్రి కొడుకును వెదుకుకోవాలా అని మాస్టరుగారు అడుగుతారు. పిల్లవానికి తప్పిపోయే అలవాటు ఉంది. వాడికి తనపై తనకు పట్టు లేదు. కనుక వాడు తండ్రిని వెదకుకొని సులభముగా కనుగొనలేడు. కానీ తండ్రి సులభముగా ఆ పని చేయగలడు. అతనికి ఆ చోటు తెలుసు, అక్కడి భాష తెలుసు, అక్కడి భద్రతా వ్యవస్థ తన కొడుకుకు తెలిసిన దానికన్నా బాగా తెలుసు. కాబట్టి తండ్రి కుమారుని కనుగొనుట సమంజసము.

మాస్టరుగారు తన ఉద్దేశ్యమును అలా సులభముగా తెలియజేశారు. మనిషి భగవంతుని కనుగొనలేడని తెలుపుట వారి ఉద్దేశ్యము. భగవంతుడు అప్పుడప్పుడు మార్గ మేర్పరచుకొని మానవులను చేరతాడు. కాళ్ళు చేతులు కట్టబడిన వ్యక్తులు తమను తాము విడిపించుకొనవలె నన్నచో అది వృథా ప్రయత్న మౌతుంది.

అప్పుడు భూమిపై గురుపరంపర అవసర మెక్కడ? వారి ప్రకారము గురువు లనువారు ఇతరులను బంధమునుండి విడిపించువారు. కేవలము మార్గమును చూపించుటతోనే వారు తృప్తి చెందలేదు. చేతులు కట్టివేయబడిన వారికి తిను పద్ధతిని తెలుపుట అవివేకము. అప్పుడు తినిపించుటయే పద్ధతి. బంధము విడిపించుటయే పద్ధతి.

సమన్వయ శక్తిని రోజుకు రెండుసార్లు ప్రార్థన చేయుటయే బంధమును సడలించుటకు సులభమైన మార్గముగా దర్శింపబడినది. ఇది చాలా సులభము. మనము నిరాడంబరముగా నుండుట దీనికి అవసరము. ప్రార్థనలో ఆవాహనకు ఉదయము 6 గంటలు, సాయంత్రము 6 గంటలు అని ఇవ్వబడిన కాలనియమము మాస్టరుగారిచే సుందరముగా 'Axis Arranged Hours' అని తెలుపబడినది. గడియారము 6 గంటలు చూపించునప్పుడు మనము దానిని చూచి అర్థము చేసుకొనగలము. ఆ సమయములో మనమా శక్తిని ఆవాహన చేసినప్పుడు మనలోని హెచ్చుతగ్గులు కేంద్రమును కలియుటకు లంబకోణ మౌతాయి. ఆధ్యాత్మిక క్రమశిక్షణలో ప్రపంచములోని అన్ని నియమములకంటే చాలా సులువైనది. సాధకుడు ప్రయాణములో నున్నను, ఒక నిముషము కన్నులు మూసుకొని ఆవాహన చేసినచో తాను అక్షము (Axis) నకు అనుసంధానించుట చూసుకుంటానని మాస్టరుగారు తెలిపినారు. వారి ప్రకారము శక్తి అనుసంధానము ఏకబిగిన 15 నిముషములు ఉంటుందని, అది తరువాతి 12 గంటల వరకు సరిపోతుందని తెలిపినారు. శరీర పునర్నిర్మాణమును రాత్రులందు జరుపుతానని తెలిపినారు.

క్లుప్తముగా వారు తమ శిష్యులను వారెక్కడ ఉన్నారు, ఏ పరిస్థితిలో నున్నారు అన్న దానితో సంబంధము లేకుండా వారితో కలిసే ఉంటానని, అర్థము చేసుకొనమన్నారు. కుంభకోణములో పనిచేయుచున్న వారి శిష్యులలో ఒకనికి ఢిల్లీలో ఒక మంచి ఉద్యోగము వచ్చినది. ఆ వచ్చినది చాలా లాభసాటిగా నున్నను మాస్టరుగారిని ఎలా వదలి వెళ్ళాలనే సందిగ్ధ స్థితిలో పడ్డాడు. మాస్టరుగారిని కలసినప్పుడు అతడు ఆ విషయము ప్రస్తావిస్తే "ఢిల్లీ వారికి నీ నిర్ణయాన్ని ఎప్పుడు తెలియచేయాలి?" అని అడిగారు. దానికతడు "రెండు రోజులలో" అని బదులిచ్చాడు. మాస్టరుగారు తన నిర్ణయాన్ని తెలుపుతామని చెప్పారు. తరువాతి ఉదయము ప్రార్థన తరువాత, ఇతర శిష్యులతో సంభాషిస్తూ అతనిని పట్టించుకోలేదు. ఆ రోజు సాయంత్రము, మరుసటిరోజు ఉదయము అలానే జరిగింది. ఆ శిష్యుడు రోజంతా మాస్టరుగారితో ఉంటే వారికి తన సమస్య గుర్తు వస్తుందనుకొన్నాడు. మాస్టరుగారు వేరే కొంతమంది శిష్యులతో ఆ మధ్యాహ్నామే ఇంకొక పట్టణానికి వెళ్ళిపోయారు.

ఆ శిష్యుడు తన నిర్ణయాన్ని 5 గంటలలోగా తపాలా శాఖ చివరగా ఉత్తరములను తీసుకొను సమయము లోపల తెలపాలి. అతడు మధ్యాహ్నాము 3 గంటల వరకు వేచి ఉన్నాడు. అప్పటికీ మాస్టరుగారు రాకపోయేసరికి తానే నిర్ణయము తీసుకొని, టెలిగ్రాము పంపించాడు.

వెంటనే మాస్టరుగారు తిరిగి వచ్చి "నీవేమి నిర్ణయము తీసుకున్నావు?" అని ప్రశ్నించారు. దానికి అతడు "మీ నిర్ణయానికై

వేచి చూచాను. మీరేమీ తెలుపనందున నేనే నిర్ణయము తీసుకున్నాను" అని తెలిపాడు.

దానికి మాస్టరుగారు "ఇదే మీరు చేయాలనుకున్నాను. నాపై ఆధారపడు శిష్యులుకాక, నమ్మకమైన శిష్యులు కావాలి. ప్రతి ఉదయము, సాయంకాలము ప్రార్థనలలో నేను నీద్వారా వ్యాపించు చున్నానని తెలుసుకో. నీవు తీసుకొన్న నిర్ణయము అందరిలో నున్న నేను తీసుకొన్నదే!

కాబట్టి నీవు ఒక నిర్ణయము తీసుకొంటే అది నేను తీసుకొన్నదేనని అర్థము చేసుకోండి. ప్రతి ఒక్కరిలో నుండి నేనే పనిచేస్తున్నాను. నేను నీలోపల, బయట కూడా ఉన్నాను. ఈ కొత్త పద్ధతిలో నీపై నీవు ఆధారపడుట, నీవు ఎదిగి స్వయం సమృద్ధ మగుట ఉంటాయి. నీలో నా కేంద్ర మున్నది. నేను నీ కేంద్రమును. నీవు పరిధివి. కేంద్రములోనున్న నన్ను చూస్తే, నాలో నీవు కరిగిపోతావు. నేను వ్యాపిస్తాను. అప్పుడు పరిధి లేదు. కేంద్రమే ప్రతిచోటా ఉన్నది."

దీనితో అర్థము చేసుకొనవలసిన దేమిటంటే ప్రతి దాని కేంద్రముగా "నేను" ఉన్నది. ఈ "నేను" అనునది కాక ఇతరమేదైనా చూస్తే కేంద్రములేని ఇతరములు గమనిస్తాము. మన లోన కేంద్రము ఉంటే కేంద్రముకై బయట ఎక్కడ చూడకండి. బయటనున్న కేంద్రము లన్నింటిని మనలోని కేంద్రము ద్వారానే చేరగలము. దీనిని సాధనచేసి అందుకోగలిగితే ఈ భూమిపై నున్న ఏ కేంద్రమునైనను దర్శింపగలము. ఇటువంటి దృష్టిని అలవరచు

కోనిదే బయట ఆశ్రమములను, గురువులను సందర్శించుటకై తిరుగుట ఉపయోగము లేదు.

*ఇంకొక సంఘటన దీనిని చక్కగా వివరిస్తుంది :*

కుంభకోణమునకు 300 మైళ్ళ దూరములో ఒక కోపిష్ఠి బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు ఎంత కోపిష్ఠి వాడంటే తన కోపమునకు తనపై తాను కోపగించుకొనే వాడు. దానియొక్క శక్తికి ఎవ్వరూ తట్టుకొనలేనందు వలన అతనికి ఆ కోపముతో జీవించుట అసాధ్య మయ్యింది. దీనికి ఒక పరిష్కారమునకై అతడు చాలా ఎదురు చూచేవాడు. అలా ఉంటే ఒక స్నేహితుడు అతనికి మాస్టరుగారిని కలవ వలసినదిగా సలహా ఇచ్చాడు.

సనాతన బ్రాహ్మణ కుటుంబమునకు చెందిన అతడు మాస్టరుగారిని కలియుటకు చాలా నియమములు మొదలు పెట్టాడు. అతడు కుంభకోణము వెళ్ళుసరికి మాస్టరుగారు అక్కడలేరు. మాస్టరుగారు మద్రాసు వెళ్ళారని అక్కడివారు తెలిపారు. వారిని చూడాలన్న పట్టుదలతో మద్రాసు చిరునామా తెలుసుకొని వెంటనే అక్కడికి వెళ్ళాడు. కుంభకోణములో నున్నప్పుడు విచారించి తెలుసుకొన్న దేమిటంటే మాస్టరుగారు సనాతనము పట్టించుకోరని, సాధారణులని, సంప్రదాయ పద్ధతికి విరుద్ధమని తెలుసుకున్నాడు. అటువంటి మాస్టరుగారిని తాను కలియుట అవసరమా అని ఆలోచించాడు. మద్రాసులో అతడు నడుస్తూ వెడుతున్నప్పుడు ఒక పిచ్చివాడు తనలోతాను ఇలా మాట్లాడుకుంటున్నాడు, “మధ్యలో ప్రయాణమును ఆపుకొనుటకు

నీవేమైనా పిచ్చివాడివా? పిల్లవాడిలా ఉండొద్దు". అతడు ఆ సందేశమును అర్థము చేసుకొని వెంటనే మాస్టరుగారి ఇంటికి వెళ్ళాడు.

మాస్టరుగారి కుమార్తె అతనికి స్వాగతము పలికి తన తండ్రిగారి ఆజ్ఞానుసారము అతనిని పెరటిలోనికి మాస్టరుగారిని చూచుటకై తీసుకొని వెళ్ళింది. ఈ సనాతన బ్రాహ్మణుడు మాస్టరుగారిని కలియుటకు ముందు స్నానము చేయాలని పట్టుబట్టాడు. ఆవిడ దానికి కావలసిన ఏర్పాటు చేసింది.

తీరా అతడు పెరటిలోనికి వెళ్ళేసరికి మాస్టరుగారు క్షురకర్మ చేయించుకుంటూ కనిపించారు. విభ్రాంతితో నిలబడేసరికి మాస్టరుగారు అతనిని ఆహ్వానిస్తూ "హలో" అన్నారు.

ఆ బ్రాహ్మణుడు "మీరు పని పూర్తిగావించుకొని రండి, మీ ధ్యాన మందిరములో మీతో మాట్లాడతాను."

మాస్టరుగారు ''అక్కరలేదు. మీరిప్పుడే మాట్లాడవచ్చును."

బ్రాహ్మణుడు "మీరు క్షురకర్మ చేయించుకొను చున్నారు కనుక మీరు స్నానము చేయాలి. ఆ తరువాత మాత్రమే మిమ్ములను కలుస్తాను. అప్పటివరకు నేను వేచి ఉండగలను."

మాస్టరుగారు ''ఎందుకు? అవరసరము లేదు. మీరు ఇప్పుడే మాట్లాడ వచ్చును."

అలా సందిగ్ధములో పడిన బ్రాహ్మణుడు "నాకొక సమస్య ఉన్నది."

మాస్టరుగారు "ఫరవాలేదు. ఇక్కడే అన్ని సమస్యలు పరిష్కరింపబడతాయి. మీరు ఏదైనా ఉపదేశము తీసుకొనుటకు వచ్చినారా?"

బ్రాహ్మణుడు ఆత్రుతగా "అవును."

మాస్టరుగారు ''నేను ఇప్పుడు ఇచ్చు మంత్రము తీసుకోండి."

బ్రాహ్మణుడు తట్టుకోలేనంత దిగ్భ్రాంతికి గురియైనాడని వేరుగా చెప్పనవసరము లేదు. మంత్రమును ఇచ్చుటకు ఏమి పద్ధతి? ఎటువంటి పరిస్థితిలో తీసుకొనవలసి వస్తున్నది? ఇది భరించుటకు భయంకరముగా నున్నను మాస్టరుగారు అతనిని వదలలేదు.

"మీరు సిద్ధమేనా?" అని మాస్టరుగారు అడిగారు.

అప్పుడు ఆ బ్రాహ్మణునికి దారిలో కనిపించిన పిచ్చివాడు గుర్తుకు వచ్చాడు. తనను తాను కూడతీసుకొని "నేను సిద్ధమే" అని బదులిచ్చాడు.

మాస్టరుగారు అతనికి తన నామమును మంత్రముగా ఇచ్చి "ప్రతి ఉదయము, సాయంత్రము ఈ పేరును ఉచ్చరించండి" అని చెప్పారు. ఆ బ్రాహ్మణుడు తీవ్రమైన నిరాశకు గురి అయ్యాడు. అతడు శివ మంత్రమో, విష్ణు మంత్రమో, బ్రహ్మ మంత్రమో యిస్తారని ఎంతో భావిస్తే ఇక్కడ ఒక మాస్టరుగారు తన పేరునే, అదీ ఆంగ్ల అక్షరములను ఇచ్చి రోజుకు రెండుసార్లు దాన్ని పునరావృతముగా చెప్పుకోవాలన్నాడు. ఆ బ్రాహ్మణుడు నీరసముగా "థాంక్ యు" అని చెప్పి బయటకు వెళ్ళిపోబోయాడు.

అప్పుడు మాస్టరుగారు "మా అమ్మాయి ఒక కప్పు కాఫీ ఇస్తుంది. అది తీసుకొని ఇంటికి వెళ్ళండి. మీకు నాపై ఇంకా చాలా కోపము వస్తుందని గుర్తుంచుకోండి. నేను మరల మరల మిమ్మ కలుస్తూ ఉంటాను" అన్నారు.

మాస్టరుగారు అంతకంటే గట్టిగా భవిష్యత్తును తెలుపుట వీలవదేమో. ఆ బ్రాహ్మణుడు ఇంటికి తిరిగి వెళ్ళునప్పుడు అతని కోపం తీవ్రముగా బయటపడింది. "ఎంత ధైర్యము! తన పేరును మంత్రముగా ఇస్తాడా!! ఒక ఆంగ్ల మంత్రము!!! అదీ మంగలి క్షురకర్మ చేసేటప్పుడు! నన్ను ఒక బుద్ధిలేని వాణ్ణి చేశాడు" అని గొణుగుకుంటూ ఇల్లు చేరాడు. ఇంత జరిగినా అతడు మాస్టరుగారిని మరిచిపోలేక పోయాడు. ప్రతి రోజూ మాస్టరుగారిని గురించి గుర్తు వచ్చినప్పుడల్లా అతని కోపము పొంగిపొరలి తీవ్రమైన ఆవేశముగా పేలిపోయేది. ఆ తరువాత అతను చేసుకొను దైనందిన కార్యక్రమము చేసుకొనేవాడు. అలా 40 రోజులు గడిచాయి. అతను ఒక రోజు ధ్యానము చేసుకొనేటప్పుడు మాస్టరుగారు ఇచ్చిన మంత్రములో కొంత అర్థమున్నదని, మునుపటి అంత కోపము వచ్చుట లేదని అనిపించింది. వెంటనే అతని చెవిలో ఒక గొంతు వినిపించింది. "నీ కోపము పూర్తి అయిన (తగ్గిన) తరువాత నిన్ను మళ్ళీ కలుస్తాను." అది పూర్తి అగుటకు ఇంకొక మూడు నెలలు పట్టింది.

మాస్టరుగారు తనపై కరుణను వెదజల్లారని అతడు గ్రహించాడు. ఉదయము, సాయంత్రము ప్రార్థనలలో అతని కోపము పెల్లుబికేది. మాస్టరుగారు దానిని గ్రహించేసేవారు.

ఇప్పుడు అతని గృహ జీవనము, సామాజిక జీవనము, వృత్తి జీవనము సాధారణ స్థితిలోనికి రాగా ఆ సమయములలో అతనికి కోపము వచ్చేది కాదు. ఆ తరువాత ఒక సమయము వచ్చేసరికి అతనికి కోపము మాస్టరుగారిపై కూడ ఉండేదికాదు. ఆ భావముతో ఒక రోజు ఉదయము అతడు ప్రార్థనలో కూర్చొని మాస్టరుగారి నామాన్ని ఉచ్చరించాడు. అక్కడ మాస్టరుగారు బంగారుకాంతితో అతనికి అగుపించారు. “నేను మరల కలుస్తాను” అన్న మాస్టరుగారి మాటలు గంటకొట్టినంత స్పష్టముగా వినిపించాయి. ఆ బ్రాహ్మణుడు చాలా ప్రభావితుడైనాడు. వెంటనే అతడు కుంభకోణము వెళ్ళాడు. మాస్టరుగారు అక్కడ లేరు. వారు నాగపూర్ వెళ్ళినారు. ఆ బ్రాహ్మణుడు నాగపూర్ వెళ్ళాడు. మాస్టరుగారి కుమార్తె వారు ఆ ఉదయమే మద్రాసుకు వెళ్ళారని తెలిపారు. అతడు మద్రాసు వెడితే మాస్టరుగారి ఇంకొక కుమార్తె ఆయన అప్పుడే రైల్వే స్టేషనుకు వెళ్ళారని తెలిపారు. అతడు పరుగెడుతూ వెళ్ళి రైల్వే స్టేషనుకు వెళ్ళే బస్సు ఎక్కితే అది మధ్యలో పాడైపోయి ఆయన వెళ్ళేసరికి రైలు వెళ్ళిపోయింది. అతడు విసుగుచెంది తన ఊరికి తిరిగి వెళ్ళాడు. అతడు రైలు దిగేసరికి మాస్టరుగారు ప్లాట్ ఫారం మీద ఒక బెంచీపై కూర్చొని నవ్వుతూ ఆ బ్రాహ్మణుని చూశారు. ఆ బ్రాహ్మణుడు వారి వద్దకు పరుగెత్తు కొంటూ వెళ్ళి “నేను మీ కోసము వెదుకుచున్నాను” అన్నాడు.

మాస్టరుగారు మందహాసముతో “నా కొరకు నీవెందుకు వెదకాలి?” అని అడిగారు. “మీరు నా కోపము తగ్గిన తరువాత నన్ను కలుస్తామన్నారు గనుక” అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

మాస్టరుగారు ''తప్పకుండా. నీ కోపము తగ్గిన తరువాత నిన్ను కలిశానుగదా! బంగారు కాంతితో నీకు కనిపించాను. అదే నిన్ను కలియుట. భౌతికముగా తిరుగుటకు నీ వెందుకు తొందర పడతావు? నేను నీకిచ్చిన శక్తి నీవు సూక్ష్మ శరీరముతో సులభముగా తిరుగుటకు వీలవుతుంది. మనము కలుస్తూనే ఉన్నాము. నీయొక్క పురోభివృద్ధి చూస్తూనే ఉన్నాను. నీవు అలా పిచ్చిగా తిరుగుతున్నావు కాబట్టి, నిన్ను తృప్తి పరచుటకు నేను భౌతికముగా కూడా కనిపించ దలిచాను. సరే! మరి నీ కోపము ఎట్లున్నది?''

ఆ బ్రాహ్మణుడు మాస్టరుగారికి పాదాభివందనము చేసి ''నన్ను నా కోపము నుండి రక్షించారు. దయచేసి తరువాత నేనేమి చేయాలో తెలుపండి?''

మాస్టరుగారు మెరుస్తున్న నయనములతో ''నా పేరు నచ్చితే దానిని కొనసాగించండి'' అన్నారు.

★ ★ ★


## 'ఒకే ఉనికి - ఒకే అనుభవము'

జీవితములోని అన్ని సంఘటనలలో ఒకే ఉనికిని చూడ గలిగినవాడే అన్ని కక్ష్యల అనుభూతి ఒకేసారి పొందగలిగిన వాడు. దానియొక్క ఉద్దేశ్యము జీవితమంతయు అన్ని పనులలోనూ ఒంటరిగా (అన్నింటిలోనూ) ఉండుట.

మనము నిద్రించునప్పుడు మనము ఉండుట అను స్థితిలో ఉంటాము.

మనము మేల్కొనగానే "తెలియుట" అన్న స్థితి వస్తుంది. మనము మేల్కొనగానే మన ప్రజ్ఞ నాపేరు జాన్ అని, నేను ఉపాధ్యాయుడ నని వెంటనే తెలుస్తుంది. జాన్ ''నేను'' అన్నది మరచి "నేను జాన్ అని పిలువబడతాను'' అని తెలియుటకు బదులుగా "నేను జాన్" అనుకుంటాడు.

ఉండుట అను స్థితి నుండి తెలియుట అను స్థితిలోనికి వచ్చుసరికి ఇలా ఉంటుంది.




ఇది మొదటి విలోమము

తెలియుట అను దాని తరువాత చేయుట అను స్థితిలోనికి వచ్చుట. మనము మెలకువ కలిగి లేవగానే, దంతధావనము చేయుట, స్నానము చేయుట, ఉపాహారము స్వీకరించుట ఇలా చాలా పనులు చేయాలనుకుంటాము. ఇదియే క్రియ.


తెలియుట అను స్థితినుండి క్రియ అను స్థితిలోనికి వచ్చుట

రెండవ విలోమము



చైతన్యము ఆధారముగా క్రియ అనునది తప్పనిసరి ఔతుంది. క్రియ ముందుకు వెడలు కొలది దాని ఉద్దేశ్యము వ్యక్తిగతమా, ఇతరులకై ఉద్దేశించినదా అని గమనించవలసి ఉంటుంది. వ్యక్తిగతము కానప్పుడు అది సమకోణ త్రిభుజ మౌతుంది. వ్యక్తిగత మైనప్పుడు అది వక్రత చెందిన త్రిభుజ మౌతుంది.

ఇది మూడవ విలోమము




ఉద్దేశ్యము వ్యక్తిగతము కానప్పుడు, చైతన్యము ఇంద్రియములలోనికి సరియైన ఆలోచన ద్వారా దిగివచ్చి, ఐదు కోణముల నక్షత్రమువలె, దాని శీర్షము పైకి ఉంటుంది. అప్పుడు మనిషి ప్రదర్శన జ్ఞానముతోకూడిన పంచారమువలె వుంటుంది.



వ్యక్తిగత ఉద్దేశ్యముతో చేయు పనులు మనము ఎక్కువ గానో తక్కువగానో చేస్తాము. పక్షపాతబుద్ధి, ప్రత్యేకత అనువానితో కూడిన పనులు వ్యక్తిగత ఉద్దేశ్యముతో జరుగుతాయి.

ఇది నాలుగవ విలోమము



అప్పుడు వక్రీకరణ చెందిన త్రిభుజము తిరుగవేసిన నక్షత్ర మౌతుంది. దీని అర్థము ఉండుట నుండి చైతన్యము, దానినుండి (ఆలోచన) క్రియ, అక్కడి నుండి ఇంద్రియముల ద్వారా జారిపోయి భౌతిక ప్రపంచములోనికి తప్పిపోతాము. ఈ పంచభుజిని మకరము లేక మనను గట్టిగా పట్టుకొను మొసలి అంటాము.

మనము చైతన్యములో సరిగా నుండి జీవితమును అనుభూతి చెందుటకు ఎప్పుడూ అది "నేను" అను ప్రజ్ఞగా గుర్తుంచుకొన వలయును. నేను అదియే. ప్రతి వస్తువును "నేను" అను ప్రజ్ఞ, రూపముగా, ప్రకంపనల ద్వారా మార్పు చెందుటగా అర్థము చేసుకోవాలి. ఎల్లప్పుడూ ఈ విషయమును పట్టుకొని గుర్తించుకొనుట వలన, మనము క్రియ లోనికి దిగినప్పుడు కూడ, మన ప్రకంపనలో తేడా రాదు.

మనము వ్యక్తిత్వము నిస్వార్థముగా లేకపోతే, మనము ఏదో ఒక పక్షమును తీసుకొని దానితో ఇంకొంత విలోమ స్థితులు ఉంటాయి. మనము నిస్వార్థముగా ఉన్నప్పుడు మనము కేంద్రములో నుండి అన్ని అభిప్రాయములను సమదృష్టితో

చూస్తాము. ఇది బుధ గ్రహము యొక్క లక్షణము. అది కేంద్రములో నిలబడి విపరీత భావములను సమస్థితికి తెస్తుంది. అందువలననే పాదరసమను లోహము రసాయన క్రియకు ఉత్తమమైనది. అది దేనికి అంటుకోదు. అది నిస్వార్థమైనది. నిస్వార్థమైన స్థితి "కుమార" అని పిలువబడుతుంది. వ్యక్తిగతమైన స్థితి మకరము అని పిలువబడుతుంది. తమ భావాన్ని బట్టి ఒకడు కుమారుడు లేక మకరమో కావచ్చును.

భగవద్గీతలోని మొదటి ఆరు అధ్యాయములు, విలోమముగా నున్న నక్షత్ర స్థితి నుండి విడివడి త్రిభుజమగుటకు కావలసిన ఉపదేశాన్ని యిస్తాయి.

మనము తెలియుట అన్న స్థితిలో నున్నప్పుడు ఒక ఆలోచన రాకుండుట అన్నది దుస్సాధ్య మౌతుంది. మనము తెలియుట అన్న స్థితిలో నున్నప్పుడు ఆలోచన ఉంటుంది. ధ్యానమును అభ్యాసము చేయుట ద్వారా, తెలియుట అను జ్ఞానము స్వల్పముగా దృగ్గోచర మౌతుంది. "అంతయు నేనే" అన్నది ధ్యానమునకు బీజ ప్రాయమైన ఆలోచన. అదే ఆలోచన వివిధ విధములుగా, వివిధ ప్రదేశములలో, వివిధ సమయములలో తెలుపబడినది. దీనినే

మోసెస్ "అదే నేను" (I AM THAT I AM) అని తెలిపారు.

క్రీస్తు "నేనే మార్గాన్ని" (I AM THE WAY) అని ప్రకటించారు.

సృష్టి మొత్తము ప్రజ్ఞ, ప్రకృతియొక్క క్రీడ అని మనము అర్థము చేసుకొన్నప్పుడు మనలో కలుగు ఆలోచనలన్నీ సత్వ, రజస్సు, తమోగుణములను మూడు గుణముల కలయికను బట్టి మన ఆలోచనలు ఉంటాయని తెలుసుకుంటాము. మన గమనింపు వ్యక్తిగతము కానప్పుడు, మనము మెల్లగా మూడు గుణముల కలయిక బయట ఉంటాము. మన సహజ స్థితి మనకు గుర్తుండి, మన వద్దకు వచ్చు సూచనలు అన్నింటినీ నిస్వార్థముగా గమనించి, పనిచేయుట నేర్చుకుంటాము. ఆలోచనలు– పనిచేయుటకు సూచనలు వస్తూనే వుంటాయి. "నేను నిద్రించినపుడు మొత్తము ప్రపంచము లయమై ఉంటుంది. నేను మేల్కొన్నప్పుడు నా ప్రకృతి నానుండి బయటకు వచ్చి పనిచేస్తుంది. సృష్టిలో నా ప్రకృతిని నేను అనుసరిస్తాను. నా గుర్తింపును సృష్టిలో నేను పోగొట్టుకోను" అని భగవంతుడు చెప్పాడు. కానీ మన గుర్తింపు మన సృష్టిలో మన స్వభావము ద్వారా కోల్పోతాము. తేడా అదియే.

కాబట్టి మనము ప్రతి క్షణము "నేను"ను గుర్తుంచుకోవాలి. అటువంటప్పుడు ప్రతిపాదనలు వస్తుంటాయి. మనము నిస్వార్థముగా నున్నప్పుడు ఆ ఎరుకను గుర్తించుకో గలుగుతాము. లేనప్పుడు ఆ వచ్చు ప్రతిపాదనలు మనను పట్టుకొని పోతాయి. మన ప్రతిపాదనలకు మనము బానిసలమై మనను మనము కోల్పోతాము. నిష్పాక్షికమైన గుర్తింపు, అప్పుడు మనము ఆ పనిలోనికి దిగాలా, వద్దా అని నిర్ణయించుటకు తోడ్పడుతుంది. ప్రతిపాదన వ్యక్తిగతమైనప్పుడు, దాని క్రియా రూపమైన ఫలితం తప్పకుండా ఉంటుంది. అందుకనే వ్యక్తిగతమైన ప్రతిపాదన

లున్నవాడు యోగి కాజాలడు. వ్యక్తిగత ప్రతిపాదనలు ఇష్టా అయిష్టములకు, సంతోషము నిరాశలవంటి ద్వంద్వములకు దారి తీస్తాయి. మనము ఆలోచనను గమనించి నట్లయితే, దాని బయట ఉండుట, దానిని పట్టి ఉంచుట సాధ్యమౌతుంది. లేనప్పుడు దానిలోనికి దిగి దానిచే బంధింపబడతాము.

"వ్యక్తిగతము లేక ఉండండి" అనునది మాస్టరుగారు ఇచ్చిన ప్రథమ మూల సూత్రము.

ఉండుట అనునది తండ్రి (Existence). తెలియుట అనునది కుమారుడు (Awareness). ఈ తండ్రీ కొడుకుల సంబంధము సృష్టిలో ఉంటుంది. నిద్రలో నున్నను, మెలకువతో నున్నను ఉండుట అనునది అందరికీ ఉంటుంది. మనము మేల్కాంచిన తరువాత, మన గుణ సమ్మేళనమును బట్టి మన ఆలోచనలు భిన్నముగా ఉంటాయి. మనము గుర్తుంచుకొనవలసిన విషయ మేమిటంటే 'ఉండుట' అనునది తెలియుటను సృష్టిస్తుంది. తెలియుట మన ఆలోచనా యంత్రమును ప్రారంభిస్తుంది.

"లోన గమనించండి" అని మాస్టరుగారు చెప్పారు. గమనించుట వలన మనలో పుట్టు ఆలోచనను దాని మూలము నందే మార్పులు చేసుకొనుట సాధ్యమౌతుంది. మన ఆలోచనా ధోరణులను, ఒక దినచర్య పుస్తకములో వ్రాసుకొని, మూడు నెలలకొకసారి వానిని సమీక్షించుకోమని వారు సలహా ఇచ్చారు. అలా చేస్తే, మెల్లగా మన ఆలోచనా ధోరణులు బలహీనపడి, వాని వేగాన్ని కోల్పోయి, మన ప్రతిపాదనలు తగ్గిపోతాయి.

ఈ విధముగా మనము ఆలోచనలు లేని స్థితికి వచ్చి, కేవలము ఉండుట, తెలియుట అనే ఒకే ఆలోచనతో ఉంటాము.

మాస్టరుగారు "Nil None Naught Levels" అని తెలిపారు.

* వేరేవారు లేక నీవే ఉండుటలో, ఉండుటగా ఉన్నావు– *నిల్.*
* వేరని ఎవ్వరూ లేరు. ''ఒక్కడు'' తప్ప – *నన్.*
* 'నేను' అనునది ఒక్కటితప్ప, వేరు ఆలోచన లేదు – *నాట్.*

మనము ఆలోచనలోనికి దిగినప్పుడు సులభముగా చాలా విలోమ స్థితులలోనికి వెళ్ళిపోతామని మాస్టరుగారు చూచారు. కాబట్టి మనము జారిపోవు ప్రతి అడుగును వెనుకకు మళ్ళి చూచు కొమ్మన్నారు. విచక్షణ లేకుండా ఆలోచన లోనికి జారిపోవద్దని హెచ్చరించారు.

"ప్రతి ఒక్కరిని ఆత్మగా చూడండి." మాస్టరుగారు ఇచ్చిన మరియొక సూటియైన ముందడుగు. మనము వ్యక్తులుగా, బాహ్య ప్రపంచములో బంధుత్వములతో గుర్తుంచుకొన్నప్పుడు మన పనులు పక్షపాత వైఖరితో ఉంటాయని వారికి తెలుసు. అందుకనే వారు మనలను ఆత్మలుగా చూడమని సలహా ఇచ్చారు. ఈ భూమిపై మనకు కనిపించు గర్వము, పక్షపాతము, వేర్పాటు భావములు అన్నీ ఎదుటివారిని ఆత్మలుగా చూడలేక పోవుట

వలననే. ఆత్మగా చూచుటయే మనము 'ఉండుట' యందు నేరుగా ఉండుట. ఆత్మతో సంబంధము వలన మనకు ఎదుటి వ్యక్తుల యొక్క రూపముతో, వారి ప్రవర్తనతో బాధ లుండవు.

తన మునుపటి సలహాను విశదీకరిస్తూ "అందరూ శిష్యులే" అని మాస్టరుగారు తెలిపారు. కొంతమందిని గురువులని, కొంతమందిని శిష్యులని సంభాషణలో సౌకర్యము కొరకు పిలుస్తున్నాము. మాస్టర్ C.V.V. గారు అందరమూ శిష్యులమే నని, ఒకే గురువు ఉన్నారని తెలిపారు. అదే పద్ధతిలో పురాణము లన్నియు "కృష్ణుడు ఒక్కడే పురుషుడని, అందరూ స్త్రీలని" తెలుపుచున్నవి. స్పిరిట్ – కేంద్రము దాని వాహిక ఆత్మయని తెలియాలి. ఇచ్చువాడు పురుషుడు, గ్రహించువాడు స్త్రీ. ఆత్మలుగా మనము స్పిరిట్‌ను, అనగా తండ్రిని గ్రహిస్తాము– కావున మనము అందరమూ స్త్రీ లమే. ఇదే సూత్రాన్ని పశ్చిమ దేశములవారు స్పిరిట్‌ను తండ్రిగా ఆత్మలను పిల్లలు లేక సోదరులని తెలుపుతారు. ఈ అవగాహన క్రమంగా మనకు సాధనలో వస్తుంది.

"యోగమును నేరుగా తెలుపు పద్ధతి" మాస్టర్ C.V.V. గారు ఈ విధముగా ఇచ్చారు.

"లోన గమనించండి, మీ ఆలోచనా సరళిని గమనించండి, దానిని గుర్తుంచుకోండి, వానిలో ఎన్ని వ్యక్తిగతమో, ఎన్ని వ్యక్తి గతము కావో గమనించండి."

నిజముగా సూటియైన పద్ధతి గమనిస్తే మనము మాటి మాటికి వచ్చు ఆలోచనలలో బంధింపబడ్డామని, ప్రతి నిత్యము

వచ్చు వ్యక్తిగత ఆలోచనలలో బంధింపబడ్డామని తెలుస్తుంది. ఆ అయోమయమైన ఆలోచనారణ్యములో, కనీసము ఒక వ్యక్తిగతము కాని ఆలోచన మనకు ఉంటే ఆశీర్వచనము లభించినట్లే. నిదానముగా మన జీవితములో వ్యక్తిగత కార్యక్రమములు లేక వ్యక్తిత్వము తోక ఆడించుట మాని, ఆత్మతో కలిసిపోతుంది.

"కర్మను దుర్బలము గావించ వచ్చును" అన్నది మాస్టరుగారి నుండి వచ్చిన మరియొక మెఱపు. మన సహజ స్థితికి తిరిగి వచ్చు మార్గము. మాస్టరుగారు వేయి జన్మలు భౌతిక వాదిగా జీవించిన వాడు ఆధ్యాత్మిక పరుడగుటకు వేయి జన్మలు అక్కరలేదు. వానిని కట్టివేయు త్రాడు వందజన్మలు ఉండవచ్చును. మనము బయటపడుటకు వందసార్లు వెనుకకు త్రిప్పుకొనవలసిన పనిలేదు. మన సహజ స్థితికి వచ్చుటకు ఎక్కువ సమయము అక్కరలేదు. మనము ఆత్మ అని గుర్తుంచుకొనుట వలన మనము కల్పించుకొన్న భ్రాంతి నుండి మనము బయటపడ వచ్చును.

"మీరు ఎక్కడ నున్నను, మనము కేంద్రము నుండి ఎంత దూరములో నున్నను ఫరవాలేదు. అక్కడనుండి మనము వ్యక్తిగతము కాకుండా ఉండుట మొదలిడితే, అది మనను కేంద్రమునకు తీసుకొని వస్తుంది." తాను అందుకొన్న శక్తి తనకు మార్గదర్శకమై, చిక్కులతోకూడిన తిరోధాన పద్ధతిలోకాక, నేరుగా అనుభవ మార్గములో వెళ్ళు పద్ధతిని వివరించారు. శబ్దము అను తాళపుచెవి ద్వారా వెనుకకు రాగలుగుట సంక్షిప్తీకరించారు– అదియే కుంభయుగ పద్ధతి. మాస్టరుగారి యోగ పద్ధతి.

# 11. మాస్టరుగారి వాగ్దానములు

*''బహిరంగము, అంతరంగము కాదు, కేవలము ఉండుటయే''*

అపారమైన కరుణతో వారినుండి వెలువడిన ప్రకటనలే వారి వాగ్దానములు.

**1. నేను మీకు అపారమైన ప్రాణాన్ని అందిస్తాను :**

విశ్వకేంద్రము నుండి మానవుని హృదయము వరకు ప్రసరించు ప్రాణ ప్రవాహము యొక్క మార్గమును మాస్టర్ C.V.V. గారు గుర్తించారు. అది ఎలా పనిచేస్తుందో తెలుసుకొని, ఎట్టి స్థితులలో అది ఒక రూపములో, శరీరములో పనిచేయుట ఆగిపోతుందో తెలుసుకొన్నారు. కొన్ని ప్రయోగముల ద్వారా కావలసినప్పుడు అదనపు ప్రాణ ప్రవాహమును అందించ గలుగు పద్ధతిని కనుగొన్నారు. అంతరిక్ష, సౌర, గ్రహముల నుండి మనిషి వరకు ఒక మార్గాన్ని స్థాపించారు. ఆ మార్గమును కుండలిని ద్వారా స్థాపించారు. ఒక శాస్త్రవేత్త తన శిష్యులతో ప్రయోగము చేసినట్లు, దానిని అదనపు ప్రాణమును ఆవాహన చేయుటకు ఉపయోగించారు.

ఆ ఫలితము సఫలీకృతము అయ్యేటప్పుడు వారి ఒక బిడ్డ చనిపోయాడు. అప్పుడు ప్రక్కనే ఉన్న సుందరం అను శిష్యునితో

"నిన్ను పై కక్ష్యలలోనికి పంపుతాను. ఇక్కడ చనిపోయిన శరీరాన్ని భద్రపరుస్తాను. మీరు వెళ్ళి పై కక్ష్యలలో నుండి అదనపు ప్రాణ ప్రవాహము అడగండి."

సుందరం "సరే" అని కళ్ళు మూసుకున్నాడు. అతనొక పరవశమైన స్థితిలోనికి వెళ్ళాడు. అతడొక సుడులు తిరుగు మార్గములో ఏడు కక్ష్యల పైకి వెళ్ళాడు. అతనికి ఒక కొలతలకందని, నామ రూపములు లేని ఒక దయాళువును కలిశాడు. అదనపు ప్రాణ ప్రవాహమును అర్థించుటకై మాస్టరుగారిచే పంపబడినానని తెలుపగా "అది ఇవ్వబడింది. నీవు తిరిగి వెళ్ళవచ్చును" అను ప్రత్యుత్తరమును గ్రహించాడు.

సుందరం కళ్ళు తెరచి చూడగా, ఆ బిడ్డ తిరిగి జీవించాడు.

తరువాత మరలా ఆ బిడ్డ కూలిపోగా, మానవుని సూక్ష్మ శరీరము సరిగా స్థాపించనిదే, ప్రాణసూత్రము దానికదే అందులో ఉండుట కష్టసాధ్యమని మాస్టరుగారు గుర్తించారు. సూక్ష్మ శరీరమును మెరుగుపరచుట కాక, దానికి అమృతత్వము నిచ్చుట ద్వారా అది సాధ్యమౌతుందని వారు గుర్తించారు. ఈథర్ చిరంజీవి యైనను మానవుని సూక్ష్మ శరీరరము మరణ సమయములో, విచ్ఛిన్నమై ఆకాశముతో కలసిపోతుంది. ఆకాశము పర స్థితి, సత్య స్థితి, చోటులోని ఏడవ కక్ష్య, మూల ప్రకృతి, ఆది పదార్థము, ప్రజ్ఞవలె శాశ్వతమైనది.

ప్రకృతి – పురుషుల కలయిక వలన విలోమక్రియ జరిగి,

ఫలితముగా మనము చూచు పదార్థము వచ్చుచున్నది. ప్రతి రూపమునకు మూలముగా సూక్ష్మ మున్నది. ఈథర్ విచ్ఛిన్న మైనప్పుడు– అది మొత్తము ఈథర్‌లో కలసిపోయినప్పుడు – రూపము విచ్ఛిన్న మౌతుంది.

ఈథర్‌ను రూపములో ఉన్నది ఉన్నట్టుగా ఉంచగలిగితే, మనిషి పునర్జన్మ తీసుకొన్నప్పుడు అదే రూపములో కనిపించ వచ్చు. ఈ విధముగా గురువులు ఒక చోట అదృశ్యమై ఇంకొక చోట తిరిగి కనిపించ గలుగుతారు. వారు స్థూల శరీరము వదలి సూక్ష్మ శరీరముతో చరిస్తారు. వారు కనిపించవలయు నన్నప్పుడు, భౌతిక పదార్థమును గ్రహించి ప్రత్యక్ష మౌతారు.

అపరిమితమైన ప్రాణ ప్రవాహ మందించుట ద్వారా, మాస్టరుగారు ఈ పద్ధతిని సూచించారు.

## 2. నీకెప్పుడూ బీదతనము లేకుండా చూస్తాను :

బీదతన మన్నది పూర్తిగా మానసికమైనది. బికారులైన చాలామంది ధనవంతులున్నారు. వారికి ఆకలిదప్పులు ఎక్కువ. సంపద అనునది కరెన్సీ నోట్లతో కొలువ లేము. తన కోసమై తాను యాచించని వాడు నిజమైన ధనవంతుడు. తనకు ఏమీ అక్కరలేనివాడు ఒక చక్రవర్తి. ఇతరుల అవసరములు చూచు వాడు మానసికముగా ఈ స్థితిని పొందుతాడు. చేయుపను లన్నిటి యందు, పనులు చేయుట పట్ల ఉన్ముఖత్వము కలిగి, రెండవ భాగమైన ప్రతిఫలమును ఆశింపనిచో, మనము మానసిక కక్ష్యలో సంపన్నుల కక్ష్యలోనికి నడచి, తృప్తిని పొందగలుగుతాము.

తృప్తి గలిగిన వాడే ముల్లోకములను జయించినవాడు. జీవితము అతనికి పవిత్రముగా ఉంటుంది. అటువంటి తృప్తి లేకపోవుటయే బీదతనము. మాస్టరుగారి యోగము తృప్తి అను సంపదను వాగ్దానము చేస్తుంది.

## 3. నీ కర్మను పరిష్కరిస్తాను :

సనాతనవాదుల అభ్యంతరాలు పట్టించుకొనకుండా, ఉండ మని చెప్పుటయే వారి ఉద్దేశ్యము.

ప్రతి మానవునిలోనూ లోతుగా వేళ్ళూనుకొన్న కొన్ని ధోరణులు ఉంటాయి. బాహ్యములోని సంఘటనలు, మన అనుమతి లేకుండా ఆ ధోరణులను కదలించి మనను బయటకు లాగుతాయి. "అపరిగ్రహము" అనగా మనది కానప్పుడు స్వీకరింపకుండుట అను వైఖరి, ఈ ధోరణుల స్థానమును గ్రహింపవలెను. మాస్టరుగారి సూటియైన మార్గము ఈ ధోరణులను నశింపజేయును. అప్పుడు మనము కదలింపబడము. బయటకు లాగబడము. అప్పుడు కర్మ బంధించదు.

అప్పు చేసినవాడు దానిని తీర్చవలయు ననుట సత్యము. అప్పుడు అతనికి ధనవంతుడైన వ్యక్తి సులభముగా తీర్చగలుగు సహాయము చేస్తే, అప్పు తీర్చుట సులభమౌతుంది. మాస్టరుగారి యోగము సాధకునిలో మానసిక సర్దుబాట్లు చేసి, ఉపయోగకరమైన ధోరణులు పెంపొందింపచేసి, చిక్కు పరచుకొను ధోరణిని బలహీన పరుస్తుంది. కర్మయొక్క విత్తనములు మొలకెత్తవు. అంతే గాక ఆ సంఘటన భౌతికముగానే జరుగవలసిన పనిలేదు.

చాలాసార్లు కర్మానుభవము మానసిక కక్ష్యలోనే ఉంటుంది. ఉదాహరణకు ఒక్కొక్కసారి స్వప్నములోనే, తన కుటుంబములోని వ్యక్తి చనిపోవుట, వ్యాపారములో నష్టములు, విడిపోవుట వంటివి అనుభవమౌతాయి. కర్మ పరిష్కరింపబడి, అవసరమైన సర్దుబాట్లు మానసికకక్ష్యలోనే జరుగుతాయి. దానివలన ఆ సంఘటనలు భౌతిక కక్ష్యలో జరుగవలసిన అవసరముండదు. కాబట్టి మాస్టరుగారు, వారు ఇచ్చిన యోగమును "భృక్త రహిత రాజయోగము" అని పిలిచారు. పూర్వకర్మను పరిష్కరించు రాజయోగము– యోగా ఆఫ్ సింథసిస్. సాధకుల ఒక జన్మ అనుభవములో– వారు పూర్వ జన్మ బంధములను పరిష్కరించుకొని, బలముగా ముందుకు సాగుతారు. పూర్వ బంధములు తొలగింపబడి ముందుకు సాగి ఇతరులకు సహాయకులగు స్థితిని చేరతారు. సహాయమును గ్రహించు స్థితి నుండి, సహాయపడు స్థితికి వచ్చునట్టి బలమైన పరివర్తన, ఆశ్చర్యకరముగా సాధకుల జీవితములో జరుగుతుంది. రోగులు వైద్యులగుట, విద్యార్థులు బోధకులగుట, ఇతరులపై ఆధారపడువారు, ఆధారమును ఇచ్చువారగుట, సేవకులు ప్రపంచ సేవకులగుట జరుగుతుంది. ఇటువంటి మార్పులు గమనించ బడినవి.

### 4. నేను నీ సూక్ష్మ శరీరమును శాశ్వతముగా చెడకుండునట్లు చూస్తాను. అది విచ్ఛిన్నము కాకుండా చూస్తాను :

సృష్టి అంతయు ఈథర్ మూలముగా నిర్మింపబడినది. సృష్టిలోనుండు ప్రతి రూపమునకు దాని సూక్ష్మ పదార్థ మున్నది.

ఆ సూక్ష్మ పదార్థము, రూపము నుండి విచ్ఛిన్నమై, విశ్వములోని సూక్ష్మ పదార్థములోనికి చేరినప్పుడు, దానిలోని పదార్థము, భౌతిక పదార్థము పడిపోయి రూపము అదృశ్య మౌతుంది. సూక్ష్మరూపము యొక్క బాహ్యా ఆవరణ చక్కగా నుండి, దానిని స్థిరపరచినప్పుడు, రూపము ఉంటుంది. మనిషి శరీరము విచ్ఛిన్నమైనను, సూక్ష్మరూపము యొక్క బాహ్యావరణను ఉంచుకొను పద్ధతిని మాస్టరుగారు కనుగొన్నారు. దానివలన మరల తిరిగి వచ్చినప్పుడు మునుపటి రూపములోనికి వచ్చుట సాధ్యమౌతుంది. పాశ్చాత్య సంప్రదాయములో దీనిని పునరుత్థానము అని తెలిపారు. జ్ఞానులైన గురువు లందరు ఈ స్థితిలోనికి చేరుట వలన తరచుగా తమ అనుయాయులకు అదే రూపములో కనిపిస్తారు. సూక్ష్మ శరీరమును స్థిరపరచుట ఈ స్థితి వచ్చు జాడను తెలుపుతుంది. ప్రపంచములోని అన్ని పవిత్ర గ్రంథములు దీనిని గురించి తెలుపుతాయి.

భారత దేశములో ఈ స్థితిని యోగములో ధారణ అంటారు. భాగవత పురాణములో దీనిని 'భాగవత శరీరము' అని, ప్రాక్ వాఙ్మయములో 'అంతఃకరణ శరీరము' అంటారు. 'మహిమాన్వితమైన శ్వేతవస్త్రము' (Glorious White Robe) అను పదమును, రూపొందిన సూక్ష్మ శరీరమును గురించి తెలుపునప్పుడు క్రీస్తు వాడారు. 'వజ్రాంగ శరీరము' వజ్రము వంటి శరీరము అనునది దీనికి మరియొక పేరు. ఇవన్నీ సూక్ష్మ పదార్థముతో చేయబడిన అమరమైన శరీరమునకు

సంబంధించినవి– దాని చుట్టూ భౌతిక పదార్థముతో కూడిన శరీరము కూడుతుంది. భౌతిక పదార్థము మాయమైన తరువాత కూడా, స్థిరమైన సూక్ష్మ రూపము మరల అదే రూపమును రూపుకట్టుకొన గలదు.

ఇప్పటివరకు ఈ పద్ధతికి చాలా గంటల సాధన అవసరమయ్యేది. మాస్టరుగారు దాని అభివృద్ధికి తగిన సమయము వచ్చినందున ఆ పద్ధతిని  సులభము చేసి త్వరపరిచారు. వారు సూక్ష్మ శరీరమును 'స్టేజ్', ఆత్మను 'ది స్టాట్యు' అని మర్మమైన భాషలో "స్టేజ్ స్థిరముగా ఉంటే స్టాట్యు ఎప్పటికీ ఉంటుది" అని తెలిపారు.

**5. మీకు స్వస్థత నిచ్చుటకు ఒక పద్ధతిని ఇస్తాను. దానితో మీరు చనిపోయిన వారిని పునరుజ్జీవింప చేయుట వీలవుతుంది. మీరు చనిపోతున్న వారికి, చనిపోయిన వారికి ప్రాణశక్తిని ఇవ్వ గలుగుతారు :**

ప్రతి గురువు స్వస్థత నివ్వగలిగిన వాడే. కానీ మాస్టర్ CVV గారు చాలామందిని స్వస్థత నివ్వగలిగిన వారిగా తయారు చేశారు. ప్రాణశక్తిని ప్రసారము చేయుట వారి చేతిలోని పని ముట్టు వంటిది.

అంతటను వ్యాపించిన ఒకే ప్రాణమును చూడగలిగిన వారికి, దానిని అందించారు. వారి జీవితములో చనిపోయిన

ఎంతోమందికి ప్రాణమును ఇచ్చి చూపారు. వారి శిష్యులు కూడా అదే చేశారు. ఇప్పుడు కూడ అదే జరుగుతుంది. మాస్టరుగారు విశ్వములోని ముఖ్య ప్రాణమును సాధకునిలో పనిచేయు ప్రాణశక్తికి అనుసంధానము చేశారు. కావున అవసరమని భావించి నపుడు ప్రాణశక్తి ప్రవాహ మేర్పడి ప్రజలకు స్వస్థత చేకూర్చుటలో సహకరిస్తుంది.

స్వస్థత చేకూర్చదలచిన వారికి మాస్టరుగారు నియమములు ఇచ్చారు. బాధలోనున్న వారి కొరకై పనిచేయుటకై తమను తాము సమర్పించుకోవాలి.

ఏదైనా భౌతిక రూపములో నున్న బాధాగ్రస్తుడు ఎదురైతే, తన పరిధిలో వారికి సహాయ పడాలి. బాధాగ్రస్తునికి సహాయ పడుటకై ఉన్ముఖముగా నుండుట ముందస్తుగా ఉండాలి. మన జీవనవిధానము జీవనమునకు సహాయకారిగా ఉండాలి కానీ, బాధించేదిగా ఉండరాదు. ఎవరికీ హాని తలపెట్టకుండుట రెండవ ముఖ్యమైన గుణముగా ఉండాలి. నిద్రించుటకు ముందు స్వస్థత సమకూర్చుటకై అర్పణ చేసుకొనుట మూడవ మెట్టు. స్వస్థత చేకూర్చుటకై ఇతరులకు కుతూహలము కలిగించక, బాహ్యామైన ఏదో ఒక వైద్య విధానమును చేపట్టుట నాలుగవ మెట్టు. గుప్తముగా ఉంటూ స్వస్థత కలిగించుట అనే పాండిత్యాన్ని కలిగి ఉండాలి.

భౌతిక, భావ, మానసిక పొరలందు, పరిసరములయందు శుద్ధి కలిగియుండుట ధారాళముగ స్వస్థత చేకూర్చు శక్తి

ప్రసారమునకు అవసరము. సంపాదనకై స్వస్థతను చేపట్టుట నిషిద్ధము. గుర్తింపు, గొప్పతనమును ఆశించుట కూడా అర్జనగా పరిగణించబడుతుంది. స్వస్థత చేకూర్చుటకు వైద్యుడు, రోగి, మాస్టరుగారు ఒక త్రిభుజముగా భావించి, త్రిభుజిగా స్వస్థత చేకూర్చుటకు ఉపక్రమించు మార్గము సూచింపబడినది.

## 6. నీవు అన్ని కక్ష్యలలోనూ ఒకేసారి ఉండగలుగు అనుభూతిని పొందుతావు :

ఉత్తమమైన మానవ జన్మను పొందినవాడు, మాస్టరుగారు సూత్రీకరించిన కుంభయుగ విజ్ఞానమునకు చేరుటకిది పరాకాష్ఠ.

ఆధ్యాత్మిక మార్గములో ఉండేవారు జీవితములో రాజకీయములు, వ్యాపారము, వృత్తి, గృహజీవితము వంటి రంగములలో పాల్గొనకుండుట సాధారణముగా మనము చూస్తుంటాము. ఇవన్నియు ఆధ్యాత్మికత లేనివని భావించి వాని నుండి తప్పించుకుంటారు. వారి దృక్పథము, భావాన్ని బట్టి అలా కనిపిస్తుంది. 'స్పిరిట్' అన్న పదానికి సరియైన అర్థము తెలియనివారు సాధారణ జీవనాన్ని ఆధ్యాత్మికత పేరుతో తిరస్కరిస్తారు. వారి అవగాహన పరిమితమైనది. కుటుంబమును వదలివేసి, ప్రాపంచిక విషయము లక్కరలేదని అనేటువంటి ఆధ్యాత్మికులు, పరాన్నజీవులు కాకున్నను, సమాజముపై ఆధార పడినవారు అవుతారు. తాము పవిత్రులము అన్నట్లు ఇతరులను నమ్మించి, ఇతరులపై జీవిస్తారు. తన కాళ్ళపై తాను నిలబడి, ఇతరులకు ఆధారముగా నిలబడలేని వాడు పవిత్రుడు కాజాలడు.

నామ మాత్రముగా పవిత్రుల మనుకొనువారు చాలామంది ఉండగా, అటువంటి పేరులేవీ లేని పవిత్రులైనవారు చాలామంది ఉన్నారు.

బాధ్యతను విస్మరించుట ఆధ్యాత్మికత కాదు. అలాకాక, సమర్థముగా చాలా బాధ్యతలు భరించుట ద్వారా ఎక్కువ వెలుగులోనికి వెళ్ళుట అనునది శిష్యరికమును చేరు మార్గము. నిజమైన గురువులు, శిష్యులు అనువారు జీవితమును యథాతథముగా, సంపూర్ణముగా స్వీకరించి వారున్న ప్రతి పనిలోనూ పనిచేస్తూ, ఆదర్శప్రాయమౌతారు. వారు స్వతంత్రముగా, బంధములు లేక ఉంటారు. మిథిల రాజు జనకుడు, రాముడు, కృష్ణుడు, అందరు జగద్గురువులు సంపూర్ణమైన, అన్నింటినీ కలుపుకొను ఆధ్యాత్మిక జీవనాన్ని చూపారు. జీసస్ ఒక వడ్రంగిగా పనిచేసి, ప్రజలిచ్చు ధనముపై ఆధారపడలేదు. ఆధ్యాత్మికత పేరుతో తెలివిగా యాచించువారు బీదవారు.

ఆధ్యాత్మిక అన్నది ఒక జీవన విధానముకానీ, వృత్తి కాదు. మొత్తము జీవన విధానానికి అది ఒక అంతర్భాగము. సర్వవ్యాపకుడైన భగవంతుని అవగాహన, జీవన పరిస్థితులను తప్పించుకొన చూచుట కుత్రతనమని తెలుస్తుంది.

### 7. నా శరణుపొందిన వారిని నా అంత చేస్తాను. అతడు మొత్తము మానవాళిని సేవిస్తూ ఉంటాడు :

అన్నింటిలోనున్న ఒక్కనికి శరణుపొంది, జీవితములో

అన్నింటా అతనినే చూస్తూ ఉన్న మనిషిగా మార్పుచెంది, మెల్లగా అతడు ఆత్మగా పనిచేస్తాడు. ఆత్మగా పనిచేయుట నేర్చిన వ్యక్తి తన చుట్టూ ఆత్మనే చూస్తాడు. అతడు ఇతరులు కాక అందరినీ సోదరులుగానే గుర్తిస్తాడు. సేవ అనునది సహజముగా జరుగు తుంది. తనను తాను సేవించుకుంటూ, తనచుట్టూ వ్యాపించిన ఆత్మకు సేవ చేస్తున్నానన్న భావనలేక సేవిస్తాడు. సేవను గురించిన భావన ఇంద్రజాలమే అవుతుంది. అది సంఘమునకై చేయు పనిగాక చూపరులకై చేయు పని అవుతుంది.

# 12. మాస్టరుగారు మరియు గ్రహములు

*"నేను దిగివచ్చినది ఈ భూగ్రహమును, శని, శుక్ర గ్రహములను సరిదిద్దుటకే"*

మాస్టరుగారు ఇచ్చిన ఈ ప్రకటనకు చాలామంది ఆశ్చర్య పడ్డారు. విమర్శనాత్మక ధోరణి గల కొంతమంది ఇది ఒక వెఱ్ఱివాని ఊహ యని త్రోసిపుచ్చారు.

వారు గొప్ప గురువు అని, గురువుగానే పుట్టారన్న విషయాన్ని మరచారు.

వారి జననము ఏడు కక్ష్యలు దాటిన ఎనిమిదవ కక్ష్య నుండి జరిగినది. తూర్పు వారి పురాణ గ్రంథములలో ఇది నారాయణ కేంద్రమని తెలుపబడింది.

అటువంటి నివాసము నుండి వచ్చిన వారికి ఏది సాధ్యము కాదు? వారిని ఏది హద్దులో పెట్టగలదు? వారిని గ్రహములు ఎలా బంధింపగలవు?

"వివరములు, పద్ధతుల పట్ల జాగ్రత్తగా ఉండండి" అని మాస్టరుగారు సలహా ఇచ్చారు. శని గ్రహమిచ్చు శిక్షణ ఇదియే. వివరములు సరిగా తెలియని వ్యక్తి, నిపుణత లేక పతనమౌతాడు.

వాస్తవమునకు గ్రహము లేవీ వాటంతటి అవే ఎవరినీ బంధింపవు. ఎవరైతే సాధారణముగ ఉందరో, సహజమైన జీవనమును గడపరో వారు గ్రహచాలనము వలన బంధింప బడుతారు. గ్రహముల పాత్ర ఒక ఇంటిలోని సేవకుని వంటిది. ఇంటిలోని పిల్లవాడు వానిపై ఎక్కువ ఆధారపడతాడు. వాని యొక్క కదలికలు అతనిచే కట్టుబాటు చేయబడతాయి. పిల్లవాడు అతడు సూచించినట్లే కదలగలుగుతాడు. కానీ సేవకుడు పిల్లవానికి సరిగా సేవ చేస్తాడు.

పిల్లవాడు పెరిగి యువకుడై అభివృద్ధి చెందుతాడు. అప్పుడతని కదలికలు సేవకునిచే ఎంతమాత్రమూ కట్టడి చేయబడవు. ఆ యువకునికి సేవకుని యోగ్యతలు, హద్దులు తెలిసి, దానికి తగినట్లు ప్రవర్తిస్తాడు. చిన్నవాడుగా నున్నప్పుడు అతనిని చూచుకొన్నట్లు, సేవకుడు అంతగా గమనించడు. కానీ అతనికి సేవ చేస్తాడు.

అలాగే, తమపై తమకు పట్టులేనివారి కదలికలు గ్రహములు నిర్దేశిస్తాయి. ఆధ్యాత్మిక మార్గములో నున్న శిష్యునితో అవి సహకరిస్తాయి. గురువుల ఆదేశములకై అవి ఎదురు చూస్తాయి. ఇలా మూడు స్థితులలో అవి సేవ చేస్తాయి.

కాబట్టి ఏ గ్రహమునకు ఎవరినీ ఇబ్బంది పెట్టవలయునను భావము ఉండదు. భూమిపై వెలుగు ఉన్నది. అది ఒక సూర్యునిదే కాదు. అది చంద్రుడు, కుజుడు, బుద్ధుడు, గురువు, శుక్రుడు,

శని అందరియొక్క కలబోసిన కాంతి. ఆత్మ ప్రచోదనము సూర్యుడు చేస్తే, చంద్రుడు మనసును సూచిస్తాడు. పనిచేయుటకు ఉత్సాహము, బలము కుజుని నుండి వస్తే, బుద్ధిని బుధుడు సూచిస్తాడు. పరిపూర్ణతను గురువు సూచిస్తే, శుక్రుడు అందమును గుర్తించు శక్తిని, అనుభవమును ఇస్తాడు. శని మనకున్న హద్దులను దాటు పద్ధతిని బోధిస్తాడు.

మాస్టరుగారు ఈ గ్రహముల నుండి వచ్చు శక్తిని ఆమోద యోగ్యమగు పద్ధతిలో పెంచవలయునని, భూమి యొక్క గ్రహణ శక్తిని పెంచాలని గుర్తించారు. మాస్టరుగారు దీనికి అవసరమైన సవరణలు ప్రతిపాదించ దలచారు. ఇందుకై వారు తమ పత్నియైన వెంకమ్మగారిని తరచూ ట్రాన్స్ లోనికి పంపేవారు. తాను కూడా ట్రాన్స్ లోనికి వెళ్ళి రెండు మూడు రోజుల తరువాత భౌతిక శరీరములోనికి వచ్చేవారు. వచ్చిన తరువాత 5,6 లీటర్ల మజ్జిగ త్రాగేవారు.

ట్రాన్స్ లోనికి వెళ్ళినప్పుడు ఏమి చేసేవారని ప్రశ్నించిన వారికి, వారిలా బదులిచ్చేవారు ''శుక్ర, శని గ్రహముల నుండి వచ్చు శక్తి ఆమోదయోగ్యముగా లేదు. దూరశ్రవణము ద్వారా వారికి ఫోను చేసేవాడిని'' అని తెలిపేవారు.

అపుడు ప్రజలు ''మీరేమైనా పిచ్చివారా?'' అని అడిగేవారు.

వారికి మాస్టరుగారు ''అదొక రకమైన పిచ్చి. నేను భూమిపై ఉండి గ్రహములతో టెలిఫోనుతో పనిచేస్తే, అవి నాతో

టెలిగ్రాఫ్ తో  పనిచేస్తాయి. అవి మందకొడిగా ఉన్నాయి కావున వానిని ఉత్తేజ పరచాలి. నేను శనిని సరిచేసి దానికున్న చెడ్డ పేరును పోగొట్టడానికి వచ్చాను. శుక్రునికి ఉన్న కొన్ని దృష్టులను కూడా సరిచేస్తాను". శుక్రునితో పనిచేయునప్పుడు శరీరాన్ని వదలుతానన్న మాస్టరుగారు అలానే చేశారు.

## మాస్టరుగారు, శని :

మనకు ఆత్మగా పనిచేయుట తెలియువరకు, మనము మనలోని త్రిగుణముల కలబోతను బట్టి ఏ పనియైనను చేస్తాము. ఈ లక్షణాల కలయికను బట్టి  ఒక వ్యక్తియొక్క ప్రవర్తనా పద్ధతులు ఉంటాయి. వాస్తవానికి, ఇది మనిషి మనిషికి వేరుగా ఉంటుంది. ఈ వైభవమును, విభిన్నతను, మనము గందరగోళముగా అర్థము చేసుకొంటే, మనము ఘర్షణకు లోనవుతాము. ఇది ఇతరుల పట్ల అయిష్టత వంటి కరడుకట్టిన భావములకు దారితీస్తుంది. మనము ఇటువంటి భావములకు తావిస్తే, బంధములకు లోనవుతాము. దీనినే పరిమితి లేక హద్దు అంటారు.

మనలోని పరిమితి అనునది శనియొక్క లక్షణము. మాస్టరుగారి శక్తిని ఆవాహన చేసుకొన్నప్పుడు ఈ పరిమితులన్నీ క్రమముగా తొలగిపోతాయి.

కొంతమంది శిష్యులకు మాస్టరుగారే శని!  మాస్టరుగారి పద్ధతి ఎలా ఉండేదంటే వారినుండి దీక్ష తీసుకొన్నవారి వైపుకు పరుగెత్తుకొని వచ్చినట్లు కష్టములు వచ్చేవి. మాస్టరుగారు వారి

శిష్యులను పరిమితులను ఎదుర్కొని వాటిని అధిగమించాలని కోరేవారు. పరిమితులను అధిగమించిన తరువాతే శిష్యుడు సమన్వయ శక్తిని అందుకొనుటకు అర్హుడౌతాడు. మాస్టరుగారి అనుయాయి ఎవరైనను వ్యక్తుల పట్ల, వస్తువు పట్ల, పరిస్థితుల పట్ల అయిష్టత ఉన్నట్లయితే, అవన్నీ కలిసి వారి వైపునకు పరుగెత్తుకొని వచ్చేవి. అయినప్పటికీ మాస్టరుగారు లోనుండి శక్తిని ఇచ్చి, అటువంటి అయిష్టతలకు పరిష్కారము చూపేవారు. కానీ దానికి ఆ శిష్యుడు సంసిద్ధుడై ఉండాలి.

శనితో పని చేయునప్పుడు ఇది ఆవశ్యకమైన మొదటి మెట్టు అని మాస్టరుగారు స్పష్టము చేశారు. ఇలా మొదటగా వచ్చు అసౌకర్యములను పట్టించుకొనక, తనతో పది సంవత్సరములు ఉన్నట్లయితే తరువాత తాను బృహస్పతి ద్వారా పని చేస్తానని తెలిపారు. మాస్టరుగారి మొదటి ప్రేరణ శని అయితే రెండవది బృహస్పతి.

దాని అర్థము, జీవిత అనుభవము ఇవ్వబడుటకు అయిష్టతలను ఇష్టముగా స్వీకరించి, బలహీనతలను వదలించుకొని, బలవంతులైన వారికి బృహస్పతి యొక్క విస్తృతిని, పరిపూర్ణతను ఇచ్చుటకు తాను సిద్ధమన్నారు. మాస్టరుగారి ఉద్దేశ్యము, బలముగా నుండుట, పరిపూర్ణత మరియు సులువు.

**శని :**

దీక్ష తీసుకొని సాధనా మార్గములోనికి వచ్చుటకు శని

ప్రభావము బలముగా ఉంటుంది. శని ఇచ్చు శక్తిని సరిగా అర్థము చేసుకొని వాడుకొన్నప్పుడు రూపము బంధించు స్థితినుండి విడిపించి, వ్యక్తిగత ప్రజ్ఞలోనికి ఉద్ధరిస్తుంది.

శని మన పూర్వకర్మకు ప్రభువు. తన గమనములో దానికి పరిహారము మనచే బలవంతముగా అనుభవింప జేస్తాడు. పాత అప్పులను తీర్చమని, పాత తప్పులను సరిచేసుకోవాలని అడుగుతాడు. పరిమితుల వలన తనను తాను ఖండించుకొనుటయే శనిగ్రహ ప్రభావము. దీనిని అధిగమించుటకు వ్యక్తి ఓర్పుతో పనిచేయాలి. శనికి ముఖ్యమైన లక్షణమే ఓర్పు. పద్ధతులు పాటించుట రెండవది. వివరములు తెలియుట మూడవది. తాను చేయు ఏ పనినైనను, చేయుటలో ఓర్పుగా, పద్ధతి ప్రకారము వివరముగా తెలుసుకొనిచేస్తే, శని వదులుతాడు అంటే దాని అర్థము తనకు తాను విధించుకొన్న బంధము నుండి బయట పడతాడు.

పురాణములలో మనిషియొక్క పతనాన్ని, శనియొక్క పతనముగా సూచించేవారు. శనియొక్క ఊర్ధ్వస్థితి, వ్యక్తిగత కర్మనుండి బయటపడుట సూచిస్తుంది. శనితో పనిచేయుట అంటే మనలోని లోటుపాట్లను అధిగమించుట. కాబట్టి మాస్టరుగారు శని కార్యక్రమమును సరిదిద్దుటకు వచ్చానని తెలిపారు.

30 సంవత్సరముల రాశిచక్ర భ్రమణములో శని చంద్రునిపైనుండి, లగ్నముపైనుండి వెడతాడు. 7 సంవత్సరముల

గమనములో అది ఒకే డిగ్రీ లోనికి వచ్చుట, కేంద్ర దృష్టికి, సప్తమ దృష్టి లోనికి వచ్చుట జరుగుతుంది. దాని ప్రభావము వలన కాల గమనములో మనలోపల మార్పులను తెస్తుంది. గమనములో శని ఆ స్థానములను తాకినప్పుడు మనకు తప్పించకొనలేని తీవ్రమైన సంక్షోభములు వస్తాయి. ఆ సంక్షోభములను మనిషి ఓర్పుతో, అర్థము చేసుకొని ఎదుర్కొన్నప్పుడు, ఆ సంక్షోభ క్షణాల్లో మనలోని పరిమితులను అధిగమించు అవకాశము వస్తుంది. కాబట్టి శని ముఖ్యముగా మనిషి తాను నేర్చుకొనుట, సరిదిద్దుకొనుట చేయిస్తాడు. అది మనిషి తాను విధించుకొన్న బంధముల నుండి విముక్తుడగుటకు సహాయ పడుతుంది.

క్రీస్తు మకర రాశిలో జన్మించి, శనియొక్క ధర్మమును పూర్తిచేసి (మకరమునకు అధిపతి శని), శుక్రుని యొక్క సహకార ముతో మానవ సోదరత్వమును స్థాపించాడు. మాస్టర్ C.V.V. గారు సాధకులలో శనియొక్క ప్రభావమును త్వరగా ముగించి, శుక్ర గ్రహముయొక్క పరిధిలోనికి తీసుకొని వెడతానని గుప్తముగా చెప్పారు.

సప్తర్షి మండలము నుండి మొదటి కిరణము యొక్క శక్తిని మన మండలమునకు తెచ్చుటలో శనియొక్క పాత్ర ప్రక్కన పెట్టుటకు వీలు లేనిది. మన మండలములోని పరిమితులను త్రుంచివేయుట– వ్యక్తిగత మరియు గ్రహకక్ష్య– అనునది శనిపై కొంత దీక్ష నిచ్చుటతో జరిగింది– దీనినే మాస్టరుగారు శనిని సరిచేయుటగా తెలిపారు.

"శని దీక్షనిచ్చు గ్రహము" అని మాస్టర్ D.K. గారు తెలిపారు. మాస్టర్ C.V.V గారితో పనిచేయువారి జీవితములలో ఇది చక్కగా నిరూపించబడినది. మాస్టర్ C.V.V. గారు సాధకుల జీవితములో ప్రవేశించుట, వారి శని చాలనములో జరుగుతుంది. అనగా శని, రవి, చంద్రుడు, లగ్నముపై చరించునప్పుడు జరుగుతుంది. బాహ్య జీవనములో సంక్షోభము సంభవించినప్పుడు మాస్టర్ C.V.V. గారు విముక్తి పొందుటకు ఒక అవకాశాన్ని కల్పిస్తారు. వారు సాధకులకే కాక గురుపరంపరకూ అవకాశాన్ని కల్పిస్తారు. గురుపరంపరకు శిష్యులను ఇస్తారు. శని యొక్క శక్తిని తెలివిగా ఉపయోగించి సాధకులను శిష్యులుగా మారుస్తారు. మాస్టర్ C.V.V. గారు స్థాపించిన ఒక పద్ధతి ద్వారా పరస్పర సంబంధము కలిగిన మానవజాతి గురుపరంపర సంక్షోభములను, ఒకేసారి పరిష్కరించి, శంబళ శక్తి ధారాళముగా ప్రవహించునట్లు చేస్తారు. దీనితో భూగ్రహ ప్రయోజనము, మానవజాతి ప్రయోజనాలకు సరియైన అనుసంధానము కలుగుతుంది.

మకర రాశి ప్రభువు శని. తులారాశిలో ఉచ్ఛ, కుంభరాశిలో మొదటి డెకనేట్ కు( ఒక రాశికి 30 డిగ్రీలుంటే, దానిలో మూడవ భాగమును అనగా 10 డిగ్రీలను డెకనేట్ అంటారు) ప్రభువు. శని యొక్క తులారాశి సంచారము మార్పులను తీసుకొని వస్తుంది. ఈ మధ్య సంవత్సరములలో శని సంచారములో ఐరోపా ఖండములో చాలా మార్పులు వచ్చాయి. కుంభరాశిలోని మొదటి డెకనేట్‌లో శని చారము జరిగినప్పుడు మానవ విలువలలో పెనుమార్పులు

రాగా, యురేనస్ కుంభరాశిలో సంచరించునప్పుడు ఇంకా వివరమైన మార్పులు వస్తాయి. నెప్ట్యూన్ కుంభరాశి సంచారములో ఈ మార్పులు పూర్తి అవుతాయి.

శని, భూగ్రహములు రెండూ మూడవ కిరణము– తెలివైన పనిచే (Intelligent Activity) పరిపాలింపబడు చున్నవి. శని భూమికి, భూమిజీవులకు క్రమశిక్షణ నిచ్చి, తరువాత శుక్రునికి ఇచ్చు బాధ్యతను తీసుకున్నాడు.

"అడ్డంకులన్నీ తొలగిన తరువాత, దృష్టిని గ్రహింప గలుగుతారు" అని మాస్టరుగారు తెలిపారు.

**శుక్రుడు :**

మాస్టరుగారు ధనిష్ఠ నక్షత్రములో జన్మించారు. అంటే చంద్రుడు వారు జన్మించినప్పుడు ఆ నక్షత్రములో ఉన్నాడు. కుంభ రాశి చివరి డెకనేట్ లో ధనిష్ఠ నక్షత్రమున్నది. రాశిచక్ర అక్షము యొక్క తిరోగమనములో మొదటిది అవుతుంది. కుంభరాశిలోని మొదటి డెకనేట్పై, శుక్ర గ్రహమునకు విశేషమైన ప్రభావము ఉన్నది. శుక్ర గ్రహము భూమిపై మనిషికి వ్యక్తిగత ప్రజ్ఞను ఇచ్చినది. ఇప్పుడు శుక్రుని యొక్క పరిధిని హెచ్చించి, వ్యక్తిగత ప్రజ్ఞ నుండి బృందముయొక్క ప్రజ్ఞలోనికి తీసుకొని వెళ్ళబడుతుంది. ఇది మొత్తము మానవజాతికి ఇవ్వబడిన దీక్ష. ఆత్మ సాక్షాత్కారము బృంద సాక్షాత్కారమునకు దారితీస్తుంది. మొదటిది (ఆత్మ సాక్షాత్కారము) రెండవ దానికి లోబడి (బృంద సాక్షాత్కారము)

పనిచేస్తుంది. బృందము యొక్క బాధ్యతలను బట్టి ప్రజ్ఞ ఉంటుంది. వ్యక్తియొక్క ప్రజ్ఞ కాక ఇది బృందములోని వ్యక్తిగత ప్రజ్ఞ. ప్రజ్ఞ వ్యక్తి నుండి బృందమునకు పరివ్యాప్తి చెందుతుంది.

మాస్టర్ C.V.V. గారు సమన్వయ శక్తిని శుక్రగ్రహము వరకు తీసుకొనివెళ్ళి మానవుని మనస్సు ఉన్నతమైన చైతన్య స్థితులను గ్రహించునట్లు చేశారు. మనస్సును శుక్రుడు భూమిజీవుల కిచ్చు బాధ్యత తీసుకొన్నాడు గనుక వారు అలా చేశారు.

శుక్రుడు భూ ప్రజ్ఞకు ఉన్నత రూపమై మానవజాతికి దగ్గర సంబంధము కలిగి ఉన్నాడు. మానవునికి మనస్సు ద్వారా శుక్రగ్రహ ప్రభావము వలన అనుభూతి వచ్చు చున్నది. సంక్షోభములు, ప్రతికూలతలు అనుభవమగు వరకు మనిషి రూపములో బంధింపబడి ఉంటాడు. ఆత్మ రూపముచే బంధింప బడి ఉంటుంది. అనుభవము ద్వారా మనిషి సాధారణమైన ద్వంద్వములను గ్రహిస్తాడు. అలా కొన్ని జన్మలు గడచిపోతాయి. ఆ ద్వంద్వములను ఆత్మ, శరీరమను రెండు ప్రతికూలమైన జీవనములు కలిపి కట్టబడినట్లుగా గ్రహిస్తాడు. ఊర్ధ్వగతి చెందు లక్షణము ఆత్మకు ఉంటుంది. భూమికి అంటుకొను లక్షణము శరీరమునకు ఉంటుంది. శుక్రుడు, యముని సహకారముతో ఆ రెండిటిని కలిపి కట్టబడిన బంధమును ఛేదించి, వారిని ఎట్టి బంధము లేకుండా కలిసి ఉండు స్థితిలో వుంచుతాడు. అది ఎట్టి బంధము లేకుండా కలసి ఉండు స్థితి. ఇది మానసిక స్థితిలో

జరుగు దీక్ష. శుక్రుని ద్వారా భూమికి, భూమిజీవులకు మాస్టర్ C.V.V. గారు సూక్ష్మముగా ఈ దీక్షను నిర్వర్తించారు.

శుక్రుడు భూమికి 'ఆల్టర్ ఇగో' అని చెప్పుటలో అర్థము శుక్రుడు భూమికి higher self లేక ఉన్నత ప్రజ్ఞ అని అర్థము. మనిషి బుద్ధి ఎలాగో, భూమికి శుక్రుడు అటువంటిది. మేడమ్ హెలీనా పెట్రోవా బ్లావెట్‌స్కీ రచించిన "సీక్రెట్ డాక్ట్రిన్", ఏలిస్ ఎ బెయిలీ రచించిన "ఈసోటరిక్ ఎస్ట్రాలజీ" అను పవిత్ర గ్రంథముల ద్వారా మాస్టర్ D.K. గారు శుక్రునికి భూమిపై గల పాత్రను గూర్చి తెలిపారు. ప్రకృతిలోని సౌందర్యమును, చక్కని సమన్వయమును కూలంకషముగా అర్థము చేసుకొనే అవగాహన శుక్రుడు ఇస్తాడు.

శుక్రునిలో నివాసము మానవునికి భూమి కంటే శాశ్వతమైనది. జీవునికి ఆత్మ ఎలా శాశ్వత నివాసమో, అలా శరీరము ఆత్మకు కాలేదు. ఆత్మగా జీవించువారు ప్రకృతి సౌందర్యాన్ని, రూపముతో బంధము లేక అనుభూతి చెంద గలుగుతారు. రూపములేని సౌందర్య అనుభూతి వారి స్థితి.

ఇటువంటి అనుభూతి, భూమికి ధర్మబద్ధముగా కొని తేబడుతుంది. దానిని ఒక అదృష్టమైన సంఘటన అని తేలికగా తీసుకోరాదు. శాస్త్రీయముగా గురుపరంపర జరిపిన ఈ కార్యము ఇంకనూ మానవునికి తెలియదు.

మాస్టర్ C.V.V. గారు అటువంటి ఉత్తమమైన గురుపరం పరకు చెందినవారు (సిరియస్, అగస్త్య, వరుణ మొదలైన

పరంపరలు..). భూమిపైకి సౌందర్యమును తెచ్చుటలోని ఉద్దేశ్యము, సామరస్యత యొక్క అనుభూతి (శుక్రుని లక్షణము) భూమిపై మనస్సును ఊర్ధ్వ కక్ష్యల లోనికి కొనిపోవుటకే. పై కక్ష్యలోని మనస్సు (శుక్రునిది) అవరోహణ చేయునది, భూకక్ష్యలోని మనస్సును పైకి కొనిపోవుటకే. ఆత్మ ఊర్ధ్వకక్ష్యలోని మనస్సు ద్వారా దిగివచ్చి క్రింద కక్ష్యలోనికి మనస్సుకు ఆనంద స్థితియొక్క పరిచయాన్ని, ఉన్నత జీవనము యొక్క సౌందర్యాన్ని పరిచయం చేస్తుంది. అంతఃకరణ శరీర నిర్మాణము ద్వారా ఈ ప్రణాళిక రచించబడింది.

# 13. గురుపరంపర

*“సూక్ష్మమైన పరంపరను తెలుసుకొని పని మొదలుపెట్టండి”*

మన భూగ్రహము ముఖ్యముగా అన్నింటిలో రెండు గురుపరంపరలచే పరిపాలింపబడు చున్నది. వారు ఏక కాలములో అన్ని విషయములందు పనిచేయు చున్నారు. మన గ్రహముపై వారి నివాసము లేక ఆశ్రమములు హిమాలయములలో మరియు నీలగిరులలో నుండి వారు ఒకరితో నొకరు సన్నిహితముగా పనిచేయు చున్నారు.

గ్రహకక్ష్యలో గురువు హిమాలయ పరంపర మరియు శనితో పనిచేయుచుండగా, యురేనస్ ద్వారా నీలగిరి పరంపరతో కలిసి పనిచేయు చున్నాడు.


సౌరకక్ష్యలో నెప్ట్యూన్ నుండి హిమాలయ గురుపరంపర ద్వారా, ప్లూటో నుండి నీలగిరి ద్వారా శక్తిని అందుకొనుట జరుగు చున్నది.

నెప్ట్యూన్ కంటే పై కక్ష్యలో (హిమాలయ పరంపరకు) ఆ శక్తిని దేవతలకు అధిపతియైన ఇంద్రుడని పిలువబడతాడు. ఆ కక్ష్యలో నీలగిరి పరంపరకు సంబంధించిన సమానమైన శక్తిని యముడు అంటారు.

మహర్లోక కక్ష్యలో హిమాలయ పరంపరను వసిష్ఠుడని, నీలగిరి పరంపరలో అగస్త్యుడని పిలువబడతారు.

దాని కంటెను ఇంకనూ పైకక్ష్యలో ఉన్న ఒకే కేంద్రమునుండి దిగివచ్చు రెండు శక్తులను అశ్వినులు లేక దేవతా ద్వయము అంటారు. వారినే 'అసత్యము కాని వారు' అంటారు.

గురుపరంపర



ఒకటే రెండుగా దిగివచ్చి, ఆ రెండింటి కలయికతో అన్నియును ఏర్పడుచున్నవి. వారిద్దరి పని, ఒక దానితో ఒకటి ప్రాణము, రూపమువలె అల్లుకొని, వానియొక్క అల్లికను విడదీయుట కష్టమౌతుంది.

ఒకదాని తరువాత మరియొకటిగా వచ్చు సృష్టి ధర్మమును (The Law of Alternation) అశ్వినులు నిర్వహిస్తారు. రాత్రి – పగలు, ఉచ్ఛ్వాస – నిశ్వాస, ఆరోహణ – అవరోహణలు, పదార్థం – ప్రజ్ఞ, పదార్థము ప్రజ్ఞమయ మగుట – ప్రజ్ఞ పదార్థమగుట. ఇటువంటి జంట పను లన్నింటినీ వీరు నిర్వహిస్తారు.

జీవ జలములు ఊర్ధ్వమగుట – దిగివచ్చుట అను మొత్తము కార్యక్రమము వారి రెండు రెక్కలతో జరుపబడుతుంది. కనుకనే వారిని రెండు రెక్కలు గల పెద్ద పక్షిగా సంకేతిస్తారు. రెండవది లేకుండా అది ఒక్కటిగా మనలేదు. కాబట్టి వానిలో ఏది పెద్దది అన్న ప్రశ్న ఉదయించదు.

గురుపరంపరకు కూడా ఇదే సమముగా వర్తిస్తుంది. అవసరాన్ని బట్టి వారు పనిచేస్తారు. అగస్త్యప్రజ్ఞ క్రొత్త సృష్టిలో రూప నిర్మాణమునకు పనిచేస్తుందని చెప్పుకోవచ్చును. వసిష్ఠ పరంపర ప్రజ్ఞా వికాసమునకు, గ్రహములోని చాలా సమయము పట్టు పరిణామ క్రమమునకై పనిచేస్తుంది.

అగస్త్యప్రజ్ఞ దిగివచ్చు ఆత్మలు నూతనముగా రూపొందుటకై పనిచేస్తుంది. ఉన్న రూపములను పునర్నిర్మించి, సరిదిద్ది, చక్కని

అనుభూతి నిచ్చుటకు, ప్రజ్ఞ జీవునికి తోడ్పడునట్లు చేస్తుంది. వసిష్ఠుడు పరిణామక్రమముకై పనిచేస్తుంటాడు. వారు ప్రేమ, జ్ఞానమను శక్తులతో పనిచేస్తారు. రూపమునకు దిద్దుబాటు అవసరమైనప్పుడు– అది సౌరకక్ష్యకైనను, గ్రహకక్ష్యకైనను, మానవ కక్ష్యకైనను లేక మానవ నిర్మాణమునకైనను అగస్త్యుడు రంగములోనికి దిగుతాడు. వారి ప్రయోజనము దైవప్రజ్ఞ అను భూతికి క్రొత్త రూప నిర్మాణము చేయుటయే.

దీనిని దృష్టిలో నుంచుకొని అగస్త్య ఆశ్రమము నుండి దిగి వచ్చిన మాస్టర్ C.V.V. గారి పాత్రను చదువుకోవలసి ఉంటుంది.

**మానవ పరిణామము - గురుపరంపర :**

గురుపరంపరలు అంతరిక్ష, సౌర, గ్రహ కక్ష్యలలో ఉంటాయని చూచాము. మానవునిలో మానవ పరిణామమునకై అవి ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకొనుట చాలా ఆసక్తికరముగా ఉంటుంది. ఒకే శక్తి రెండు భిన్న మార్గములలో వెడుతుందని చూచాము. ఒక మార్గములో అది ఖనిజ, వృక్ష, జంతు, మానవ రూపములను ఒక దాని తరువాత ఇంకొకటిగా పరిణామము కల్పిస్తుంది. ఇంకొక మార్గములో శక్తి మనిషిని చేరుతుంది.

మానవుడు ఆకర్షణ, వికర్షణ శక్తులయొక్క సమన్వయ రూపము అని గమనిస్తే అంటే పైనుండి, క్రింది నుండి వచ్చు శక్తులు అతనిలో కలుస్తాయి. కాబట్టి సృష్టిలో ఆకర్షణ, వికర్షణ శక్తులు కలియు చివరి స్థానమగుతాడు.

మనిషిలో ఊర్ధ్వము, అధస్సు రెండూ కలుస్తాయి. ప్రాణము, రూపము సరియైన సమ్మేళనములో కలుస్తాయి. అతడు దైవాంశ. అతడు జంతువుకూడ. అవి రెండు కలిసి మూడవదియైన మనిషి ఏర్పడుచున్నాడు. అది ఒక తల్లి, తండ్రి కలసి ఒక బిడ్డకు జన్మ నిచ్చినట్లే. బిడ్డ ఎలా తల్లితండ్రుల ప్రతిరూపమో, అలాగే అతడు పదార్థ పరమార్థముల యొక్క ప్రతిరూపము. అందుకే మానవుడు పరిపూర్ణమైన సృష్టి. కాబట్టే పవిత్ర గ్రంథములు అన్నీ మనిషిని "భగవంతుడు తన రూపములో తనవలే సృష్టించాడని" తెలుపుతాయి.

అతనిలోని కొన్ని కేంద్రములు రూపమును ఏర్పాటు చేస్తాయి. మిగిలిన కొన్ని కేంద్రములు అతనిలో దైవత్వాన్ని ఉంచుతాయి. అన్ని కేంద్రముల పనియొక్క సమాహారమే మానవుడు. కాబట్టి మానవుడు సమస్థితిలో నున్నట్లయితే, దేవతల కంటే గొప్పవాడుగా పరిగణింపబడతాడు. అతడు భగవంతుని ప్రతిరూపమే కాబట్టి, అతడు చేయలేనిది ఏమీలేదు. దేవతలు భౌతిక కక్ష్యలో పనులు చేయలేరు. వారు భౌతిక కక్ష్యలో నున్న ఎవరి ద్వారానో మాత్రమే చేయగలరు. జంతువులు ఆధ్యాత్మిక కక్ష్యలలో పనిచేయలేవు. మనిషి ఒక్కడే భౌతిక, ఆధ్యాత్మిక కక్ష్యలలో పనిచేయగలడు. మనిషి యొక్క గొప్పతన మేమిటంటే అతడు అన్ని కక్ష్యల లోనూ ఉండగలడు. ఆధ్యాత్మిక వేత్తయొక్క కర్తవ్య మేమిటంటే అతడు పై కేంద్రముల నుండి శక్తిని గ్రహించి, దానిని క్రింది కేంద్రములపై పనిచేయించాలి. మనము క్రింది

కేంద్రములలోనే చిక్కుకొని పోయాము. ఎందుకంటే మన రూపము పరిణామములో ఖనిజము నుండి వృక్షమునకు, వృక్షము నుండి జంతువునకు, జంతువు నుండి మనుష్యునకు చాలా ప్రయాణము చేసి పరిణామము చెందినది.

గుర్తింపు రూపముతో నుండుట బంధమునకు దారి తీస్తుంది. గుర్తింపు మనతో (ఆత్మతో) నుండుట విముక్తిని ఇస్తుంది. గుర్తింపును ఆత్మగా నుంచుకొని, పనికి శరీరమును వినియోగించుట ఉత్తమమైన పద్ధతి.

**మనలోని కేంద్రములు :**

| | | | |
|---|---|---|---|
| 7. | సహస్రారము | : | శిరస్సు పైభాగము |
| 6. | ఆజ్ఞ | : | కనుబొమలు కలసినచోట నున్న కేంద్రము |
| 5. | విశుద్ధి | : | గొంతునందలి కేంద్రము |
| 4. | అనాహతము | : | హృదయ కేంద్రము |
| 3. | మణిపూరకము | : | బొడ్డు నందలి కేంద్రము |
| 2. | స్వాధిష్ఠానము | : | ప్లీహము (spleen)నకు సంబంధించిన కేంద్రము |
| 1. | మూలాధారము | : | వెన్నెముక అడుగు భాగము (root)లోని కేంద్రము |

మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక కేంద్రము లనునవి క్రింది భాగములోని కేంద్రములు.


హృదయ, ఆజ్ఞ, సహస్రార కేంద్రములు పై కేంద్రములు.

గొంతులోని విశుద్ధి అన్నింటినీ కలుపు కేంద్రము.

క్రింది భాగములోని కేంద్రము లన్నియు చెడ్డవి కావు. అవి మన బాహ్యమునకు సంబంధించినవి.

కొంతమంది ఆధ్యాత్మికత పేరుతో పై కేంద్రములపై దృష్టిని ఎక్కువ కేంద్రీకరించి ఆచరణ సాధ్యము కాని భావాలతో ఉంటారు. పైకేంద్రములు, క్రింది కేంద్రములు రెండూ సమాన ప్రాముఖ్యత కలిగినవే.

అవి రెండూ రెండు త్రిభుజములు. అవి ఇలా కలుస్తాయి.




మనలోని క్రింది కేంద్రములు పరిణామక్రమములో ఏర్పడుతాయి. పై కేంద్రములు దైవ కేంద్రమునుండి దిగివస్తాయి. అవి ప్రేమ, జ్ఞానము, ధీశక్తిని సూచిస్తాయి. క్రింది కేంద్రములు, పైకేంద్రముల సూచనలకు అనుగుణముగా పనిచేయునప్పుడు మానవుని పరిణామము పూర్తి అవుతుంది.

మనము ముందు చెప్పుకొన్న రెండు గురుపరంపరలను, ఈ రెండు త్రిభుజములు సూచిస్తాయి. వసిష్ఠుడు పై త్రిభుజమును పరిపాలిస్తే, అగస్త్యుడు క్రింది త్రిభుజాన్ని పరిపాలిస్తాడు. దీనికై గురుపరంపర పాటించు పద్ధతి యేమిటంటే పై కేంద్రముల శక్తిని ఆవాహన చేయుట. అనగా ప్రేమ, జ్ఞానము, ధీశక్తిని ఆవాహన చేయుట. ఇంకొక పద్ధతి క్రింది త్రిభుజమును సరిదిద్ది క్రమపరచుట.

అగస్త్యుడు మూలాధారములోను, వసిష్ఠుడు ఆజ్ఞా కేంద్రము నందు ఉంటారు. అగస్త్యుడు కుండలినిని (ప్రకృతిశక్తి – మనలో నిద్రితమైనట్టి శక్తి) అవసరమైనప్పుడు ప్రచోదనము చేస్తాడు. ఈ కుంభయుగములో కుండలినీ శక్తిని బలముగా ప్రచోదనము చేసి హృదయకేంద్రము వరకు పైకి వచ్చునట్లు చేస్తాడు. దీని అర్థము నాభియందలి జలములు బాష్పీకరణము చెంది, శక్తి హృదయ కేంద్రములోనికి పంపబడుతుంది– కుంభయుగమునకు మూల సూత్రమైన వాయువులోనికి పంపబడుతుంది.

అగస్త్య ఆశ్రమము నుండి దిగివచ్చిన మాస్టర్ C.V.V. సింహరాశిలో సూర్యుడు, కుంభరాశిలో చంద్రుడు ఉండగా జన్మించారు. హిమాలయ గురుపరంపర సింహరాశికి సంకేతము కాగా, అగస్త్యులు కుంభరాశికి సంకేతము. మాస్టర్ C.V.V. గారు పరిణామక్రమమును వేగవంతము చేయుటకు ఒక నిర్దిష్ట ప్రణాళికకై దిగివచ్చారు. మనము C.V.V. నామమును ఉచ్చరించునప్పుడు, మనము రెండు వైపులనుండి పనిచేయు చున్నాము. ఇది

ఏమిటంటే పైనుండి ఆజ్ఞ, విశుద్ధి, హృదయ కేంద్రముల నుండి పనిచేయుట. C.V.V. నామమును ఉచ్చరించునప్పుడు, అగస్త్య ప్రజ్ఞ క్రిందినుండి పైకి పనిచేస్తుంది. కుండలిని ప్రజ్ఞ చాలనము జరిగి, మూలాధారము నుండి ఆజ్ఞ వరకు ఊర్ధ్వమౌతుంది. పైకి వెళ్ళిన ప్రతిసారి 15 నిముషములలో శుద్ధిచేసి అడ్డంకులను తొలగిస్తుంది. దాని వలన లోపల ఒక మార్గము నిర్మాణమౌతుంది. అది పై కేంద్రములను క్రింది కేంద్రములతో కలుపుతుంది. అది శక్తి ప్రవాహము ధారాళముగ పైనుండి క్రిందికి, క్రింది నుండి పైకి వెళ్ళుటకు వీలు కలిగిస్తుంది.

మాస్టర్ C.V.V. గారిని ఆవాహన చేసినప్పుడు పరిణామము వేగవంత మౌతుంది. వ్యక్తిత్వము త్వరగా మారుతుంది. మన పాత కర్మ ఫలితములు పైకి వస్తాయి. మనము లోపలి స్థిరత్వముతో వానిని ఎదుర్కొంటాము. మొత్తము మార్గములో మనకు మార్గ నిర్దేశనము జరిగి మనము రక్షింపబడతాము.

సాధారణముగా మనకు పది సంవత్సరములలో వచ్చు అనుభవమును, ఒక సంవత్సరములోనే పొందుతాము. ఒక జన్మలోనే పది జన్మలు గడుస్తాయి. ప్రజ్ఞా వికాసముయొక్క అనుభూతికై, సంక్షిప్తముగా ఎన్నో సంఘటనలకు తీవ్రముగా గురియౌతాము. అటువంటి సంఘటనల అనుభవము వలననే శరీరము ఎక్కువ సౌలభ్యముతో ఆత్మానుభూతి, భగవత్ సామ్రాజ్యమును పొందగలుగుతుంది.

# 14. కుంభయుగము

*‘‘మనిషికి మరణము లేదు, ఆకలి ఉండదు’’*

కుంభయుగము ప్రారంభము, విక్టోరియా మహారాణి పట్టాభిషిక్తురాలైన సంవత్సరములో మొదలై, 2160వ సంవత్సరము వరకు ఉంటుంది. దాని ఆరంభములో మానవ జాతి వాయువునకు, అంతరిక్షమునకు సంబంధించిన శక్తిని అందుకొనుటను ప్రారంభించినది. మనము దీని ముఖద్వారములో ఉన్నాము.

ఒక సమయములో రాజ్యములను జయించుట గొప్పతనముగా భావింపబడేది. ఆ కాలము అలగ్జాండర్సుకు, నెపోలియన్లకు చెందినది. దానివెంట దేశముల మధ్య సముద్రయానములు ప్రస్ఫుటముగా పెరిగినవి. సముద్రములుదాటి, దూరతీరాల్లో నున్న రాజ్యములను జయించుట గొప్ప విషయముగా భావింపబడేది. ఈ వ్యక్తిత్వ శైలితో కూడిన మార్గమును ఎక్కువగా అవలంబించిన వానిలో గ్రేట్ బ్రిటన్ ముఖ్యమైనది. అది “సముద్రమునకు నిస్సందేహమైన యజమానురాలి” గుర్తింపును పొంది, వలస మార్గములో దేశములను జయించుటలో నిపుణత సాధించింది.

నీరు అనునది మిగిలిన విషయములలో భావోద్వేగమును తెలియజేస్తుంది. పరిశుద్ధమైన జీవ జలము స్వచ్ఛమైన భావాన్ని తెలియజేస్తుంది. పరిణామక్రమములో భావోద్వేగములను అధిగమించనిదే పురోగతి ఉండదు. ముందు నడచిన మీన యుగములో జలము ముఖ్యమైన మూలకము. జలము తరువాత వేదిక (అగ్ని ద్వారా) వాయువు– కుంభయుగమునకు సంబంధించిన మూలకము. అగ్ని మార్పుకు సంబంధించినది. మురికితోకూడిన జలములను భావోద్వేగములు అగ్నితో మరిగించబడి, నీటి ఆవిరియై, ఆకాశములో పరిశుద్ధ జలములగుట, కుంభతత్త్వముగా సూచింపబడు చున్నది.

రాజ్యములను జయించుట నిష్ప్రయోజనమని గుర్తించి, దానిని ఆపివేయదలచిన మొదటి రాణి విక్టోరియా. ఆమె ద్వారా రాజ్య విస్తరణ వాదమునకు ఒక విఘ్నము వచ్చినది.

దీనికి సంబంధించి 1900 నుండి 1910 వరకు గల సంవత్సరములు ముఖ్యమైనవి. ఈ సంవత్సరములలో కొన్ని ప్రత్యేక శక్తులను అందుకొన్నది. అది ఒక తోకచుక్కకు సంబంధించిన కాలము. తోకచుక్క అగ్నితో కూడిన శరీరము కలిగి ఉంటుంది. అటువంటి అగ్నితోకూడిన శరీరము గలవి అంతరిక్ష కేంద్రము నుండి ఒక లక్ష్యముతో బయలుదేరుతాయి. వాని లక్ష్యము గొప్ప తపోధనులకు మాత్రమే తెలుస్తుంది. అది విశ్వాగ్నితో కూడిన సుడిగుండము. దాని కేంద్రములో చక్రాకారములో తిరుగు సుడులు ఉంటాయి. అవి చివరి వృత్తమునకు వచ్చుసరికి, దాని

నుండి వెలువడిన అగ్నిజ్వాలలు అంతరిక్షములో చాలా దిక్కులకు వ్యాపిస్తాయి. ఈ అగ్నిజ్వాలలే సూర్యగోళములై, కాలక్రమములో ప్రతి సూర్యగోళము తన సూర్యమండలమును తయారు చేసుకుంటుంది. తోకచుక్కలు కూడా అదే కేంద్రము నుండి వస్తాయి. అవి ఏ గోళములుగాను, మండలములుగాను ఏర్పడవు. అవి సూర్య మండలములో ఇప్పటికినీ అర్థము చేసుకొనబడని ఒక పద్ధతిలో తిరుగుతుంటాయి.

హేలీ అనబడు తోకచుక్క యొక్క తోక మన భూమిని 1910 వ సంవత్సరములో స్పృశించింది. కుంభకోణములో నున్న, కుంభయుగ గురువైన మాస్టర్ C.V.V. గారు దాని శక్తిని అందుకున్నారు. 'కోణము' అన్న పదము కోణాన్ని (angleను), 'కుంభ' అను పదము కుంభరాశిని (నీటితో నున్న కడవ) సూచిస్తుంది. ఆ కడవ పైనుండి దిగివచ్చు జీవ జలముతో నిండి ఉంటుంది. వారు ఈ జీవ జలములను మొదట వృక్షజాతికి అందించారు. దానితో వృక్షములను ఆహారముగా తీసుకొను జంతువులు, మనుష్యులకు ఆ జీవశక్తి పరిచయమౌతుంది .

తోకచుక్క రాకతో విమానయానము ప్రారంభమైనది. రైట్ సోదరులు విమానమును 1910 లో కనుగొన్నారు. అది పదార్థము నుండి విముక్తి నిచ్చి, గ్రహాంతరయానమునకు బీజములు నాటినది.

తక్కువ బరువు అనునది ఈ యుగము యొక్క ముఖ్య సూత్రమైనది. మనము ఉపయోగించు లోహములలో ఇది దర్శింప

బడినది. కంచు, ఇత్తడి, ఇనుము అను లోహముల స్థానములో అల్యూమినియం, లోహ మిశ్రమములు, ప్లాస్టిక్, గాజు అనునవి వచ్చినవి.

'చిన్నది అందమైనది' అను భావము వ్యాపించినది. గృహ నిర్మాణములో విప్లవాత్మక మార్పులు వచ్చినవి. బరువైన రాతితో నిర్మింపబడిన విశాలమైన భవనముల స్థానములో, తేలికైన పదార్థములతో నిర్మింపబడిన చిన్న ఫ్లాట్స్ వచ్చినవి.

దుస్తులకై వాడబడు బట్టలో మార్పులు వచ్చినవి. మన పూర్వీకులు భుజించిన ఆహారము కంటే మనకు లభించు ఆహారము తేలికైనది. ప్రజలు శాకాహారము వైపునకు మొగ్గుచూపుట మొదలైనది. మానవుడు రాబోవు కాలములో తక్కువగా భుజించి, అతని శరీరము తేలిక పడుతుంది. కుంభయుగ చైతన్యము వృక్ష జాతిని స్పృశించుట వలన, భుజించిన ప్రతిసారీ మానవుడు కుంభ చైతన్యమును తీసుకొనుచున్నాడు. ఈ భూగ్రహముపై కుంభయుగము ఇది మొదటిది కాదు, చివరిదీ కాబోదు.

మునుపటి కుంభయుగములో మానవులకు ఎలా ఎగరాలో తెలియును. విమానములలోనేకాదు. మనుషులూ అలా ఎగిరేవారు. అది మరలా జరుగుతుంది. మాస్టరుగారు 21వ శతాబ్దంలో మరల ఎగురుతారని తెలిపారు. సూపర్ మాన్ అన్న భావన నిజమౌతుంది.

కుంభ చైతన్యము మనిషి భావములపై, మనసుపై

పనిచేయు చున్నది. విభేదములు ఇంకనూ ఉన్నప్పటికీ, మానవ జాతియంతయు ఒక సామ్రాజ్యముగ, ఒకే జీవనముగా అంగీకరింపబడుట మొదలగుచున్నది. మానవజాతి అవగాహన ఒక పద్ధతి ప్రకారము కుంభ చైతన్యముతో సమన్వయం పొందు తుందని మాస్టరుగారు తెలిపారు. వర్గపరముగా, మతపరముగా, ఖండముల పరముగా గల హద్దులు ముక్కలై చెరిగిపోతాయని, హద్దులు ఉండవని మాస్టరుగారు తెలిపారు. బెర్లిన్ గోడ పతనము, రష్యా ముక్కలగుట, తూర్పు యూరోప్‌లో వచ్చిన పెనుమార్పులు, యూరోపియన్ ఎకనామిక్ కమ్యూనిటి అవతరణ అన్నీ ఈ మార్గములోని సంఘటనలే.

ఈ నవ చైతన్యము పురాతనముగా నున్న మంచిని చెరిపి వేయదుకానీ మనకు పనికిరానిది అంతయు తొలగిస్తుంది. అంతటినీ ఒక జీవనముగా కేంద్రీకరించుటకై అది పనిచేస్తుంది. ఆ ఒకే జీవనము పట్ల అంగీకారము కలవారందరూ ఐక్య జీవనముపట్ల మొగ్గు చూపుతారు. దానిని అంగీకరించనివారు, దానిని అడ్డుకొనువారు బాధాకరమైన పద్ధతిలో త్రోవకు తేబడుతారు. "పంచుట లేక విరచుట" అనునది ఈ శక్తి యొక్క ముఖ్య లక్షణము. మనము 21వ శతాబ్దములోనికి అడుగు పెట్టేసరికి, మానవజాతి శతాబ్దముల తరబడి పోగేసుకున్న ఋణాత్మక శక్తి తుడిచి వేయబడుతుంది. శతాబ్దముల తరబడి మనుషులు గొప్పతన మను లక్షణమును గుర్తించేవారు. మంచి తనమను లక్షణము దాని స్థానమును గ్రహిస్తుంది.

మానవుని భౌతిక, మానసిక, భావమయ శరీరములను తేలిక పరచుటకు చాలా వరకు పని జరుగుచున్నది. కుంభ యుగమునకు సంబంధించిన ఈథర్‌తో కూడిన సూక్ష్మ శరీర నిర్మాణమునకై ప్రయత్నము జరుగుచున్నది. జీవనములో ఏకత్వము సాధించు పద్ధతి, సేవ చేయుట అను పద్ధతిలో సూక్ష్మశరీరము నిర్మించ బడుతుంది. మనిషి మృత్యువును దాటగలుగుతాడు. మానవుడు సూక్ష్మశరీరములో ఉంటూ అవసరాన్ని బట్టి భౌతిక శరీరము తీసుకొనుట / వదలివేయుట ఇచ్ఛనుబట్టి చేయగలుగుతాడు.

తేలికైన శరీర నిర్మాణము అనునది సమన్వయ శక్తి యొక్క ముఖ్య ప్రణాళిక. మొత్తము జీవజాలము ఈ ప్రణాళికకు అనుగుణముగా మార్చబడు చున్నవి. ఆ మార్పుకు అంగీకరించు వారి కందరికి శనియొక్క క్రమశిక్షణ మొదట ఇవ్వబడుతుంది. యురేనస్ క్రమశిక్షణలోని రెండవభాగాన్ని ఇవ్వగా, ప్లూటో మూడవ భాగాన్ని ఇస్తాడు. దీనితో మార్పు కార్యక్రమము "వంచుట/ విరచుట" ద్వారా పూర్తవుతుంది.

ఈ భూమిపై మరణము లేకుండా చూచుట, మొత్తము కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశ్యమై ఉన్నది. సమన్వయ శక్తిని అందుకొన్న మాస్టర్ C.V.V. గారు "ది హిందూ" దిన పత్రికలో ఇచ్చిన ప్రకటనను మనము జ్ఞప్తికి తెచ్చుకోవాలి. వారి ప్రకటన

*"చావకూడదు అని తలచేవారు, నన్ను సంప్రదించండి."*

మాస్టరుగారు ఈ శక్తి తాను జన్మించిన సంవత్సరము నుండి

ఒక్కొక్కసారి 60 సంవత్సరముల వ్యవధిలో నాలుగు సార్లు(240 సంవత్సరములు) ఈ భూమిపై పనిచేస్తుందని తెలిపారు.

**భౌగోళిక సంఘటనలు :**

భూమికి సమన్వయ శక్తియొక్క అవతరణ ఫలితముగా కలిగిన కొన్ని మార్పులు. ఇది మొత్తము మార్పుల పట్టీగా భావింప నవసరము లేదు.

**1867-1926 :**

1869– సూయజ్ కెనాల్ తెరువబడుట
1877– భారత దేశమునకు విక్టోరియా మహారాణిగా తెలుపబడుట
1886– కొలంబియా రిపబ్లిక్
1894– చైనా పై జపాన్ యుద్ధము
1901– ఆస్ట్రేలియన్ కామన్ వెల్త్ ప్రారంభము
1904 –రష్యా–జపాన్ యుద్ధ ఆరంభము
1905– రష్యా–జపాన్ యుద్ధ ముగింపు
1907– ప్రపంచ స్కౌట్ ఉద్యమ ప్రారంభము
1912– చైనా రిపబ్లిక్ అగుట
1914– మొదటి ప్రపంచ యుద్ధ ఆరంభము
1917– రష్యా విప్లవము
– బాలఫర్ ప్రకటన

1918– మొదటి ప్రపంచయుద్ధ ముగింపు

– జర్మన్ రిపబ్లిక్ ప్రారంభము

1919– వెరాసెల్లిస్ ఒప్పందముపై సంతకములు

– ఇంటర్ నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రారంభము

1920– రెడ్ క్రాస్ ప్రారంభము

– లీగ్ ఆఫ్ నేషన్స్ స్థాపన

1923– టర్కిష్ రిపబ్లిక్ ప్రారంభము

1926– కామన్ వెల్త్ ఆఫ్ నేషన్స్ ఏర్పాటు

**1927-1987 :**

1932– ఇంటర్ నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ ఏర్పాటు

1939– రెండవ ప్రపంచ యుద్ధ ఆరంభము

– గౌటెమాలా స్వాతంత్ర్యము

1945– రెండవ ప్రపంచ యుద్ధ ముగింపు

– ది యునైటెడ్ నేషన్స్

– ది ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్

– ది ఇంటర్ నేషనల్ మానెటరి ఫండ్

– ది యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్ సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్

– ది ఇంటర్ నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ఆరంభమైనాయి.

1946– యు ఎన్ అసెంబ్లీ మొదటి సెషన్

– ది ఇంటర్నేషనల్ బాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్

– ది యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ స్థాపించబడ్డాయి.

1947– భారత స్వాతంత్ర్యము

– పాకిస్థాన్ స్వాతంత్ర్యము

1948– ఇజ్రాయిల్ ఆవిర్భావము

– సిలోన్ స్వాతంత్ర్యము

– ది జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్ పై సంతకము

– ది యూనివర్సల్ పోస్టల్ యూనియన్ స్థాపించబడింది

– ది వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ స్థాపించబడింది

1949– పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ప్రకటించబడింది

– ది నార్త్ అట్లాంటిక్ ట్రీటి ఆర్గనైజేషన్ స్థాపించబడింది

– ఇండోనేషియా స్వాతంత్ర్యము

– జర్మన్ డెమోక్రాటిక్ రిపబ్లిక్  మరియు ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ స్థాపించబడ్డాయి

1951– లిబియా స్వాతంత్ర్యము

1952– యునైటెడ్ అరబ్ రిపబ్లిక్ స్థాపించబడింది

1954– ది సౌత్ ఈస్ట్ ఏషియాట్రీటి స్థాపన

1955– ది వార్సా పాక్ట్ సంతకము
1957– ది ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజన్సీ స్థాపన
– యూరోపియన్ ఎకనామిక్ కమ్యూనిటీ స్థాపన
1959– క్యూబా తిరుగుబాటు
– ది సెంట్రల్ ట్రీటి ఆర్గనైజేషన్ స్థాపన
1960 –కామెరూన్ స్వాతంత్ర్యము
–చాద్ స్వాతంత్ర్యము
– సైప్రస్ స్వాతంత్ర్యము
– ఘన రిపబ్లిక్ అగుట
– వియత్నామ్ యుద్ధము
1961– సౌత్ ఆఫ్రికా రిపబ్లిక్ అగుట
– కాన్ఫరెన్స్ ఆఫ్ నాన్ అలైన్డ్ నేషన్స్
1962– ది ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్ స్థాపన
– అల్జీరియా రిపబ్లిక్ అగుట
– ఇండియాపై చైనా దాడి
– క్యూబా సంక్షోభము
– అష్టగ్రహ కూటమి
1963– ది ఆర్గనైజేషన్ ఆఫ్ యూనిటీ స్థాపన
– నైజీరియా స్వాతంత్ర్యము
1964– ది యునైటెడ్ నేషన్స్ కాన్ఫరన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డవలప్‌మెంట్ ప్రారంభము

– ది గ్రూప్ 77 స్థాపన

1966– ది ఏషియన్ డవలప్‌మెంట్ బాంక్ స్థాపన

1967 –అరబ్–ఇజ్రాయిల్ యుద్ధము

1968– జెకోస్లవేకియాపై సోవియట్
యూనియన్ దండయాత్ర

1970– తూర్పు పాకిస్థాన్‌లో ఉప్పెన

1971– బంగ్లాదేశ్ స్వాతంత్ర్యము

– బెహ్రాయిన్ స్వాతంత్ర్యము

1973– బ్రిటన్ యూరోపియన్ కామన్ మార్కెట్లో చేరుట

1975– అంగోలా స్వాతంత్ర్యము

– లావోస్ రిపబ్లిక్ అగుట

– వియత్నామ్ యుద్ధ సమాప్తి

1979– ఇరాన్ విప్లవము

1980– ఆఫ్ఘనిస్తాన్ పై సోవియట్ ఆక్రమణ

– ఇరాన్–ఇరాక్ యుద్ధము

1982– సౌత్–సౌత్ కాన్ఫెరన్స్

– ఫాక్‌లాండ్స్ పై అర్జెంటీనా దురాక్రమణ

– ఫాక్‌లాండ్స్‌ను బ్రిటన్ తిరిగి వశపరచుకొనుట

– సూర్యునికి ఒకేవైపు 9 గ్రహములు కూడుట

1984– ఎథియోపియా కరువు

– భోపాల్ గాస్ దుర్ఘటన

**1987 నుండి :**

1988- ఇరాన్-ఇరాక్ యుద్ధ సమాప్తి
- ఆర్మేనియా భూకంపము
- చెర్నోబిల్ అణు దుర్ఘటన

1989- ఆఫ్ఘనిస్తాన్ నుండి సోవియట్‌ల ఉపసంహరణ
- తయాన్ మిన్ స్క్వేర్ (బీజింగ్)ఊచకోత
- రొమేనియా, జెకోస్లవేకియా, పోలెండ్, తూర్పు జర్మనీ, హంగేరీలలో కమ్యూనిస్ట్ పరిపాలన పరిసమాప్తి
- బెర్లిన్ గోడ పగులగొట్ట బడుట

1990- ఇరాన్ భూకంపము
- జర్మనీ విభాగములు తిరిగి కలియుట
- సోవియట్ రష్యాలో కమ్యూనిస్ట్ పరిపాలన సమాప్తి
- కువైట్‌పై ఇరాక్ దండయాత్ర
- G15 స్థాపన

1991- U.S.S.R. విచ్ఛిన్న మగుట
- కువైట్ స్వతంత్రమగుట
- గల్ఫ్ యుద్ధ పరిసమాప్తి
- వార్సా ఒప్పందమును విసర్జించుట
- బంగ్లాదేశ్ తుఫాను

1992– కోల్డ్ వార్ పరిసమాప్తి
– వర్ణ వివక్షకు వ్యతిరేకముగా సౌత్ ఆఫ్రికాలోని తెల్లవారు ఓటువేయుట
– రష్యా, మిగిలిన సోవియట్ రిపబ్లిక్లు I M F మరియు ప్రపంచబాంక్ లో చేరుట
– ప్రపంచ శిఖరాగ్ర సమావేశము– రియో డి జనీరియో
– సోమాలియాలో కరువు – ప్రపంచ దేశముల సహాయము

(1992 వరకు జరిగిన సంఘటనలు తెలుపబడ్డాయి)

**శాస్త్రపరమైన సంఘటనలు :**

**1867-1926 :**

1867– కాగితము
– ఏంటిసెప్టిక్స్
– డైనమైట్

1868– టైప్ రైటర్

1869– పీరియాడిక్ టేబుల్ ఆఫ్ ఎలిమెంట్స్

1872– బాక్టీరియాలజీ కనుగొనుట

1875– ట్రీటి ఆఫ్ మెట్రే

1876– టెలిఫోన్

1877– కలరా,T.B. సూక్ష్మక్రిములను కనుగొనుట

1879– విద్యుత్ బల్బ్, కార్బన్ ఫిలమెంట్

1882– మొదటి జలవిద్యుత్ కేంద్రము
1884– ఫాగోసైట్స్ – ఇన్ఫెక్షన్‌తో పోరాడు
తెల్లకణములను కనుగొనుట
– గణితములో సెట్ థియరీ
1887– గాసొలీన్ తో నడచు వాహనములు
1891– జలాంతర్గామి
1892– కలర్ ఫోటోగ్రాఫ్
1894– అడ్రినాలిన్ –మొదటి హార్మోన్ కనుగొనుట
1895– వైర్లెస్ టెలిగ్రఫీ
– సినిమాటోగ్రాఫ్
– X–Ray
1897– డీజిల్  యింజిన్
1898– రేడియం
1899– టేప్ రికార్డర్
1900– ది క్వాంటమ్ హైపోథిసెస్
– సైకోఅనాలిసిస్
1901– ట్రాన్స్మిషన్  ఆఫ్ ఎలెక్ట్రో –మాగ్నెటిక్ వేవ్స్
ఎక్రాస్  ది అట్లాంటిక్
1903– మొదటి ఫ్లైట్
– ఎలెక్ట్రో కార్డియోగ్రాఫ్
1905– పదార్థము శక్తిగా మారుట
– స్పెషల్ థియరీ ఆఫ్ రిలెటివిటీ

1906– ప్లాస్టిక్స్
1907– హెలికాప్టర్
1911– సూపర్ కండక్టివిటీ
1912– విటమినులను కనుగొనుట
1913– నీల్ బోర్ అటామిక్ మోడల్
1914– స్టెయిన్‌లెస్ స్టీల్
1915– ది జనరల్ థియరీ ఆఫ్ రిలేటివిటీ
1919– అణు విచ్ఛేదన
1922– మధుమేహ వైద్యమునకు ఇన్సులిన్
1924– వేవ్ మెకానిక్స్/అటామిక్ థియరీ
1926– కండిషన్డ్ రిఫ్లెక్సెస్ /బయాలజీ
– క్వాంటమ్ మెకానిక్స్/ అటామిక్ థియరీ
– టెలివిజన్

**1927-1987 :**

1927– మాటలాడు చిత్రము
1928– పెన్సిలిన్ కనుగొనుట
1929– రాకెట్ ఇంజన్
1930– జెట్ ఇంజన్
1931– రేడియో టెలిస్కోప్
1935– రాడార్
1938– నైలాన్
– న్యూక్లియర్ ఫిషన్ ఆఫ్ యురేనియం

1939– ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్

1940– కలర్ టెలివిజన్

1942– మొదటి న్యూక్లియర్ రియాక్టర్

1944– DNA యాజ్ జెనిటిక్ మెటీరియల్

1945– న్యూక్లియర్ ఫిషన్ బాంబ్

1946– ఎలక్ట్రానిక్ కంప్యూటర్

1947– కార్బన్– 14 డేటింగ్

– సూపర్ సానిక్ ఫ్లైట్

1948– ట్రాన్సిస్టర్

– లాంగ్ ప్లేయింగ్ రికార్డ్స్

1952– న్యూక్లియర్ ఫ్యూజన్ బాంబ్

1953– స్ట్రక్చర్ ఆఫ్ D N A

– హార్ట్–లంగ్ యంత్రము

1954– కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్

– రోబోట్స్

– ఓరల్ కాంట్రాసెప్టివ్స్

1957– మానవ నిర్మిత శాటిలైట్ కక్ష్యలోనికి వెళ్ళుట

1958– ఫోటో కాపీయింగ్

1960– వాతావరణ సూచనలిచ్చు ఉపగ్రహములు

1961– మనిషి అంతరిక్షము లోనికి వెళ్ళుట

1962– కమ్యూనికేషన్ ఉపగ్రహములు

1965– స్పేస్ వాక్

1967– హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్

1969– చంద్రునిపై వ్యోమగామి

1972– కాట్ స్కాన్

1975– AIDS వైరస్‌ను కనుగొనుట

– సింథటిక్ జీన్

1978– టెస్ట్ ట్యూబ్ బేబీ

**ఆధ్యాత్మిక సంఘటనలు :**

**1867-1926 :**

1872– శ్రీ అరవిందులవారి జననం

1875– ది థియొసాఫికల్ సొసైటి ఆవిర్భావం

1879– భగవాన్ రమణ మహర్షుల జననం

1883– ఖలీల్ జిబ్రాన్ జననం

1883– ది సీక్రెట్ డాక్ట్రిన్

1893– పరమహంస యోగానంద జననం

– స్వామి వివేకానంద చికాగో ఉపన్యాసము

1895– జిడ్డు కృష్ణమూర్తిగారి జననం

1896– స్వామి ప్రభుపాదగారి జననం

1909– రామకృష్ణమఠ స్థాపన

1917– మహేష్ యోగి గారి జననం

1918– U.G. కృష్ణమూర్తి గారి జననం

1919– మాస్టర్ జ్వాల్‌కూల్ / ఏలిస్ ఎ బెయిలి ద్వారా ఆధునిక యుగమునకు సంబంధించిన జ్ఞానము అందింపబడుట

– ది లూసిస్ ట్రస్ట్ స్థాపన

1920– పరమహంస యోగానందగారి అమెరికా యాత్ర

1926– మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల (E.K.) గారి జననం

– శ్రీ సత్య సాయిబాబా గారి జననం

– అడ్వెంట్ ఆఫ్ 'ది ప్రొఫెట్'

**1927-1987 :**

1931– రజనీష్ గారి జననం

1945– మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్ గారి జననం

1966– ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాంక్షస్‌నెస్ స్థాపన

1971– ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ స్థాపన

1972– మాస్టర్ E.K. గారి యూరప్ యాత్ర.

# 15. యోగావతరణము

*"ముఖ్య ప్రాణము"*

ప్రతి అవతారము యొక్క ప్రయోజనము భూమికి వెలుగు నిచ్చుటయే. వారు కేవలము మానవులకోసమే దిగిరారు. అట్టివారు దిగివచ్చినప్పుడు ఖనిజ, వృక్ష, జంతుజాలములు కూడా పులకిస్తాయి. మూలము నుండి ఒక అసలైన తత్వము దిగివచ్చినప్పుడు, ఒక సంపూర్ణమైన అవతారము దిగివచ్చినప్పుడు, ఒక క్రొత్త శక్తిని, నూతనత్వమును అందుకొనుటవలన అటువంటి పులకింత కలుగుతుంది. ఆ దిగివచ్చుట ఎప్పుడు పూర్తి అవుతుం దంటే , ఆ శక్తి సమస్త జీవకోటికి విజయవంతముగా పంచబడాలి. దీనిని సాధ్యము చేయుటకై ఆ మూలతత్వము, ఒక గొప్ప ఆత్మగా ఒక మనిషి రూపములో దిగివస్తుంది. ఆ శక్తిని అలవరచుకొని, దానితో బాగా పరిశ్రమచేసి, తగు విధముగా పంచుతారు. ఇందుకై ఆ మూలము ఒక మనిషి రూపాన్ని ఎంచుకుంటుంది. మొత్తము సృష్టిలో మానవుని కొక్కనికే అన్ని కక్ష్యలలోనూ ఒకే సారి ఉండగలుగుట సాధ్యమౌతుందని తెలుపుటకే ఆ శక్తి మానవ రూపాన్ని ఎంచుకుంటుంది. ఒక అవతారమూర్తికి ఆ శక్తిని అందుకొనుట నిజముగా సాధ్యమేనని ప్రదర్శన చేయుటకే, మానవజన్మకు అంతిమ లక్ష్యముగా దానిని చూపిస్తుంది.

ఈ కుంభయుగములో దిగివచ్చినది సమన్వయ శక్తియే. మానవ రూపములో అదిగా దిగివచ్చినవారే మాస్టర్ C.V.V. అని పిలువబడ్డారు.

అట్టి సమన్వయ శక్తిని మాస్టరుగారు ఎలా అందుకొని పంచారో సంక్షిప్తముగా గుర్తు తెచ్చుకొనుట ఆసక్తికరముగా వుంటుంది.

1. వారు మానవునిగా జీవిస్తూ వైభవోపేతమైన, పరిపూర్ణమైన జీవితాన్ని నడిపారు.
2. జ్ఞానము ఆధారముగా వారు శబ్దముతో పరిశోధనలకు తయారైన విధానము.
3. ముందే ఏర్పాటు చేయబడిన విధముగా 'హేలీ' తోకచుక్క వారిని కుంభకోణములో స్పృశించినప్పుడు, శక్తిని అందుకొన్న విధానము.
4. ఆ శక్తిని ఇముడ్చుకొనుటకే జరిపిన ప్రయోగములు.
5. ఆ శక్తిని మొదట ఖనిజములకు, వృక్షములకు పంచి పెట్టుట, వానినుండి జంతువులు, మనుషులు సులభముగా అలవాటుపడుట.
6. తనంతటతాను ఆజ్ఞ, సహస్రారములకు చేరలేక పోవుటకు మనిషి నిర్మాణములోగల సమస్యలు గుర్తించుట, మనిషి వ్యక్తిగత కక్ష్యలోనికి పీనియల్ గ్రంథి దిగలేక పోవుట. తరువాత మానవుని నమూనా సరిదిద్దుటకు వారి

ప్రయత్నము 'పిట్యూటరీ హింట్' మరియు 'హయ్యర్ బ్రిడ్జ్ బిగినింగ్'.


7. ముఖ్యముగా శని, శుక్ర గ్రహములను, ఇతర గ్రహములతో వారు చేసిన పనులు.

8. చావు, ఆకలిని తుడిచిపెట్టుటకై వారిచ్చిన ముఖ్యమైన వాగ్దానములు.


9. వారి 'నార్మల్ టెంపర్మెంట్'.

1868వ సంవత్సరము నుండి మనము భూమిపై చూచుచున్న దంతయూ త్వరితగతిని జరుగుచున్న మార్పులు. అవి అన్నియూ గ్రంథస్తము చేయు మాట ప్రక్కన పెడితే, గమనించుటకు వీలు లేనంత వేగముగా జరుగుచున్నవి. ప్రతి క్షణము చారిత్రాత్మకమైనదే.


మాస్టరుగారు తాము అందుకొన్న గొప్ప శక్తిని 'ముఖ్య ప్రాణము' అని తెలిపారు. దానిలో సగభాగము హిమాలయములకు అందింపబడినది. గురుపరంపర రెండు త్రిభుజములుగా ఏర్పడి దానిని అందుకొన్నది. దానిలో మొదటిది నియంత్రించు త్రిభుజము.



రెండవది నవీనయుగ బోధనా త్రిభుజము.




ఇది ప్రాచీన సూత్రములలో తెలుపబడిన పద్ధతి. దాని కేంద్రకము 6 కోణములతో నుండి, ఏడవది మొత్తమునకు కేంద్రముగా ఉంటుంది. బృందము లన్నియూ, భూమిపై ఇలా తయారుకావలసి ఉంటుంది. అలా చక్కగా తయారైన బృందములు కలిసి కార్యక్రమమును వ్యాప్తి కావించవలసి ఉంటుంది.



అలా చక్కగా తయారై మాస్టరుగారి శక్తి ప్రవాహము మానవులలో గొప్పవారి ద్వారా మిక్కిలి సులభముగా ప్రవహించ సాగినది. కొంతమంది ఔత్సాహికులు మాస్టరుగారు ఏ కిరణమునకు, ఏ వర్ణమునకు చెందినవారో తెలుసుకొనవలయు ననుకొనిరి. అన్ని వర్ణములకు మూలమైన సూర్యుని వర్ణమును ఏమనగలము? మాస్టరుగారిని ఒక చక్రమునకు పరిమితము చేయుట అసంభవము. అటువంటి అత్యుత్సాహముతో కూడిన పరిశ్రమ వ్యర్థము. మనము గుర్తుంచుకొనవలసిన విషయము ఏమిటంటే సమన్వయ శక్తిలో అన్ని వర్ణములు, అన్ని శబ్దములు ఉన్నవి. దాని మూలము కాబట్టి, అది అన్నింటినీ అవసరమును బట్టి వ్యక్తిగతముగా కాని, బృందముగాకాని ఉద్దీపన చేయగలదు.

"ఇనీషియేషన్ – హ్యూమన్ అండ్ సోలార్" అను ఒక గ్రంథములో మాస్టర్ జ్వాల్‌కూల్ గారు ఏలిస్ ఎ బెయిలీ ద్వారా దీనిని గురించి ప్రస్తావించుట ఆసక్తికరమైన విషయము. ఏలిస్ ఎ బెయిలీ ద్వారా తెలిపిన అన్ని గ్రంథములలో మాస్టర్ జ్వాల్ కూల్ గారు దీనిని ఉటంకిస్తూ, దానిలోని ముఖ్యోద్దేశములైన అమరత్వము, సూక్ష్మ శరీరము, మరణము, శబ్దము వంటి వానిని గూర్చి తెలిపారు.

మాస్టరుగారి యోగములోని భౌతిక అమరత్వము అనునది ఇంకనూ సరిగా అర్థము చేసుకొనబడలేదు. భౌతికము అనునది కేవలము మనకు తెలిసిన భౌతిక శరీరము కాదు. కాంతికూడ భౌతికమే– చాలా సూక్ష్మమైన పదార్థము. భౌతిక అమరత్వము

అనుటలో మాస్టరుగారి ఉద్దేశ్యము– రూపము లన్నింటికీ మూలము ఈథర్ అనియు, మానవులు సులభముగా ఈథర్‌తో సూక్ష్మ శరీర నిర్మాణము చేసుకొందురనియు, అందువలన జీవన గమ్యమునకు కొనసాగింపు ఉంటుందని అర్థము. ఇప్పటికీ సిద్ధ పురుషులకు ఇలా ఉంటే, భవిష్యత్తులో చాలామంది మానవులకు ఇది సాధ్యమౌతుంది.

ఈ శక్తిని పంచుటకు మాస్టరుగారు 1000 మంది వాహికలను తయారుచేసి పంపుటకు సంకల్పించారు. వారు దానిని అంచెలంచెలలో ద్విగుణీకృతము చేస్తూ చాలా త్వరగా రెండంచెలలో 10 లక్షల మంది వాహికలను తయారుచేస్తానని తెలిపారు. దీనితో నూతన శక బృందములు ఐరోపాలోనూ, అమెరికాలోనూ ఈ మార్గములో శిక్షణ నిచ్చుటకు తయారైనాయి.

"నీవు హద్దులను అధిగమించుతావు" అని మాస్టరుగారు తెలిపారు. మీరు స్వయముగా విధించుకొన్న హద్దులను అధిగమిస్తారు అని తెలుపుటలో ముఖ్యోద్దేశము వ్యక్తిగత ప్రజ్ఞ నుండి బయటపడి బృందప్రజ్ఞ లోనికి ఎదుగుట తెలిపిన విషయ సంగ్రహమే వారు. వారు బృంద ప్రజ్ఞను సూచించి, ప్రదర్శించి చూపారు.

మనము బృంద ప్రజ్ఞలోనికి ఉద్ధరణ చెందుటకు, C.V.V. అని వారిచ్చిన శబ్దముద్వారా మనము ఆవాహన చేసుకొన వలయునని సూచించారు. వారు తాము అందుకొన్న శక్తిని

మాస్టర్ అని తెలిపి తాను దానికి ఒక వాహికగా భావించారు. ఆ శక్తిని అందుకొన్న తరువాత వారు ఇచ్చిన మొదటి మంత్రము "నమస్కారమ్స్ మాస్టర్". వారు దేహాన్ని వదలడానికి ఒక సంవత్సరము ముందు, వారు ఆ మంత్రమునకు C.V.V. అను అక్షరములను జతపరచమని ఆదేశించారు.

* మంత్రము శబ్దముతో కూడిన సూత్రము.
* యంత్రము సూత్రమును సూచించు ఒక చిహ్నము.
* తంత్రము శబ్దము చిహ్నముపై ఆపాదించు శాస్త్రీయమైన పద్ధతి.

కావున మాస్టరుగారు సూచించినట్లు C.V.V. అనునది మంత్రము, మనమే ఒక యంత్రము, శక్తిని ఆవాహన చేయుటయే తంత్రము. సూచించిన కాలమునకు దానిని ఆచరించుట కాలచక్ర తంత్రము– అదియే సమర్ధమైన తంత్రము.

"నేను చేసిన పనిని గురించి తెలుసుకొనుటకు నేను జన్మించిన సంవత్సరము నుండి కనీసము 240 సంవత్సరములు పడుతుంది" అని మాస్టరుగారు తెలిపారు. అది 2108 AD సంవత్సర మౌతుంది.

దిగివచ్చిన శక్తియే మాస్టర్ అని పిలువబడు చున్నది. మాస్టర్ C.V.V. గారు ఆ శక్తికి ఒక మాధ్యమము లేక వాహిక. మాస్టర్ D.K. గారు ఆ శక్తికి ఇచ్చిన పేరు 'అవతార్

ఆఫ్ సింథసిస్'. అవతార్ ఆఫ్ సింథసిస్, సిరియస్ (శారమేయ మండలము లేక డాగ్ స్టార్), సింహ – కుంభరాశుల అక్షము ద్వారా కుంభకోణములో నీలగిరులలోని మాస్టర్ ద్వారా దిగివచ్చి, ఆంతరంగిక పాలకులైన గురుపరంపర ద్వారా తనకు తానే విస్తరించి హిమాలయములు కేంద్రముగా పనిచేస్తుంది.

ఈ దిగివచ్చిన శక్తి ఫలితముగా పొందిక, కలయిక, ఐక్యత వస్తాయి. చక్కని అవగాహన, క్రియల ద్వారా, మానవులలోని అవివేకము, స్వార్థము, వేరుగా నుండుట అను భావములు తొలగింపబడతాయి.

ఈ భూమిపై మానవుల క్రియాశీలత పతాక స్థాయికి చేరింది. స్వార్థపూరితమైన ప్రచారములు, వర్గభేదములు, పాక్షిక సత్యములైన మతముల మూఢ ప్రచారములు, జాత్యహంకార పక్షపాత ధోరణులు, ధనికులు, బలవంతులు బలహీనులను, అమాయకులను దోపిడీ చేయుట, ఈ అవతరణమునకు దారితీసింది.

## జరుగవలసిన కార్యక్రమము :

సమన్వయ స్థితి స్థాపనకు, అద్భుతమైన కార్యాచరణ ప్రణాళికతో గురుపరంపర వారి శిష్యసమూహముతో ఈ శక్తిని నాలుగవదియైన మానవజాతిలో విస్తరణకు పనిచేయవలసి ఉన్నది. వాహికలు తయారు చేయబడవలసి ఉన్నది. మాస్టర్ C.V.V. వాహికలకు 'మీడియమ్స్' లేక మాధ్యమములు అన్న

పేరు వాడారు. 'న్యూ గ్రూప్ ఆఫ్ వరల్డ్ సర్వర్స్' అనుబడు పేరును మాస్టర్ D.K. గారు వాడుకలోనికి తెచ్చారు. వాహికలు, మీడియమ్స్, న్యూ గ్రూప్ ఆఫ్ వరల్డ్ సర్వర్స్‌ను మానసిక, భావ, భౌతిక అను మూడు కక్ష్యలలో తయారు చేయవలసి ఉన్నది. ఈ మీడియమ్స్ వారి జీవితములలో ప్రేమపూరితమైన అవగాహన ద్వారా ఒక ఉదాహరణగా శాస్త్రములో తెలిపిన దానికంటే మిన్నగా మార్గదర్శకులుగా ప్రవర్తించాలి. జీవితములో మంచిది, అందమైనది, సత్యమైనది అయిన విషయములను వారి జీవనము ద్వారా మానవులు గ్రహించునట్లు చేయాలి. మంచి ఆలోచనతో, గుడ్డి ప్రేరణ అనుదానిని క్రమముగా తొలగించుటకు వీరు ప్రయత్నిస్తారు. మూఢ నమ్మకములు, కల్పనతో కూడిన భావోద్వేగములు, భ్రాంతులు అనువానిని తెలివైన అవగాహనతో మార్చాలి. సంక్షిప్తముగా మీడియమ్స్ యొక్క పని– ప్రకృతి నియమములను తెలివిగా ఆచరించి, అందరినీ కలుపుకొనిపోవు పద్ధతిలో బృందములను తయారుచేయుట.

నిరంకుశ, మోసపూరిత ధోరణితో రక్త పిశాచులవలె జనాన్ని పట్టి పీడించువారిని, సిద్ధాంతములు, నమ్మకములు, నినాదములు చేయువారిని గూర్చి మానవజాతికి బోధన ఇవ్వబడు చున్నది. స్వార్థపూరితమైన రాజకీయ సిద్ధాంతముల పట్ల అవగాహన కల్పింపబడుచున్నది. రక్షకులవలె కన్పించుచు, చాలా సిద్ధాంతములు మానవులను, జాతులను, దేశములను బుట్టలో పడవేయుచున్నవి. ఈ తెలివైన ఆటను బహిర్గతముచేసి, నిజమైన ప్రజాస్వామ్యమునకు బాటలు వేయబడుచున్నవి.

తెలివైన నవయుగ బృందములు ఆర్థిక, రాజకీయ, రక్షణ, శాస్త్ర, మత, పరిపాలనా విభాగ, వ్యాపార, కళల వంటి అన్ని విభాగములలోనూ త్వరితముగా తయారు చేయబడుచున్నారు. ఈ బృందము లన్నియూ ప్రతి భాగములోనూ, సానుకూల ధోరణితో వ్యవహరిస్తాయి కాని అవి ఎటువంటి తెగలకు, సిద్ధాంతములకు, జాతులకు చెందినవి కావు. వారు పాత కాలమునకు చెందిన హద్దులకు అతీతముగా ఉన్ననూ వాని ద్వారా పనిచేస్తారు. భావోద్వేగములకు చెందిన మతవాదులవలే కాక వారు ఆచరణాత్మకమైన ఆధ్యాత్మికవాదులు.

'ది అవతార్ ఆఫ్ సింథసిస్' గురుపరంపర ద్వారా పనిచేస్తారు. గురువులు వారి శిష్యులద్వారా పనిచేస్తారు. ఆ శిష్యులు మానవ కార్యక్రమములలో మానసిక, భావ, భౌతిక కక్ష్యలలో సర్దుబాట్లు, దిద్దుబాట్లు చేస్తారు. నిశ్శబ్దముగా గురుపరంపర, వారి అనుయాయుల కృషి ఫలితమే ఈ శతాబ్దములోని చివరి 25 సంవత్సరములలో ఆధ్యాత్మిక కార్యక్రమముల ఉప్పెన అయినది.

ఇటీవలి కాలములో ఒక మాస్టరుగారి ఆశ్రమము లోప భూయిష్టమైన పద్ధతులను, ప్రభుత్వ విధానముల సరిదిద్ది ఐక్యతను, స్వాతంత్ర్యమును కాపాడుటకై చురుకుగా పనిచేయుచున్నది. ఈ ఆశ్రమము ముఖ్యముగ మొదటి కిరణమునకు చెందిన ధీశక్తితో పనిచేస్తుంది.

రెండవ కిరణము (ప్రేమ, జ్ఞానము, బోధన)నకు చెందిన ఇంకొక ఆశ్రమము తెలివిగా పనిచేయుట, మంచి పనుల

అనుసంధానము, తెలివైన అవగాహన, నిర్ణయములు, మారుచున్న పరిస్థితులకు అనుగుణముగా పనిచేయుట వంటి విభాగములలో పనిచేయుచున్నది. ఈ ఆశ్రమము మానవజాతి సమన్వయము అను వేదికను త్వరితముగా చేరుటకు పనిచేయు చున్నది. మొదటి ఆశ్రమము దేశముల స్థాయిలో పనిచేయుచుండగా, రెండవది బృందముల స్థాయిలో పనిచేయుచున్నది. అనగా ధీశక్తి, ప్రేమలు కలసి పనిచేయు చున్నవి.

సమన్వయ శక్తి మనము అర్థము చేసుకొను పదములైన ధీశక్తి లేక ప్రేమ రెండూ కాదు. అది రెండూ కూడ. దానిని 'ప్రయోజనమునకై నిర్దేశింపబడిన సూత్రము'గా అర్థము చేసుకోవాలి. అది గ్రహింపబడినప్పుడు, ఇటువంటి ప్రారంభములు ఉంటాయి:

* గ్రహ ప్రణాళిక, మానవజాతి ప్రణాళికను అర్థము చేసుకొనుట.

* దృష్టి కేంద్రీకరింప గలుగుట.

* శక్తిని ఏకీకరణ చేయగలుగుట.

* ఒకే ప్రపంచాన్ని (ఖనిజము నుండి దేవతా సామ్రాజ్యము వరకు అన్నింటిని), ఒకే జీవనాన్ని, ఒకే మానవతను దర్శింప గలుగుట.

**ది మీడియమ్స్ :**

గురుపరంపర శక్తికి వాహికలు. వారి అధిపతి మైత్రేయ ప్రభువు. వారిని క్రైస్ట్ అని, మైత్రేయులని, బుద్ధుడని, ఇమామ్ మహదీ అని కూడా తెలుపబడ్డారు. ముందు తెలుపబడిన రెండు త్రిభుజములు (నియంత్రణ, బోధన) వారి శక్తికి ప్రవాహ మార్గములు. అనుయాయులు బలమైన వాహికలు. హెలీనా పెట్రోవా బ్లావెట్‌స్కీ, ఎలిస్ ఎ బెయిలీ, మాస్టర్ M.N., మాస్టర్ E.K. ఇంకనూ చాలామంది ఈ పనిలో సమర్ధతతో పనిచేశారు. మాస్టర్ D.K.గారు అనుసంధానకర్త, సూపర్‌మాన్ పూర్తిగా పనిలో మునిగి ఉన్నారు.

అవతారము దిగివచ్చినది. పని ఆవిష్కరింపబడినది. ఏదైనను సరియైన దృష్టితో అంగీకరించగల వారందరూ, అర్ధము చేసుకొని స్వీకరించి ఏకీకరణ కావచ్చును. అవతారము అందుకొన్నను, అర్ధము చేసుకొనుటకు ఇంకనూ వేచిచూడవలసి ఉన్నది. మనమందరమూ ఆ శక్తిని ఆవాహన చేసుకొని, అందించబడిన జ్ఞానముతో పనిచేసి, జీవపరిణామమును త్వరిత మొనరించుకొనుటకు ఇదొక గొప్ప సదవకాశము. మరల తరువాతి కుంభయుగము వచ్చుటకు 25,920 సంవత్సరములు పడుతుంది.

# 16.జీవితము,ఒకసంతోషకరమైనప్రయాణము

*“సముద్రాన్ని చేరే నదినే పవిత్రమైన నది అంటారు”*

పైనుండి దిగివచ్చు జలము ఒక ఆశీర్వచనముగా, ఒక వరముగా వస్తుంది. చిన్న కాలువలు ఒక ప్రయోజనమున కన్నట్లు మొదలౌతాయి. అవి తమ మూలాన్ని గుర్తుంచుకొని సహచరులను తెలుసుకుంటాయి. కాలువలన్నీ కలసి ఒకటౌతాయి. ఆ కారణముతో ఒక నది పుట్టుతుంది. దానియొక్క లక్ష్యమును బట్టి మార్గ నిర్ణయము చేసుకుంటుంది. అన్ని నదులూ ఒకే మూలము నుండి వస్తాయి. సముద్రాన్ని చేరే మార్గాన్ని ఎంచుకోవడము నది యిష్టము. అంతిమ లక్ష్యమును చేరినప్పుడే జీవితము పవిత్రమౌతుంది. దానిలో ఎగుడుదిగుళ్ళు ఉండవచ్చు. మార్గము మారవచ్చు, వంకలు రావచ్చు. వేయిసంఘటనలు త్రోవలో అడ్డు రావచ్చు. అయినను అది సముద్రాన్ని చేరాలి. అది ఎక్కడా ఆగకూడదు, నిలబడిపోకూడదు.

జీవన ప్రవాహము కూడ పూర్తిగా నిరాటంకముగా సాగాలి. ఉండుట అను స్థితికి వేయి పేర్లు ఉన్నవి. మాస్టర్ అనునది కూడా ఒక పేరు. పేరు దానికి అవరోధము. అదే తెలియజేయునది కూడ. ఉనికి అన్నది ఎల్లప్పుడూ తెర వెనుక ఉంటే, వివరణ దానికి

అనుగుణముగా ఉంటే, ఉనికి యొక్క ప్రసారము తెలియబడు తుంది. ఉనికి నుండి చేతన విడివడిపోతే, మనము పదములలో కొట్టుకొనిపోతాము. పదములు చాలా ఉన్నాయి, భాష విస్తార మైనది. కాని, ఒక శబ్దము అనేక విధములుగా ప్రకటిత మౌతుంది. అది ఎప్పటికీ ఒకటిగా ఉంటుంది.

మాస్టరుగారు మనకు ఇచ్చిన శబ్దము యొక్క సమన్వయము నకు మనము కట్టుబడి, ధారణ చేసినచో మనము మాట్లాడినను, పనిచేసినను, నిద్రించినను దాని చైతన్యములోనే ఉంటాము. అలా ప్రతి విషయములోనూ ఒకే 'ఉండుట' అనుభవములో నిరంతరమై ఉంటుంది.

జీసస్ ది క్రైస్ట్ తెలిపినట్లు "మనము జీవించుట, కదలుట, అతనిలోనే ఉండుట" అవుతుంది.

ఒకే జీవనము విస్తరణ చెందుటకై ప్రతిపాదించి విశ్లేషణ లోనికి వెళ్ళుచున్నది. అదే జీవనము ఏకత్వమును ప్రతిపాదించి మరల సమన్వయము పొందుచున్నది. ఈ ప్రతిపాదన మనది కాదు. ఎన్నడూ కాదు. విశ్లేషణ ఎన్నడూ ఉన్నది. అది సమన్వయము కొరకే. శాశ్వత ధర్మము అట్లే పనిచేస్తుంది. ఒక చివరి స్థితి చేరిన పిమ్మట ఆట పరిసమాప్తి అవుతుంది. అది అందరికీ కాదు. కొంతమందికి ప్రారంభమౌతుండగా, కొందరు మధ్యలో ఉంటే, కొందరికి పరిసమాప్తి అవుతుంది. కనుక జీవనమన్నది విశ్లేషణ ద్వారా విస్తరించువారికి, సమన్వయము ద్వారా ఒకటి అయ్యే ప్రయత్నము చేసే వారికి మధ్య గొప్ప పరస్పర చర్యగా ఉంటుంది

విజ్ఞానమన్నది అంతయూ బయటకు భిన్నముగా కనిపించినను, ఒకే మూలమునకు చెందిన ఒకే ప్రక్రియ. వెన్నకు ఉన్న వేరువేరు స్థితులవలె, గురువు, శిష్యుడు అను భిన్న స్థితుల పోలిక ఉంటుంది. వెన్న పాలలో ఉంటుంది. పాలను చిలుకుటతో, అది బయటకు వస్తుంది. పాలు వెన్నను ఇచ్చునంతవరకు, చిలుకుట అన్న క్రియను ఆపరు. దానికి ప్రత్యామ్నాయము లేదు. మధ్యలో దానిని ఆపివేస్తే, వెన్నగా బయటకు రావలసినది పాలు గనే ఉండిపోతుంది. అంతేవాసి (శిష్యుడు) సగము పాలు, సగము వెన్న అను స్థితిలో ఉంటాడు. మధ్యలో కలుగు సంఘర్షణ పట్టించుకోకుండా చిలుకుట జరుగుచునే ఉండాలి. చివరిగా వెన్న చక్కగా తయారై, పాలలో తేలుతుంది. గురువు యొక్క స్థితి అదియే.

జీవనము ఒక ప్రయాణమయితే అందరూ ప్రయాణీకులే. కొంతమంది ముందుంటే, కొంతమంది వెనుక ఉంటారు. అయిననూ అందరి ప్రయాణము జరుగుచునే ఉంటుంది.

వచ్చు స్టేషన్లు, గమ్యమునకై ఎదురుచూస్తూ జీవిస్తే, మనము ప్రయాణ అనుభవాన్ని కోల్పోతాము. దానిని పూర్తిగా అనుభవించము.

మనము ప్రయాణములో నున్నప్పుడు, ప్రయాణమును ఆనందించుట కోరదగిన విషయము. తోటి ప్రయాణీకులతో ప్రేమగా వ్యవహరించండి. ప్రకృతి మన ముందుంచు పూలను,

చెట్లను, రూపములను, చోటును, భూమ్యాకాశముల కలయికగా కన్పించుదానిని అంతటినీ గమనించండి.

ఒక పెద్ద ప్రయాణములో చాలా చిన్న ప్రయాణములు ఉంటాయని గుర్తుంచుకోవాలి. వ్యామోహములపట్ల మనము దూరముగా ఉండుట మంచిది. మనము వేరు ఆలోచనలో ఉండుట విసుగునకు దారితీస్తుంది.

కొందరు నిశ్శబ్దముగ ఉంటే, కొందరు నిద్రలోనికి వెడితే, కొందరు చర్చ పేరుతో వాదులాటకు దిగితే, కొందరు ఒక పుస్తకాన్ని పట్టుకుంటారు. వీరెవ్వరూ ప్రయాణము యొక్క పూర్తి అనుభూతిని పొందలేరు.

కొందరు ప్రాణము లేని అక్షరములను కోరతారుకానీ, తమముందు ప్రత్యక్ష ప్రమాణముగా నిలచిన గురువును చూడలేరు. ఉన్నది ఒకే పుస్తకము కానీ దానికి ఇంకొక పోలిక లేదు. అది ఇక్కడ తెరువబడి ఉన్నది. అది అగ్నితో ధ్వంసము చేయబడనిది, నీటితో తడుపబడనిది, గాలితో కొట్టుకొనిపోనిది, మట్టిలో కలిసిపోనిది.

అదియే జీవన గ్రంథము. మన స్వంత జీవనము. సంవత్సరములు అందులో ప్రకరణలు. రోజులు అందులో పుటలు. గంటలు పేరాలు. నిమిషములు వరుసలు. క్షణములు పదములు.

చాలా ప్రకరణములు మనకులేవు. ఎందుకంటే ప్రతిరోజును మనము జీవించుటలేదు. భగవద్గీత కాని, బైబిల్ కాని చదివిన

ప్రతి ఒక్కరికీ జ్ఞానము నివ్వలేదు. మనకు అనుభవము నిచ్చుటకు ఇవ్వబడిన జీవనముపట్ల మనము గుడ్డిగా ఉంటే, ఆ పుస్తకములు మనకేమియు తెలుపలేవు. ప్రతి క్షణము జీవించి, జీవితములో ప్రతి క్షణము అనుభవించినవారు సిద్ధులయ్యారు కానీ, పుస్తకములు చదివినవారు కాలేదు. పుస్తకములు మార్గమును చూపి, ఆసక్తి కలిగిస్తాయి. క్రియ దానిని ప్రారంభిస్తుంది.

గమ్యమును గూర్చి మనము పట్టించుకో నక్కరలేదు. మన గ్రహమే ఒక ప్రయాణములో నున్నదని మనము గుర్తుంచుకోవాలి. ఆ గొప్ప ప్రయాణములో మనదొక చిన్న ప్రయాణము. మనము తప్పక గమ్యమును చేరుతాముకాని, దానికి ప్రయాణము తప్పని సరి. మనము ఆనందముగా ఉంటామా లేక చీకాకుగా ఉంటామా అనునది ఎంపిక చేసుకొనుట మనకే ఇవ్వబడినది. కనుక సరియైన ఎంపిక చేసుకొని, ప్రయాణములో చక్కని అనుభూతిని పొందుదాము.

మనము ఒక విమానములో ఉన్నామనుకోండి. మనము ఎంత కావలె ననుకొన్నను, మనము చేరవలసిన చోటునకు, మనమున్న విమానము చేరు సమయమున కంటే ముందుగా చేరలేము. కావున మనము అందరికంటే ముందుగానో, తరువాతనో చేరుతా మనుకొనుటలో అర్థము లేదు. కావున ప్రయాణములోని ప్రతి చిన్న విషయమును ఆనందించండి. ఇక్కడే, ఇప్పుడే జీవించండి.

చోదకుని మనము నమ్మదాము. అప్పుడు మాత్రమే విశ్రాంతిగా ఉండగలుగుతాము. మనము నడుపుటలేదు. మనము నడపబడుచున్నాము. అతనిని నమ్మితే మనము ప్రయాణమును ఆనందించగలము. లేనిచో ప్రయాణము చింతలబారిన పడుతుంది. మనము చోదకునికి సహకరించ గలుగు ఉత్తమ మార్గము మన స్థానములో ప్రశాంతముగా కూర్చుండుటయే.

అలసట పేరుతో మనము ప్రయాణము మానుకోలేము. మన భూగ్రహము కూడ అలా అనుకుంటే ఏమవుతుంది?

కనుక ఈ ప్రయాణము ఉనికిని అనుభవించుటకే.

కనుక మాస్టర్ C.V.V. గారు తెలిపిన దాని అర్థము

*"ప్రస్తుతమును పోగొట్టుకున్నవాడు, జీవితములో అంతా పోగొట్టుకుంటాడు. కావున ప్రస్తుతములో జీవించండి."*


# 17. అవరోహణ

*''అవరోహణ ఆరోహణకు సహకరిస్తుంది''*

మన సూర్య మండలము అంతరిక్షములో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన విభాగము కాదు– అలాగే మన గ్రహము, మనము కూడా. చైతన్యము యొక్క ప్రతి ఒక్క విభాగము చూచుటకు స్వతంత్రముగా కనిపించినను, సత్యమునకు వాని ఆధారము పరస్పరమైనటువంటిది. మన సౌర మండలము 5 మండలముల బృందంలో ఒక భాగమైతే, దానిని ఏడుగురుతో కూడిన బృందమొకటి నడుపుచున్నది. 7 పై స్థాయిలో నున్న మండలములు 5 క్రింది స్థాయిలోని మండలములకు మార్గదర్శకులుగా పనిచేయు చున్నవి. సౌర కక్ష్యకు చెందిన బృందములు 12. అవి సృష్టిని నడిపించుచున్నవి. ఇది నిగూఢమైన సత్యము, భవిష్యత్తులో నిజము. పురాతన శాస్త్ర గ్రంథములు దీనిని ప్రకటించినవి.

మన సౌరమండలమునకు, త్రిభుజములుగా సప్తర్షి మండలము, కృత్తికలు మరియు దత్తాత్రేయ మండలము మూడు వైపుల నుండి మార్గదర్శకత్వము నిచ్చు చున్నవి. సప్తర్షి మండలము (గ్రేట్ బేర్) లోని ఏడుగురు ఋషులు– తండ్రి అవుతారు. కృత్తికా మండలము (ప్లీయాడ్స్) ఏడుగురు తల్లి అవుతారు.

దత్తాత్రేయ మండలము (సిరియస్) మన సౌర కుటుంబమునకు మార్గదర్శకత్వము వహించు కుమారుడు ఔతాడు. ధీశక్తి (విల్) సప్తర్షి మండలము నుండి ఇవ్వబడుతుంది. క్రియాశీలముగా పనిచేయు శక్తి కృత్తికా మండలము నుండి ఇవ్వబడుతుంది. ప్రేమతో సంరక్షణ శక్తి సిరియస్ నుండి వచ్చి, మన సౌరకుటుంబమునకు కావలసిన పోషణ ఇవ్వబడుతుంది.




మొదటిది మన ధీశక్తిని, రెండవది మన మనస్సును, మూడవది మన హృదయమునకు మార్గమును సూచిస్తాయి. అంతరిక్ష ప్రజ్ఞయైన ధీశక్తి మన భూమిపై శంబళ అను ఒక పవిత్రమైన ప్రదేశములో అందుకొనబడుతుంది. అక్కడ భూమికి ప్రభువైన సనత్కుమారుడు నివసిస్తాడు. అంతరిక్షము ప్రేమ సిరియస్ నుండి భూమికి (నీలగిరుల ద్వారా) హిమాలయములోని

ఒక పవిత్రమైన ప్రదేశములోనికి అందుతుంది. తెలివితో కూడిన క్రియ ప్రకృతిమాత నుండి మొత్తము భూమిమీది మానవజాతి మనస్సునకు భూగ్రహములోని ఒక కేంద్రమునకు అందుతుంది. మానవజాతి మొత్తము మనస్సును కలిపి మనువు అంటారు.

మనుష్యులలో కృత్తికల శక్తి ఎడమకంటి ద్వారా పనిచేస్తుంది. సిరియస్ శక్తి కుడికంటి ద్వారా పనిచేస్తుంది. సప్తర్షి మండలము యొక్క శక్తి మూడవ కంటి ద్వారా పనిచేస్తుంది కానీ ప్రస్తుత మానవజాతికి అది పనిచేయుట లేదు. మునుపటి చాక్షుస మన్వంతరములో ఈ కన్ను పనిచేసేది.

ఇప్పుడుకూడ బాగా పురోగతి చెందిన మానవులలో ఇది పనిచేస్తున్నది. ఎడమకన్ను యొక్క పని చూపు, కుడికన్ను యొక్క పని జ్ఞానము, మూడవకన్ను యొక్క పని చూపుకన్న అతీతమైన విషయములను చూడగలుగుట. ఇప్పటి మానవజాతి కన్ను యొక్క పనిని సాధారణమైన చూపు నుండి జ్ఞానమునకు, అక్కడి నుండి అతీతమైన దృష్టికి పెంచుకోగలగాలి. చూపు మనకు ఇప్పటికే ఉన్నను, కుడికన్ను యొక్క జ్ఞానమును పొందగలుగుట మన తక్షణ కర్తవ్యము. ప్రస్తుత మానవ కార్యక్రమమునకు అవసరమైన సూచన ఇదియే. జ్ఞానము, ప్రేమ అనునవి విడదీయుటకు వీలు కానివి. అవి ఆత్మకు ఒకటిగా కనిపించు రెండు కొలతలు లేక మార్గములు. మానవుని ప్రస్తుత కర్తవ్యము మనస్సుతో ఆలోచించుటకు బదులుగా హృదయములో ఆలోచించాలి. హృదయములో

ఆలోచించుట అనునది ప్రేమను, జ్ఞానమును అనుభూతి చెందుటకు ముఖ్యమైనది. మనస్సు నుండి హృదయమునకు ఎదుగుటకు, స్వార్ధపూరితమైన తన భావన నుండి హృదయముతో ఏకమగుటకు కాలము మానవజాతికి ఒక అవకాశమును కల్పించినది. భూమిపై జరుగు విషయము లన్నియు సూక్ష్మముగా చూచినప్పుడు, దీనిని సూచించు చున్నవి.


20వ శతాబ్ద ఆరంభములో అటువంటి ఉపదేశ మిచ్చుటకు సరియైన కాలముగా భావించబడినది. 12 రాశుల ద్వారా సిరియస్, గ్రేట్ బేర్, ప్లీయాడ్స్ యొక్క ముఖ్య శక్తులను అవతరింపజేయుటకు (ముఖ్యమైన శక్తి ప్రేమ – జ్ఞానము – సమన్వయము) భావింపబడినది. ఈ మూడు ముఖ్యమైన శక్తుల కలయిక ఏకత్వముగా, సమన్వయముగా, క్రమముగా 4 స్థితులలో క్రొత్తగా దిగివస్తుంది.



హృదయ పద్మము ద్వాదశ (12) దళముల పద్మముగా – నాలుగు త్రిభుజములతో కూడిన పద్మముగా నుండుట ప్రముఖముగా గమనింపదగినది.


సిరియస్ దిగివచ్చి భూగ్రహము యొక్క పనిని మనస్సు నుండి హృదయమునకు పెంచుచున్నది. ఇది మానవుని హృదయ కేంద్రములో జరుగుచున్నది. 12 దళముల హృదయ పద్మము సిరియస్ నుండి పంపబడిన సమన్వయ శక్తిని ఈథర్ ద్వారా రాశి చక్రములోని 12 రాసులనుండి అందుకొనుచున్నది.

సిరియస్ లోని సూర్యుడు మన సౌరమండలమునకు ధనాత్మకముగా ఉండగా, మన సౌరమండలము ఋణాత్మకముగ సిరియస్‌లోని సూర్యునికి ఉన్ముఖమై ఉన్నది. ఈ ఉన్ముఖత శక్తి ప్రవాహము సిరియస్ నుండి మనకు వచ్చుటకు సహకరించు చున్నది. ఇంద్రుడు, వరుణుడు, శని యొక్క గ్రహమండలములు కలసి దీనిని నిర్వహించు చున్నవి.




మకర రాశిలో (1989-92) లో పై మూడు గొప్ప గ్రహములు చేరుటతో కొన్ని క్రొత్త విషయములు భూమిపై ప్రారంభమైనవి. అధికార బలముతో అణచివేయు ప్రభుత్వములు కూలిపోయినవి. ఐరోపాలో సామాజిక, రాజకీయ తిరుగుబాట్లు, ఆర్థిక వ్యవస్థలో తిరుగుబాట్లు, రాబోవు ప్రపంచ ధోరణికి సూచనగా గ్రహింప వచ్చును.


సిరియస్ నుండి వచ్చుచున్న సమన్వయ ప్రవాహము రాశి చక్రములోని రాశుల ద్వారా మన కక్ష్యల లోనికి ప్రవేశించు చున్నది. ఇంద్రుడు, వరుణుడు, శని గ్రహములు మూడూ కలసి మన గ్రహముపై ఎటువంటి ప్రభావాన్ని చూపాయో మనము చూశాము. రాశి చక్రములోని రాసులు కూడ త్రిభుజములుగా ఏర్పడి పనిచేయుట, ప్రకృతిలో అన్నియు త్రిభుజములుగా పనిచేయుటను తెలుపుతుంది. సిరియస్ యిక్కడ వృశ్చికరాశికి సంబంధించినదై, సింహమునకు కోణదృష్టి కలిగి యున్నది. సింహ, వృశ్చిక రాశుల కలయిక, మకరములో దీక్షను ఇస్తుంది. సింహరాశికి సిరియస్ తో కోణదృష్టి ఉండుట వలన సిరియస్ తన శక్తిని రెగ్యులస్ పై కేంద్రీకరిస్తుంది. సింహరాశికి కేంద్ర సూర్యుడు రెగ్యులస్, ప్రముఖముగా ''సూర్యుని హృదయము''గా తెలుపబడతాడు.




సౌర మానములో పశ్చిమములోని ఆధ్యాత్మికులు మిథున పూర్ణిమను (ఫుల్ మూన్ ఆఫ్ క్రైస్ట్) హెచ్చుగా దీక్షనిచ్చు రోజుగా భావిస్తారు. తూర్పు దేశములవారు ధనూరాశిలో వచ్చు పూర్ణిమను హెచ్చుగా దీక్షనిచ్చు రోజుగా భావిస్తారు. మిథున ధనూరాశులు



మైత్రేయ మహర్షి



శ్రీ దత్తాత్రేయుడు


ఒకదానికొకటి అభిముఖముగా నున్నట్లు కనిపిస్తాయే కానీ, అవి ఒకే నాణెమునకు రెండు వైపుల వంటివి. మిథున పూర్ణిమ మైత్రేయ ప్రభువు పూర్ణిమ (పశ్చిమ దేశాల వారు వారిని క్రైస్ట్ అని, బౌద్ధులు మైత్రేయ బుద్ధుడని అంటారు). వారు జగత్ గురువులు. వారు సాధకులను మనోస్థితిలో నుండి, హృదయ స్థితి లోనికి సేవ, త్యాగముల ద్వారా కొనిపోవు దీక్ష నిస్తారు. ధనూ రాశిలో వచ్చు పూర్ణిమ దత్త పూర్ణిమ. వారు ప్రేమ, జ్ఞానములు బోధిస్తూ ఈ భూమిపై గుర్తించుటకు వీలుకానన్ని రూపములలో తిరుగుతుంటారు. దత్తాత్రేయ ప్రభువు మూడు తలలు, నాలుగు చేతులు కలిగి, వారిని నాలుగు కుక్కలు అనుసరిస్తుంటాయి– సిరియస్ లేక డాగ్ స్టార్‌కు సామ్యము. మైత్రేయ, దత్తాత్రేయులు, ఆత్రేయులు మూడింటికి ఆవలివారు. సృష్టిలోని త్రిభుజములైన శక్తులచే బంధింపబడని ఉన్నతమైన ఆత్మలు. జీవులకు ముక్తిని ప్రసాదిస్తారు. వారు మిథున – ధనూ రాశుల అక్షము ద్వారా పని చేస్తారు.

భూ గ్రహమునకు, భూమిపై వారికి ఉన్నతమైన దీక్ష నిచ్చుట భవిష్యత్తులో సింహ పూర్ణిమలో జరుగును. సింహ పూర్ణిమలో సిరియస్ శక్తిని స్పృశించుట వీలవుతుంది. రాబోవు సంవత్సరములలో సింహ పూర్ణిమ అంతేవాసుల (శిష్యుల) పూర్ణిమ అవుతుంది. సింహము మిథునముతో అర్ధకోణ దృష్టిని, ధనుస్సుతో కోణదృష్టిని కలిగి ఉండుట వలన ప్రాక్, పశ్చిమ ఆధ్యాత్మిక భావములలో ఏకత్వము కలిగిస్తుంది.

వృశ్చికము యొక్క సంబంధము ఉన్నచోటు వలన కలిగితే, సింహము సిరియస్‌కున్న కోణదృష్టి వలన కలుగుతుంది. సిరియస్ ద్వారా అందు అంతరిక్ష శక్తులకు మిథునము సింహద్వారము. కావున మిథునము భూమికి, భూమిజీవులకు దీక్షనిచ్చు నెలగా కొనసాగుతుంది. మాస్టర్ C.V.V. గారు కూడ సమన్వయ శక్తికి దీక్ష నిచ్చుటకై మిథున మాసాన్నే ఎన్నుకొనుట మనోరంజకమైనదిగా గుర్తించాలి. మే కాల్ డే దీక్షనిచ్చు దినము. ప్రతి సంవత్సరము మే మాసములోని 29 వ తేదీని దానికై స్థిరపరిచారు. 1910 సంవత్సరము నుండి చాలామందికి యోగ మార్గములో దీక్ష ఇవ్వబడింది.

సిరియస్ యొక్క శక్తి సింహరాశి ద్వారా ప్రయాణిస్తుంది. సింహరాశి పాలకుడు సూర్యుడు. సిరియస్‌లోని ఉన్నత శ్రేణికి చెందిన శ్వేతబృందము, మన భూమిపై నున్న శ్వేతబృందము లకు ఉత్సాహాన్ని ఇచ్చి, వారి ద్వారా పని చేయిస్తుంది. సిరియస్, సింహరాశులు ప్రేమకు, జ్ఞానమునకు సంబంధించినవి. అవి హిమాలయములోని కేంద్రమునకు సరిపడుతుంది. మాస్టర్ C.V.V. గారు ఆగష్టు 4వ తేదీన జన్మించారు. వారి జనన సమయములో సూర్యుడు సింహరాశిలోనూ, చంద్రుడు కుంభ రాశిలోనూ (ధనిష్ఠ నక్షత్రములో) ఉన్నారు. కుంభరాశి సింహ రాశికి ప్రతి అయిన పురుష రాశి, సింహరాశి కుంభరాశికి ప్రతి అయిన స్త్రీ రాశి. మాస్టరుగారి జనన సమయమును బట్టి జ్యోతిష శాస్త్రము తెలిసినవారు కావలసినన్ని సంకేతములు కనుగొన

గలరు. పురుష రాశి అయిన కుంభరాశిలో స్త్రీ గ్రహమైన చంద్రుడు ఉండగా, స్త్రీ రాశి అయిన సింహములో పురుష గ్రహమైన సూర్యుడు ఉన్నాడు. నూతన యుగమునకు సంబంధించి సింహ–కుంభ రాశులు స్థిర రాసులకు సంబంధించిన క్రాస్ లోని అడ్డ రేఖ కాగా, వృషభ – వృశ్చిక రాశులు క్రాస్ లోని నిలువు రేఖ అవుతుంది.





స్థిర రాశుల క్రాస్ శిష్యులకు సంబంధించిన ది సిరియస్ చే పాలింపబడుతుంది. చర రాసులకు సంబంధించిన క్రాస్ (మేష – తులా రాశులు, కర్కాటక – మకర రాశులు) సిద్ధులకు సంబంధించినది, జ్ఞానమూర్తులైన గురువులకు సంబంధించినది. ద్విస్వభావ రాశుల క్రాస్ (మిథున – ధనూ రాశులు, కన్య – మీనరాశులు) ఉపదేశము పొందనివారికి సంబంధించినవి.

హెచ్చు సంఖ్యలో దీక్షను ద్విస్వభావ రాశుల క్రాస్ పై 'ప్రవేశించిన సాధకులకు' మిథున – ధనూ రాశులలో ఇచ్చుటకై ప్రతిపాదింపబడినది. స్థిరరాశుల క్రాస్‌లో ప్రవేశించిన సాధకులకు శిష్యులుగా శిక్షణ నివ్వబడుచున్నది. మనిషి ఎప్పుడైతే అంతేవాసి మార్గమును ప్రవేశిస్తాడో, జీవన ప్రాముఖ్యత రూపము వైపునుండి,


ఆత్మ వైపు అనగా లోపల దాగియున్న జీవనము వైపు మరలు తుంది. స్వార్థపూరితమైన భావములు బలహీనపడుతూ, సేవ వైపు ప్రాముఖ్యత హెచ్చుతుంది. బృంద సంక్షేమమునకై, వ్యక్తిగత భావాలు వదలివేయ బడతాయి.

ఈ పద్ధతి అంతయూ నిదానమైనను, క్రమముగా తప్పక జరుగుతుంది. స్థిర క్రాస్ లోని వృషభము ఆశయమను వెలుగును సూచిస్తుంది. వృశ్చిక మందలి గరుడుడు విముక్తి అను వెలుగును సూచిస్తుంది. సింహరాశి యందలి సింహము ఆత్మ యొక్క వెలుగును సూచిస్తే కుంభములోని మనిషి ప్రపంచము యొక్క వెలుగును సూచిస్తాడు. అలా సాధకుడు పురోగతి చెంది క్రమముగా నిస్వార్థ సేవ ద్వారా వ్యక్తిగత కక్ష్యనుండి విముక్తుడై ఆత్మను తెలుసుకొని, చివరిగా ప్రపంచమునకు వెలుగుగా పనిచేస్తాడు. నత్త నడకతో శని దీనిని నడిపిస్తాడు.


స్థిర క్రాస్ కు సంబంధించి మాస్టరుగారి జాతకములో గ్రహములు ఉన్న రాసులను, మనోరంజకముగా మనము గమనిద్దాము.




నిలువు అక్షమైన వృషభ – వృశ్చికములపై, యముడు, శని ఉండుట మనము గమనిస్తాము. సమాంతర అక్షమైన సింహ కుంభములపై, సూర్య చంద్రులే కాక, రాహు, కేతువులను కూడా గమనిస్తాము.




ద్విస్వభావ రాశుల క్రాస్ పై, వారికి మిథునములో కుజుడు మాత్రమే ఉన్నాడు. గుప్తవిద్యను (రహస్య విద్య) కుజుడు భూమిపై క్రతు విద్యకు సంబంధించిన పాఠశాలల స్థాపనకై పనిచేయు చున్నాడని తెలుపుతుంది. ఈ గుప్తమైన/పవిత్రమైన పాఠశాలలు భూమిపై సరియైన విద్య నిచ్చుటకు ఉద్దేశింపబడినవి, కుజ గ్రహములోని ఒక పవిత్ర కేంద్రము నుండి పరిపాలింపబడు చున్నవి. సూర్యవంశమునకు చెందిన ఒక ఉన్నతమైన సిద్ధుడు తన శిష్యులతో భూమిపై ఈ పాఠశాలలను నడుపుచున్నాడు. మాస్టర్ C.V.V. గారు గురుపరంపర ద్వారా నడుపబడుచున్న ఈ కార్యక్రమమునకు తన శక్తిని జోడించుట సహజమే. వారు హెచ్చు సంఖ్యలో ప్రజలకు దీక్ష నిచ్చుట, మిథునములోని అంగారకుని సహకారముతో జరుగుచున్నది.




సిద్ధులకు సంబంధించిన చరరాశుల క్రాస్‌పై మాస్టరుగారికి

మేషములో – గురువు, ఇంద్రుడు.

తుల – లగ్నము.

కర్కాటకము – ఆకాశ మధ్యము, వరుణుడు, శుక్రుడు, బుధుడు.

అటువంటి రాశుల కూటమి చర రాశి క్రాస్ పై నున్నదాని భావము సూక్ష్మబుద్ధి గలవారు గ్రహింపగలరు.

అంతరిక్షము నుండి సమన్వయ శక్తి దిగివచ్చుట, మాస్టరుగారి జన్మకుండలితో దానికిగల సంబంధము, అవతార్ ఆఫ్ సింథసిస్ యొక్క కార్యక్రమము. ఇంకనూ లోతుగా ఆలోచించి సత్యమును తెలుసుకొనగోరు వారికై ఇవ్వబడినవి.


## ధనిష్ఠ ప్రచురణలు


# మాస్టర్ పార్వతీకుమార్‌గారి రచనలు










ప్రతులకు :

ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531.
www.dhanishta.org info@dhanishta.org

ఎవరైతే C.V.V. అను శబ్దమును ఉచ్చరిస్తారో, వారిలో నిద్రాణస్థితిలో నున్న సమన్వయశక్తి ఒక పద్ధతిలో అంతరిక్షమునకు, సౌరశక్తికి, భూమియొక్క శక్తికి అనుసంధానము చెంది ప్రచోదన మౌతుంది. అలా ప్రచోదనము చెందినప్పుడు మనిషిలోని ఘనీభవించిన స్థితి కరగుట మొదలౌతుంది. అప్పుడు మనిషి భావములు విశాలమై ప్రతి పద్ధతిని, ప్రతి ఇతర భావమును, విశ్వాసములను, గురువులను ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించ గలుగుతాడు. యోగముతో అనుసంధానమగుట సహజమౌతుంది. ఆ స్థితిలో అతడు మంచి చెడ్డలు రెండింటిని సమభావంతో స్వీకరిస్తాడు. మంచి, చెడ్డలనునవి ఒక దృక్పధములని గుర్తించి, వానికి పై స్థితి అయిన "నేను" అను ప్రజ్ఞగా జీవించుట అను దృష్టి వస్తుంది.

ధనిష్ఠ